ఏప్రిల్
2018

144

సంపుటి : 12 సంచిక : 12 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

వ్యవసాయ సమస్య భారతదేశం

తెలంగాణలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్

ప్రభుత్వ బ్యాంకులపై నయా ఉదారవాద దాడి

బిజెపి అంతర్జాల మాఫియా గుట్టు రట్టు

క్యూబాలో సహకార సంఘాలు

విశ్వవిద్యాలయాలపై దాడి

దాతృత్వ మాయగాళ్లు

కార్పొరేట్ కనుసన్నల్లో ప్రజారోగ్యం

కాలజ్ఞాని, విశ్వ విజ్ఞాని

# కాలజ్ఞాని, విశ్వ విజ్ఞాని

**ఎస్. వెంకట్రావు**

శరీరమంతా సహకరించకపోయినా వీల్‌ఛైర్‌లో ఉంటూనే విశ్వాంతరాళాను పరిశీలించి, పరిశోధించి అనేక శాస్త్రీయ విషయాలు ఆవిష్కరించిన శాస్త్రవేత్త ఆయన. రెండు మూడేళ్ల కన్నా ఎక్కువ కాలం బతకడం కష్టమని వైద్యులు తేల్చేసిన తరువాత కూడా మృత్యువుతో పోరాడి 55 ఏళ్లు అదనంగా జీవించడమే కాదు తన శాస్త్ర పరిశోధనల ద్వారా మనిషికి మరణానంతర జీవితం లేదని తేల్చి చెప్పిన హేతువాది. మాట రాకపోయినా, చేతులు, కాళ్లు పడిపోయినా ప్రపంచానికి ప్రకృతి భౌతిక సూత్రాలను సులభశైలిలో వివరించిన విజ్ఞాని ఆయన. తమను కష్టాల నుండి కడతేర్చే 'దేవుని' కోసం వెదుకుతూ ప్రజలు రాళ్లూ, రప్పలు, బాబాల ముందు మోకరిల్లుతున్న నేటి ప్రపంచంలో... ఈ చరాచర జగత్తంతా భౌతిక సూత్రాల వల్ల నడుస్తున్నదేగాని దీన్ని ఏ దేవుడూ సృష్టించలేదు, నడిపించడం లేదు అని శాస్త్రీయంగా నిరూపించిన మహా శాస్త్రజ్ఞాని...

ఆయన పేరు స్టీఫెన్ హాకింగ్. ఈ నెల 14న ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జిలో మరణించిన 76 ఏళ్ల హాకింగ్ జీవితం ఆదర్శప్రాయం. శాస్త్ర విజ్ఞాన రంగంలో ఆయన చేసిన కృషి ఐన్‌స్టీన్ తరువాత అంత గొప్పది. నేటి భౌతిక శాస్త్రవేత్తల్లో అత్యంత ప్రతిభావంతుడిగా ప్రఖ్యాతి పొందిన హాకింగ్ శారీరకంగా కదలలేని పరిస్థితుల్లోనే అనేక పరిశోధనలు గావించి మహత్తర ఆవిష్కరణలు చేశారన్న విషయం తెలుసుకుంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఆయన రాసిన కాలం సంక్షిప్త చరిత్ర కోటి కాపీలు అమ్ముడుపోవడమే కాదు, ప్రజల్లో ఖగోళ భౌతిక శాస్త్రం పట్ల గొప్ప ఆదరణను పెంపొందించింది.

1942 జనవరి 8న ఇంగ్లండులోని ఆక్స్‌ఫర్డ్‌లో స్టీఫెన్ హాకింగ్ జన్మించారు. హాకింగ్ తల్లి ఇసబెల్ హాకింగ్ బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. అందువల్ల చిన్నప్పటినుండి హాకింగ్‌కు అభ్యుదయ భావాలు అబ్బాయి. 13వ ఏట హాకింగ్ తత్వవేత్త, గణిత శాస్త్రవేత్త బెర్ట్రాండ్ రస్సెల్‌ను ఆదర్శంగా తీసుకున్నాడు. కేంబ్రిడ్జ్‌లో చదువుతుండగానే తన 20వ ఏట



జేన్ వైల్డ్‌తో ఆయనకు పరిచయం ఏర్పడి తరువాత వివాహానికి దారితీసింది. విశేషమేమంటే జేన్‌ను కలుసుకున్న రెండు మాసాలకే 1963 ఆరంభంలో ఆయనకు ఎఎల్ఎస్ అనే భయంకరమైన నరాల వ్యాధి ఉన్నట్లు తేలింది. ఎమ్యోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ అనే ఈ వ్యాధి సోకిన వారు రెండేళ్లకన్నా ఎక్కువ కాలం బతకరు. నాలుగేళ్ల కన్నా ఎక్కువ బతికినవారు ప్రపంచంలో లేరు. కాని హాకింగ్ మృత్యువుతో పోరాడి మరో 55 ఏళ్లు జీవించారు. ఈ వ్యాధి సోకిన వారిలో ఒక్కో అంగం క్షీణించిపోతుంది. యువకునిగా ఉన్నప్పుడు గుర్రపు స్వారీ అంటే ఇష్టపడే హాకింగ్ క్రమంగా కాళ్లు, చేతులు, గొంతు పడిపోయి, చివరికి పూర్తిగా పక్షవాతం వచ్చి శరీరం కదపలేని స్థితికి చేరుకున్నారు. ఎలక్ట్రానిక్ వాయిస్ సింథసైజర్ ద్వారా మాత్రమే ఏ విషయమైనా చెప్పగలిగేవాడు.

జేన్‌తో వివాహం తన జీవితాన్ని మార్చేసిందని హాకింగ్ స్వయంగా చెప్పాడు. కాలేజీ రోజుల్లోనే ప్రేమించుకున్న ఇరువురూ 1965లో వివాహం చేసుకున్నారు. హాకింగ్‌కు వచ్చిన తీవ్రమైన వ్యాధి గురించి తెలిసి కూడా ఆయనను జేన్ వివాహం చేసుకోవడమే కాదు హాకింగ్‌కు అన్ని విధాలా అండగా నిలిచింది. వారికి ముగ్గురు పిల్లలు. అయితే తరువాతి కాలంలో జేన్ సాహిత్యంలో డాక్టరేట్ చేయడం, హాకింగ్ పరిశోధనల్లో మునిగిపోవడం మొదలైన కారణాలతో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. తరువాత హాకింగ్ తనకు సేవలు చేసే నర్సును వివాహం చేసుకున్నాడు. 2006 ఇద్దరూ విడిపోయిన తరువాత జేన్ మళ్లీ హాకింగ్‌కు దగ్గరయింది.

**గొప్ప ఆవిష్కరణలు**

ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ చదువుకున్న హాకింగ్ తరువాత కేంబ్రిడ్జి యూనివర్శిటీలో పరిశోధన ప్రారంభించాడు. అయితే కొద్ది సంవత్సరాలకే ఆయనకు నరాల వ్యాధి సోకి వీల్‌చైర్ పట్టాడు. మాట గురకలాగా మారిపోయింది. ఆయనను బాగా ఎరిగిన వారు మాత్రమే ఆ మాటల అర్థం తెలుసుకోగలిగేవారు. 1960వ దశకంలో అంతరిక్ష, ఖగోళ శాస్త్రాల్లో గొప్ప పరిశోధనలు జరిగాయి. విశ్వ సృష్టికి సంబంధించిన మహా విస్ఫోటనం (బిగ్ బ్యాంగ్), కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్) భావనలకు ఆధారాలు లభించడం ప్రారంభించాయి. లండన్ యూనివర్శిటీ కాలేజీలో ఖగోళ విషయాలకు సంబంధించి గణిత భౌతిక శాస్త్రవేత్త రోజర్ పెన్‌రోజ్ అభివృద్ధి పరిచిన గణిత సూత్రాలపై హాకింగ్ పరిశోధనలు ప్రారంభించాడు. ఈ కాలంలోనే ఆయన ఆరోగ్యం బాగా దిగజారింది. అయినా పట్టువదలక పరిశోధించి 'సింగులారిటీ' అన్న భావనను అభివృద్ధి చేశాడు. విశ్వంలో ఉండే పదార్థమంతా కుందించుకుపోయి ఒకే ఒక బిందువు దగ్గరకు వచ్చినప్పుడు అక్కడ భౌతిక శాస్త్ర సూత్రాలన్నీ పనికిరాకుండా పోతాయి. ఆ బిందువును 'సింగులారిటీ' అంటారు. దీనితోబాటు ఖగోళ వింతలైన బ్లాక్‌హోల్స్ (కృష్ణ బిలాలు) పైనా, విశ్వం పుట్టుకపైనా గొప్ప పరిశోధనలు చేశారు. 1974లో పేలిపోతున్న బ్లాక్ హోల్స్‌లో క్వాంటమ్ ఎవాపరైజేషన్ భావాలను రూపొందించారు. దీనికి "హాకింగ్ రేడియేషన్" అని పేరుపెట్టారు.

గణిత భౌతిక శాస్త్రానికి హాకింగ్ చేసిన గొప్ప సేవ ఏమంటే ఆయన 20వ శతాబ్దంలో భౌతిక శాస్త్రంలో జరిగిన రెండు మహత్తర ఆవిష్కరణలైన క్వాంటమ్ సిద్ధాంతాన్నీ, సాపేక్ష సిద్ధాంతాన్నీ జోడించడంలో గొప్ప పాత్ర వహించాడు. క్వాంటమ్ సిద్ధాంతం సూక్ష్మ ప్రపంచం గురించి అంటే అణువులు గురించి తెలుసుకోడానికి ఉపయోగపడుతుంది. దీన్ని మాక్స్

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. కాలజ్ఞాని, విశ్వ విజ్ఞాని
   ఎస్. వెంకట్రావు .................... 2
2. వ్యవసాయ సమస్య – భారతదేశం
   ఆర్. రామ్‌కుమార్ .................. 4
3. తెలంగాణలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్
   ఎస్. వీరయ్య ...................... 9
4. ప్రభుత్వ బ్యాంకులపై నయా ఉదారవాద దాడి
   ఎ. కోటిరెడ్డి .................... 12
5. బిజెపి అంతర్జాల మాఫియా గుట్టు రట్టు
   గుల్ల తిరుపతిరావు ............... 16
6. క్యూబాలో సహకార సంఘాలు
   క్లిఫ్ దురాండ్...................... 21
7. విశ్వవిద్యాలయాలపై దాడి
   జయతి ఘోష్.................... 24
8. దాతృత్వ మాయగాళ్లు
   పవన్ కులకర్ణి .................. 26
9. కార్పొరేట్ కనుసన్నల్లో ప్రజారోగ్యం
   టికె రాజలక్ష్మి.................... 31



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్:** ఎడిటోరియల్ **9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ఫైనాన్స్ పెట్టుబడి

కొద్ది వారాలుగా ప్రపంచ యవనిక మీద జరుగుతున్న పరిణామాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటివరకు స్వేచ్ఛా వాణిజ్య గీతికలు ఆలాపించిన అమెరికా అకస్మాత్తుగా రాగం మార్చింది. స్వేచ్ఛా వాణిజ్యం వల్ల తమ దేశానికి అన్యాయం జరుగుతోందని చెబుతూ ఇతర దేశాలనుండి ముఖ్యంగా చైనా నుండి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియం మీద సుంకాలు విధించింది. దానికి ప్రతిగా చైనా కూడా అమెరికా నుండి దిగుమతి అయ్యే కొన్ని సరుకుల మీద సుంకాలు విధించింది. ఇది ప్రపంచంలో వాణిజ్య యుద్ధాలకు దారితీస్తుందన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వణికించాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ దగ్గర నుండి మన దేశంలోని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి వరకు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రపంచంలో మొదటి, రెండవ ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న అమెరికా, చైనాల మధ్య ప్రారంభమైన వాణిజ్య యుద్ధాల్లోకి మొత్తం అన్ని దేశాలూ చేరే అవకాశం ఉందని పండితులు భావిస్తున్నారు.

అమెరికా ఇదే సమయంలో రష్యాపై దౌత్య యుద్ధం ప్రారంభించింది. యూరప్‌లో గూఢచారిపై విషప్రయోగం జరిగిందన్న సాకు చూపించి తొలుత అమెరికా ఇతర ఐరోపా దేశాలు రష్యా దౌత్యవేత్తలను దేశం నుండి భహిష్కరించాయి. దీనికి ప్రతిగా రష్యా అమెరికా, యూరప్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. ఆ విధంగా ప్రారంభమైన దౌత్య యుద్ధం ఎక్కడికి దారితీస్తుందోనని ప్రపంచ మంతా బయపడుతోంది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకు ముందు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే నేడు వెల్లడవుతున్న భయాలకు అర్థం ఉందని భావించాల్సి వస్తుంది. మరోవైపు అమెరికా చైనా, రష్యాలపై సైనికంగా కాలుదువ్వుతోంది. లాటిన్ అమెరికాలో జోక్యం చేసుకుని ప్రభుత్వాలను కూల్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇరాన్, ఉత్తర కొరియాలపై యుద్ధం చేస్తానంటోంది. మాట వినని దేశాలపై ఆంక్షలు పెడుతోంది.

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైనప్పటి నుండి ఈ పరిణామాలు జరుగుతున్నాయి గనుక అతని విధానాలే కారణమని కొందరంటున్నారు. అది పాక్షిక సత్యమే. సామ్రాజ్యవాదం తను అనుకుంటున్న రీతిలో ప్రపంచాన్ని నియంత్రించలేకపోతున్నదని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. సామ్రాజ్యవాదులతో కూడిన జి–7 దేశాల కూటమిని జి–8గా మార్చారు, దానిలోకి మరిన్ని దేశాలను చేర్చుకుని జి–20 ఏర్పాటు చేశారు. ప్రతిఏటా నయా–ఉదారవాద విధానాలను అనుసరించే రాజకీయ నేతలు, ఆర్థిక వేత్తలు, మేధావులు దావోస్‌లోనో మరోచోటో మేధోమథనాలు చేస్తూనే ఉన్నారు. అయినా ప్రపంచీకరణ వైఫల్యాన్ని ఆపలేకపోతున్నారు. ఫైనాన్స్ పెట్టుబడి నియంత్రణను సజావుగా కొనసాగించలేకపోతున్నారు. ప్రపంచ వ్యాపితంగా ఈ రోజు జరుగుతున్న పరిణామాలకు కారణాలవే.

కొద్ది సంవత్సరాల క్రితం వరకు ప్రపంచీకరణ అనేది సామ్రాజ్యవాదుల ముద్దు బిడ్డ. ప్రపంచ కార్మికవర్గాన్ని, వర్ధమాన దేశాల ప్రజలను దోచుకోడానికి అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి చేతిలో అది ఒక సాధనం. గత సహస్రాబ్ది చివరి దశకంలో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం, సోషలిజం కూలిపోవడంతో అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి, దాని కార్పొరేట్ రాజధాని అయిన వాల్‌స్ట్రీట్ ఈ ప్రపంచాన్ని ఏకతాటిపైకి తెచ్చే మొనగాడిగా కనిపించింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య బహిరంగ ఘర్షణలు లేకుండా దోపిడిలో వాటాల పంపకం నిర్వహించగలిగింది. పెరుగుతున్న కార్మిక వర్గ పోరాటాలను అణచిపెట్టగలిగింది. వర్ధమాన దేశాల ప్రజలను దోచుకోవడంలో ఆటంకాలు తొలగించుకోగలిగింది. సోషలిస్టు దేశాలతో ఘర్షణ, సర్దుబాట్లతో నెట్టుకు రాగలిగింది.

కానీ రోజులు మారాయ్. సామ్రాజ్య వాదుల మధ్య ఘర్షణలు మళ్లీ ప్రారంభమైనాయి. ప్రపంచ వ్యాపితంగా నయాఉదారవాద విధానాల పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రజా పోరాటాలున్నచోట అసంతృప్త అభ్యుదయ ఉద్యమాలవైపు నడుస్తోంది. లేనిచోట ప్రజల అసంతృప్తిని ఫాసిస్టు శక్తులు ఉపయోగించుకుంటున్నాయి. మధ్యేవాద శక్తులకు నూకలు చెల్లుతున్నాయి. మన దేశంలోనూ పరిస్థితి భిన్నంగా లేదు. అందుకే కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర శక్తులు పోరాటాలను ముమ్మరం చేయాల్సిన అవసరం మునుపెన్నటికన్నా నేడు చాలా ఎక్కువగా ఉంది.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# వ్యవసాయ సమస్య భారతదేశం



రచయిత ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు

ఆర్. రామ్‌కుమార్

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పూర్వం సరుకుల ఉత్పత్తికి డబ్బుకు సన్నిహిత సంబంధం ఉండేది కాదు. సరుకుల ఉత్పత్తికి, మారకం విలువల సృష్టికి డబ్బుతో పరిమిత సంబంధం మాత్రమే ఉండేది. చెల్లింపుల సాధనంగాను, రూపాంతరం చెందిన సరుకుగాను డబ్బు సంప ద రూపంలోనే ఎక్కువగా కన్పించేది. డబ్బు తన వినియోగం నుండి వడ్డీని రాబడుతుంది. పెట్టుబడిగా మారుతుంది. భూస్వామ్య ఉత్పత్తి విధానం పతనం ఆరంభమయ్యే దశలో వడ్డీ పెట్టుబడి రెండు స్వాభావిక రూపాలు ధరించింది. మొదటిది, ఉన్నత వర్గాలలో అతిగా ఖర్చు పెట్టేవారికి ముఖ్యంగా భూస్వాములు తమ విలాసాలకు, పాత బాకీలు తీర్చుకునేందుకు డబ్బు కావాలి. రెండు, చిన్న రైతాంగంలోని అత్యధికులు భూమి అద్దెలు, ప్రభుత్వానికి పన్నులను డబ్బు రూపంలో చెల్లించేందుకు పెద్ద మొత్తాలలో డబ్బు అవసరం ఏర్పడింది. అందుకే ఎక్కువెక్కువగా డబ్బు చలామణిలోకి వచ్చింది.

పెట్టుబడి ప్రవేశంతో సాంప్రదాయ దొంగ నిల్వదారులు తమ దొంగ డబ్బును పెట్టుబడిగా మార్చుకున్నారు. చిన్న రైతు లేదా చేతి వృత్తి దారుడు డబ్బు పెట్టుబడితో వచ్చే వివాదాలను ఒక ఉత్పత్తి దారుడిగానే ఎదుర్కొన్నాడు. ఉత్పాదకాల రేట్లు అసాధారణంగా పెరిగినపుడు లేదా పంటలు చెడిపోయి నష్టాల పాలయినపుడు వారి అప్పులు తీర్చు కోవటం చాలా క్లిష్టంగా మారింది.

ఇక వ్యక్తిగత స్థాయిలో చిన్న ఉత్పత్తి దారులు తమ ఉత్పత్తులను కొనసాగించటం లేదా కోల్పోవటానికి వెయ్యి రకాల ఇబ్బందులు కారణాలుగా ఉండవచ్చు. వీటిలో ఏవొక్క ఇబ్బంది అయినా ఆ చిన్న ఉత్పత్తిదారుని దరిద్రునిగా మార్చేయవచ్చు. ఆ ఇబ్బందికి చిన్న సందు దొరికినా దానిలో పరాన్నభుక్కు వడ్డీ వ్యాపారి చొరబడి పోతాడు. చిన్నరైతు చివరకు తన ఆవు చనిపోయినా ఆర్థికంగా నాశనమై పోతాడు. అతడు పునరుత్పత్తిని పూర్వ స్థాయిలో కొనసాగించకుండా చేసేందుకు ఈ ఒక్క ఇబ్బందిచాలు. ఆ తరువాత అతడు వడ్డీ వ్యాపారి కబంధ హస్తాలలో చిక్కుకుంటాడు. దానిని నుండిబయటపడటంఅతనికి అసాధ్యమౌతుంది.

ఉత్పత్తిదారుల అదనపు శ్రమను స్వాధీనం చేసుకోవటంలో వడ్డీ వ్యాపార పెట్టుబడి ఒక సాధనంగా మారింది. ఉత్పత్తిదారులకు కొంత భద్రత కల్పిస్తున్న భూమి, ఇల్లువంటి వసతులను లాగేసుకునేందుకు నిరంతరం అది ప్రయత్నిస్తుంది. సంపన్న భూ యజమానులను కూడా అది పీల్చిపిప్పి చేస్తుంది. రుణమిచ్చి వారిని నాశనం చేస్తుంది. ఈ క్రమం ఉత్పత్తి ప్రక్రియపై చాలా చెడు ప్రభావాన్ని కల్గిస్తుంది. ఉత్పత్తి శక్తులను నిర్వీర్యం చేస్తుంది.

వడ్డీ వ్యాపార పెట్టుబడి సంపదను డబ్బు రూపంలో కేంద్రీకరించే సందర్భంలో కూడా శ్రామికుని అది ప్రత్యక్షంగా లోబరుచుకోలేదు. శ్రామికుల శ్రమను ఫణంగా పెట్టి సామాజిక ఉత్పాదకతను అభివృద్ధి చేయ లేదు. అదే ఉత్పత్తి విధానం యధాతథంగా కొనసాగుతుంది. (క్యాపిటల్ 3వ సంపుటి, పేజి 596). ఈ దశలోనే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆవిర్భావానికి అనుకూల పరిస్థితులు ఏర్పడినాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆవిర్భావానికి అవసరమైన పరిస్థితులు తలెత్తినపుడు ఇదే వడ్డీవ్యాపార పెట్టుబడి భూస్వామ్య ఉత్పత్తి విధానాన్ని కడతేర్చి పెట్టుబడిదారీ ఉత్పత్తి పంథాకు శ్రీకారం చుట్టింది.

**వడ్డీ వ్యాపార పెట్టుబడికి వ్యతిరేకత :**

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అమలులోకి వచ్చాక వడ్డీ వ్యాపారానికి ఆధునిక మదుపు వ్యవస్థలో వ్యతిరేకత మొదలైంది. ఇపుడు పెట్టుబడిదారీ వుత్పత్తి షరతులకు, అవసరాలకు లోబడి వడ్డీ వ్యాపార పెట్టుబడి తన రూపాన్ని గుణాత్మకంగా మార్చుకుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వడ్డీ వ్యాపారం రెండు పరిస్థితులలో మనగలుగుతుంది. మొదటిది, వెనుక బడిన పారిశ్రామిక విభాగాలలో లేదా ఆధునిక ఉత్పత్తి విధానపు మార్పులకు ఆటంకాలు ఎదు రౌతున్న పరిస్థితులలో(క్యాపిటల్ 3.పేజి 597). రెండవది,పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అనుగుణంగా ఖచ్చితంగా తమ పని విధానాన్ని మార్చుకోవటానికి సిద్ధం కాని వర్గాలలో అది మనగలిగింది.

'... తమ వ్యక్తిగత అవసరాలకు తాకట్టు దుకాణాలలో వలే వడ్డీ వ్యాపారుల వద్ద పలు సందర్భాలలో అప్పులు తీసుకుంటారు. ఒకటి తమ దుబారా ఖర్చుల కోసం సంపన్నులు అప్పులు తీర్చుకునేందుకు వడ్డీలకు తెస్తారు. మరొకటి, తమ వుత్పత్తి సాధనాలకు తామే యజమానులుగా వున్న పెట్టుబడిదారీయేతర పేద రైతులు, చేతి వృత్తిదారులు వంటి చిన్న స్థాయి వుత్పత్తిదారులు కూడా పై విధంగా అప్పులు చేస్తారు. సాధారణంగా చిన్న స్థాయి పెట్టుబడిదారీ పద్ధతుల్లో ఉత్పత్తిని కొనసాగిస్తున్న వారు కుడిఎడంగా స్వయం ఉపాధిలో కనిపించే ఉత్పత్తిదారులను పోలి ఉంటారు. (కాపిటల్ 3వ సంపుటం, పేజీ 600)

అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ లోని ఆధునిక మదుపు సంస్థలైన బ్యాంకులు వడ్డీ వ్యాపార పెట్టుబడికి పోటీగా అభివృద్ధి చెందాయి. బ్రిటీష్ ప్రభుత్వ అవసరాలకు కూడా వుపయోగ పడుతున్న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీరేట్లు అందుబాటులో వున్నందున అక్కడి నగదు వనరులను వడ్డీ వ్యాపార పెట్టుబడి దారులు పీల్చేశారని మార్క్స్ పేర్కొ

న్నారు. (క్యాపిటల్-3, పేజి,602). బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా అక్కడి స్వర్ణకారులు, తాకట్టు వ్యాపారులు(పాన్‌బ్రోకర్లు) తిరుగుబాటు చేశారు. (క్యాపిటల్-3, పేజి 603). పారి శ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆధునిక బ్యాంకులు రెండు సామాజిక బాధ్య తలను నిర్వహించాయి. ఒక వైపున విడివిడిగా ఉన్న చిన్న పెట్టుబడి వనరులను ఒకే పెద్ద పెట్టుబడిగా సమీకరించాయి. మరోవైపున భారీ పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్న పారిశ్రామిక వేత్తలకు ఆ పెట్టుబడిని అందుబాటులో ఉంచాయి. పెట్టుబడిదారీ విధానంలోని ఈ పెట్టు బడి కేంద్రీకరణ ప్రక్రియలో డబ్బును అనుత్పాదక వనరు గా బ్యాంకులు వదిలేయలేదు. అలాంటి డబ్బు వనరులన్నింటనీ పెట్టుబడిదారుల కోసం జాప్యం లేకుండా వినియోగించాయి. ఈ పరి వర్తనా క్రమంలోనే సంక్షోభపు బీజాలు కూడా ఇమిడి ఉన్నాయని జయతీ ఘోష్ తన వ్యాసంలో పేర్కొన్నారు.

**భారత్ అనుభవాలు :**

వలస కాలపు భారతదేశ వ్యవసాయ సంబంధాలలో వడ్డీ వ్యాపారం ముఖ్యమైన లక్షణంగా ఉండేది. ఆ వ్యాపారం అభివృద్ధి చెందటానికి రెండు అంశాలు తోడ్పడ్డాయి. రైతులు తమ భూమి శిస్తులను గతంలో వలే వస్తురూపేణా కాకుండా, డబ్బు రూపంలోనే చెల్లించాలని (నాటి)ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఫలితంగా రైతులు తమ వుత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకోవటం అనివార్యమయ్యింది. శిస్తులు చెల్లింపుకు తుదిగడువు పంటల నూర్పి ళ్ళకు కొద్ది ముందుగానే దేశంలోని చాలా ప్రాంతాలలో ముగుస్తుండేది. అందుకే పేద రైతులు అప్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్ప డింది. ప్రభుత్వ బ్యాంకుల వ్యవస్థ లేనందున అప్పులు, అడ్వాన్సుల కోసం వడ్డీ వ్యాపారులు, వ్యాపారులపైనఆధారపడటం అనివార్యమైంది.

1969లో 14 బ్యాంకులను జాతీయం చేయటంద్వారా భారత్‌లో సంస్థాగత రుణ వ్యవస్థ ప్రారంభమయింది. దేశంలో ఆధునిక బ్యాంకుల వ్యవస్థను అభివృద్ధిచేయటం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ నుండి వడ్డీ వ్యాపారిని తరిమేయటం లక్ష్యంగా బ్యాంకుల జాతీయకరణ జరిగింది. ఈ విధానంవల్ల హరిత విప్లవంద్వారా గ్రామీణ ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ప్రభుత్వ బ్యాంకులను విస్తరించేదుకు, వడ్డీ వ్యాపారుల పట్టును సడలించేందుకు, వ్యవ సాయంలో పెట్టుబడి పెంపుదలకు ఈ విధానం కొంతమేకు తోడ్పడింది.

> **"రైతులు తమ భూమి శిస్తులను గతంలో వలే వస్తు రూపేణా కాకుండా, డబ్బు రూపంలోనే చెల్లించాలని (నాటి) ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఫలితంగా రైతులు తమ వుత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకోవటం అనివార్యమయ్యింది. శిస్తులు చెల్లింపుకు తుదిగడువు పంటల నూర్పిళ్ళకు కొద్ది ముందుగానే దేశంలోని చాలా ప్రాంతాలలో ముగుస్తుండేది."**

(pull quote above repeats body text)



వ్యవసాయ ఉత్పత్తిలో పాల్గొంటున్న రైతులు, వ్యవసాయ కార్మికులు

కానీ 1991 తరువాత ప్రవేశ పెట్టిన సరళీ కృత ఆర్థిక విధానాలు బ్యాంకుల జాతీయీకరణ వల్ల కలిగిన ప్రయోజనాలను నిర్వీర్యం చేశాయి. గ్రామీణ ప్రాతాలలో వడ్డీ వ్యాపారం తిరిగి విజృంభించింది. అప్పటినుండి బ్యాకుల విస్తరణ క్రమంగా నిలిచి పోయింది. (రామచంద్రన్, స్వామినాధన్, 2000; చవాన్ 2007,రామ్ కుమార్ 2010). చిన్న, సన్నకారు రైతాంగానికి రుణాలివ్వటంలో ప్రాధాన్యత నివ్వాలన్న విధానం నుండి ప్రభుత్వం వెనక్కు మళ్ళింది. అందుకు భిన్నంగా, కార్పోరేట్లకు, వారి భాగస్వాములకు వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలకు వ్యవసాయ రుణాలివ్వటానికి ప్రాధాన్యతనివ్వాలన్న అధికార ప్రకటనఈ ధోరణిని బహిరంగంగా ప్రోత్సాహించింది. (రామచంద్రన్, చవాన్ 2007). వడ్డీ వ్యాపా రుల తొలగింపు ఆలోచన విరమించబడింది. పైగా వారి చట్టబద్ధతకై పథకం రూపొందించ బడింది. వడ్డీ వ్యాపారులకు ప్రోత్సహకాలు ఇవ్వటంద్వారా వారి ఆధిపత్యాన్ని గుర్తించాలని, వారి సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు లను ఆదేశించారు.

**3. వ్యవసాయంలో కౌలు**

పెట్టుబడి గ్రంధం మూడవ భాగంలోనూ, రెండవ భాగంలోని అదనపు విలువ సిద్ధాంత వివరణలోనూ భూమికౌలు అంశం చర్చించ బడింది. ఈ అంశం గురించి రికార్డో రచనల్లోని లోపభూయిష్టమైన అవగాహనలను కారల్ మార్క్స్ తన 'వ్యవసాయంలో పెట్టుబడిదారీ కౌలు' రచన ద్వారా సరిచేశాడు(పట్నాయక్ 2007). కౌలు విధానంపై రికార్డో, మార్క్స్ అవగాహనలను పట్నాయక్ వివరంగా విశ్లేషించారు. ఈ భాగంలో వ్యత్యాసపు కౌలు, బేషరతుకౌలు ఈ రెండు అంశాలపై మార్క్స్ అభిప్రాయాలను పరిచయం చేసేందుకు పరిమితమౌతాను. వస్తురూపంలో కౌలు, నగదు రూపంలో కౌలు అంశాలను పరిశీలించాక మార్క్స్ పెట్టుబడిదారీ పూర్వ సమాజపు లక్షణా లైన వ్యత్యాసపు కౌలు, మరియు భేషరతుకౌలు గురించి వివరించాడు. అంటే మార్క్స్ దృష్టిలో భూమికౌలు అనేది ప్రధానంగా పెట్టుబడిదారీ సమాజపు ఒక లక్షణం.

**"కౌలురేటు పెరగటం అంటే వ్యవసాయంలో వచ్చిన అదనపు లాభంలో ఎక్కువ మోతాదు భూస్వామికి చెల్లించిన కౌలు మొత్తంలో కలిసి పోవటమే. దీనినే వ్యత్యాసపు కౌలుగా మార్క్స్ నామకరణం చేశాడు. వేరొక విధంగా చెప్పాలంటే, వ్యత్యాసపు కౌలు అంటే భూ సారంలో తేడాలవల్ల సగటుకు మించి భూస్వామికి సంక్రమించిన అదనపు లాభాల రేటు మాత్రమే."**

**వ్యత్యాసపు కౌలు (డిఫరెన్షియల్ రెంట్ డి.ఆర్)**

భూమికున్న పరిమితులకు లోబడి వ్యవసాయపు స్వభావం ఆధారపడి వుంటుంది. భూమికున్న పరిమితులు, భూమి వుత్పాదకతలకున్న పరిమితులు ఒకటి కావని లెనిన్ అభిప్రాయ పడ్డాడు. ఒక భూమి వుత్పాదకతకు పరిమితులు న్నాయంటే ఆ భూమిపై వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానపు స్థాయికి, అక్కడి వుత్పత్తి శక్తుల చైతన్య స్థాయికి కూడా పరిమితులున్నట్లు గమనించాలి (లెనిన్ 1964). పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందే కొద్దీ పరిశ్రమలలో పని చేసేవారి సంఖ్య పెరుగుతుంది. ఆహారం కోసం వత్తిడి పెరిగేకొద్దీ వివిధ స్థాయిల్లో సారవంతమైన భూముల్లోకి వ్యవసాయం విస్తరిస్తుంది. ఆ పరిస్థితుల్లో నాసిరకపు నేలల్లో పండించిన ఆహారపు వుత్పత్తుల విలువనుబట్టి మార్కెట్‌లో ఆహారపు నగటు విలువను అంచనా వేస్తారు. మార్క్స్ అభిప్రాయపడినట్లుగానే వ్యవ సాయంలో ఆస్తిగా మారిన భూమి ఆ రంగంలో 'సామాజిక విలువ'లో వచ్చేమార్పులను ప్రభావితం చేస్తుంది. (ఈ అంశంపై చర్చకు బెన్‌ఫైన్ 1979లోనూ, జయతిఘోష్ 1985 రచనలను పరిశీలించాలి)

భూ కమతాల సారంలో తేడాలున్నందున, ఎక్కువ సారవంతమైన భూములను కౌలురైతుకు అందుబాటులో వుంచితేనే మార్కెట్ కంటే తక్కువ ఖర్చుతో సేద్యం చేసి, అతడు సార్వత్రిక సగటుకు మించి లాభం పొందగల్గుతాడు. కౌలురేటు పెరగటం అంటే వ్యవసాయంలో వచ్చిన అదనపు లాభంలో ఎక్కువ మోతాదు భూస్వామికి చెల్లించిన కౌలు మొత్తంలో కలిసి పోవటమే. దీనినే వ్యత్యాసపు కౌలుగా మార్క్స్ నామకరణం చేశాడు. వేరొక విధంగా చెప్పాలంటే, వ్యత్యాసపు కౌలు అంటే భూ సారంలో తేడాలవల్ల సగటుకు మించి భూస్వామికి సంక్రమించిన అదనపు లాభాల రేటు మాత్రమే. ఆవిధమైన తేడాలు, పారిశ్రామిక రంగంలో పెట్టుబడిదారుల మధ్య పోటీల వల్ల, ఉత్పత్తి పద్ధతుల్లో నాణ్యతను మరింత పెంచుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వాసం కోల్పోయినా వ్యత్యాసపు కౌలు విధానం కొనసాగుతుంది.

వ్యత్యాసపు కౌలు(డి.ఆర్)ను మార్క్స్ రెండు రకాలుగా విభజించాడు. సారంలో తేడాలున్న వేరు వేరు భూముల్లో ఒకే మోతాదులో పెట్టుబడిని వినియోగించినపుడు ఆ భూముల కౌలు రేట్ల తేడాలను ఇది వివరిస్తుంది. రెండవది. భిన్నమోతాదుల్లో పెట్టుబడిని వినియోగించిన ఒకే రకమైన సారంగల భూముల కౌలు రేట్లలో ఉన్న తేడాలను ఇది వివరిస్తుంది. పైన తెల్పిన రెండు రకాల వ్యత్యాసపు కౌళ్ళలోని తేడాలు, భిన్న మోతాదులలో పెట్టుబడుల వినియోగం వల్లనే కాని, వాటి సామర్థ్యంలో తేడాల వల్ల మాత్రం కాదు. ఉత్పాదకతలను పెంచటంలో, అదనపు లాభాల సాధనలో, రుణాల సేకరణలో ఆ పెట్టుబడుల కున్న శక్తి సామర్థ్యాలలో నెలకొన్న వ్యత్యాసాల వల్లే కౌలురేట్లలో తేడాలున్నాయి.

రికార్డో పరిశీనలో వ్యవసాయంలో వినియోగించిన పెట్టుబడి మోతాదును బట్టి కౌలు మొత్తాన్ని సులభంగా నిర్ణయించవచ్చు. వ్యత్యాసపు కౌలుపై రికార్డో అంచనాలు కేవలం కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే వర్తిస్తాయని మార్క్స్ పరిశీలన తెల్పుతున్నది.

పరిమితమైన భూసంస్కరణలు లేదా కౌలు సంస్కరణల ద్వారా వ్యత్యాసపు కౌలు మొత్తాలను భూ యజమానుల నుండి తీసకుని కౌలు రైతులకు అందజేయగల్గితే వారు ఆ మిగులు లాభపు భాగాన్ని కూడా భూమిపైనే వినియోగిస్తారు. కౌలు సంస్కరణలతో వ్యత్యాసపు కౌలు అదృశ్యం కాదు. అది భూమి యజమానికి బదులు కౌలు రైతుల వద్దకు చేరుతుందంతే.

**సాపేక్షకౌలు:**

రికార్డో దృష్టిలో వ్యవసాయంలో ఏకైక కౌలు రూపం వ్యత్యాసపు కౌలు మాత్రమే. సహజసిద్ధమైన రూపంలో ఉన్న భూమి ఆహారం అందివ్వలేదని, అలాంటి భూములు ఎలాంటి వ్యత్యాస కౌలును సంపాదించలేవని రికార్డో అభిప్రాయం. కానీ వ్యత్యాసపు కౌలు కనుమరుగైనప్పటికీ భూమి సంబంధిత ఆస్తిలో పరిమితులు కొనసాగుతాయని మార్క్స్ వాదించాడు.

కౌలు స్థిరత్వాన్ని నిరూపించేందుకు సగటు లాభాలకు మించి అదనపు లాభాలకు అవకాశంలేని నాసిరకం భూమిని మార్క్స్ ఎంపిక చేసుకున్నాడు. కౌలు రైతు సగటు లాభాలు మిగుల్చుకుని తనకు మాత్రం ఎలాంటి లాభాలు దక్కకుంటే భూ యజమాని అంగీకరిస్తాడా? వ్యవసాయ భూ సంబంధిత ఆస్తి స్వభావం రీత్యానే అందుకు అవకాశం ఇవ్వదు. ఫలితంగా ఆహార సరకుల అమ్మకం ధరలు ఆ సరకుల కనిష్ట ఉత్పత్తి వ్యయానికి, వాటి గరిష్ట విలువలకు మధ్యస్థంగా పెరుగుతాయి. ఆ విధంగా కౌలు చెల్లింపుకు అవకాశం ఏర్పడుతుంది. పంటల వుత్పత్తి ధరకు, అమ్మకం ధరకు మధ్య వున్న తేడానే సాపేక్ష కౌలుగా పిలుస్తారు.

పెట్టుబడుల మధ్య పోటీవల్లే విలువలు, ధరలు నిర్ణయించబడతాయన్న ఆలోచనే కౌలుపై మార్క్సిస్టు చర్చలకు మూలం (ఫైన్ 1979). 'అదనపు విలువ సిద్ధాంతం' రెండవ సంపుటంలో మార్క్స్ చెప్పినట్లు సరుకుల విలువలు ధరలుగా మారే క్రమం రెండు దశలలో సాగుతుంది. మొదటి దశలో,ఉత్పత్తి పరిధిలో పెట్టుబడుల మధ్య పోటీ సరుకుల మార్కెట్ విలువలను నిర్ణయిస్తుంది. ఫలితంగా రంగాల పరిధులను అధిగమించి అసమానమైన రీతిలో లాభాలస్థాయి ఉంటుంది. రెండవ దశలో పెట్టుబడుల మధ్య పలు రంగాలలో అదనపు లాభాల కోసం నెలకొన్న పోటీ ధరల నిర్ణయానికి దారితీస్తుంది. దానితో పాటు అన్ని రంగాలలో లాభాలస్థాయి సమానంగా ఉంటుంది.

ఇతర రంగాలతో పోల్చినపుడు ఒక ఉత్పత్తి రంగంగా వ్యవసాయ రంగం తక్కువ స్థాయి మూల పెట్టుబడులతో మనగలుగుతుంది. మౌలిక పెట్టుబడి తక్కువ స్థాయిలో ఉండటం అంటే వ్యవసాయంలో ఎక్కువ లాభాలు సంపాదించటానికి సాధ్యమైనంత ఎక్కువ శ్రమను వెచ్చించాల్సి రావటం. లాభాలు పెరిగే కొద్దీ వ్యవసాయంలోకి పెట్టుబడి ప్రవేశం పెరుగుతుంది. ఈ క్రమం అన్ని రంగాలలో లాభాల రేట్ల సమానీకరణకు దారితీస్తుంది. వ్యవసాయంలో గుత్తాధిపత్యం వహిస్తున్న భూ ఆస్థి దాని రూపాలతో నిమిత్తం లేకుండా అన్ని రంగాలలో లాభాల రేట్ల

సమానీకరణకు ఆటంకంగా ఉందని మార్క్స్ వాదించారు. పారిశ్రామిక రంగంలో భూ ఆస్తి మనుగడలో ఉండనందున, ఈ అంశం వ్యవసాయ రంగానికే ప్రత్యేకమైనది.

వ్యవసాయ రంగంలో గుత్తాధిపత్యం వహిస్తున్న భూ ఆస్తిని రద్దు చేస్తేనే లాభాల రేట్ల సమానీకరణ, ఉత్పత్తి ఖర్చుల కంటే వ్యవసాయ ఉత్పత్తులకు ఎక్కువ ధరలు పొందవచ్చు. భూ ఆస్తి రద్దయితేనే లాభాల సమానీకరణకు, తద్వారా ధరల తగ్గుదలకు హామీ లభిస్తుంది. భూ ఆస్థిని రద్దు చేస్తేనే వ్యవసాయంలో నూతన పెట్టుబడుల ప్రవేశానికున్న ఆటంకాలు తొలగేందుకు మార్గం సుగమం అవుతుంది. 1862లో ఏంగెల్స్‌కు వ్రాసిన లేఖలో మార్క్స్ ఇలా వివరించారు :

'....అన్ని రకాల భూముల్లోనూ లేదా అన్ని సందర్భాలలోనూ సాపేక్షకౌలు చెల్లింపులు ఏ విధంగానూఅవసరం కాదు.... చట్టబద్ధంగానూ, అంకెల పరంగానూ భూ సంబంధిత ఆస్తులు మనుగడలో లేకుంటే పై కౌలు చెల్లింపులు ఉండవు. ఇలాంటి సందర్భంలో పెట్టుబడుల వినియోగానికి వ్యవసాయ రంగం ఎలాంటి ప్రత్యేక ఆటంకాలు సృష్టించదు. ఇతర రంగాలలో వలే వ్యవసాయ రంగంలోకి పెట్టుబడి సులభంగా ప్రవేశిస్తుంది. అపుడు పారిశ్రామిక రంగంలో నిరంతరం సరుకులు అమ్ముడు పోయినట్లే, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు వాటి విలువల కంటే తగ్గి ఎక్కువగా అమ్ముడు పోతాయి. భూ యజమాని మరియు పారిశ్రామిక పెట్టుబడిదారుడుగా ఒక్కరే వుంటే భూ ఆస్తులు రద్దయ్యే అవకాశం ఉంది....(మార్క్స్,1862/1913)

భూమిని జాతీయం చేయటమే ఈ సమస్యకు నిజమైన పరిష్కారం. తద్వారా భూమికౌలు రద్దవుతుంది. వ్యవసాయంలో పెట్టుబడుల చొరబాటుకు మార్గం సుగమం అవుతుంది. భూముల జాతీయకరణ, తద్వారా భూమి కౌలు రద్దు పర్యవసానాలు గురించి లెనిన్ అభిప్రాయాలు క్రింది విధంగా ఉన్నాయి.

....పెట్టుబడిదారీ వ్యవస్థలో భూముల జాతీయకరణ సమస్యను భౌతికంగా రెండు భాగాలుగా విడగొట్టాలి. మొదటిది, వ్యత్యాసపు కౌలు. రెండవది, షరతులులేని కౌలు. భూముల జాతీయకరణతో మొదట దాని యజమాని మారిపోతాడు. భేషరతు కౌలు ప్రాధాన్యత తగ్గిపోతుంది. అందుకే, పెట్టుబడిదారీ వ్యవస్థలో జాతీయకరణ ఒక పాక్షిక సంస్కరణ మాత్రమే. (అదనపు విలువలో కొంత భాగానికి యజమాన్యంలో మార్పు జరుగుతుంది). వేరొక వైపున పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా ఉన్న భూమిపై గుత్తాధిపత్యాన్ని ఈ జాతీయకరణ రద్దు చేస్తుంది.

❝ పెట్టుబడి' మరియు 'అదనపు విలువ సిద్ధాంతా'ల వెలుగులో పై అంశాలను ఇయం యస్ పరిశీలించారు. భూమి కౌలు అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోనందునే బూర్జువా విప్లవం భూ సంబధిత కర్తవ్యాలను పూర్తి చేసిందన్న నిర్ణయానికి మితవాదులు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు.❞


ఇఎంఎస్ నంబూద్రిపాద్

భూమిని జాతీయం చేయకున్నా సమగ్రమైన భూ సంస్కరణల ద్వారా భేషరతు కౌలును గణనీయంగా తగ్గించవచ్చు. ఆ ప్రక్రియలో పెద్దసంఖ్యలో ఉన్న చిన్న ఉత్పత్తిదారులు పునరుత్పత్తికి సరిపడా స్వంత భూములను కలిగి ఉంటారు.

**4. భారత్‌లో భూమి కౌలు, వ్యవసాయక సమస్య**

మార్క్సిష్టు అవగాహన వెలుగులో భూమి కౌలు అంశంపై భారత వ్యవసాయ సమస్యను లోతుగా విశ్లేషించిన కొద్దిమంది భారతీయ మేధావులలో ఇయంయస్ నంబూద్రిపాద్ ఒకరు (నంబూద్రిపాద్ 1940మరియు 1984). మలబారు వ్యవసాయ పరిస్థితుల సమీక్షకు ప్రభుత్వంచే నియమించబడిన కుట్టికృష్ణమీనన్ కమిటిలో ఆయన సభ్యుడు. ఆ కమిటి సమర్పించిన ముసాయిదా నివేదికకు నిరసనగా 1939లో ఇయంయస్ ప్రతిపాదించిన రెండు సవరణలు(మినిట్స్) ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. భారతదేశ వ్యవసాయ సమస్యలను అధ్యయనం చేసే వారందరూ ఈ రెండు (మినిట్స్) వ్యాసాలను తప్పక చదవాలి. పట్నాయక్ ప్రస్తావించినట్లు ఇయంయస్ నంబూద్రిపాద్ వ్యాసంలో రెండు విభిన్న వాదనలకు సమాధానాలు దొరుకుతాయి. మొదటిది, భారత వ్యవసాయం అర్ధ భూస్వామ్య దశలో ఉందన్న నక్సలైట్లు వాదన. రెండవది, ఇక్కడి బూర్జువా విప్లవం భూ సంస్కరణల ద్వారా భూ సమస్యను ఈపాటికే పరిష్కరించిదన్న వామపక్షంలోని రివిజనిష్టుల అవగాహన. ఆవిధంగా ఈ రెండు వాదనలు పెట్టుబడిదారీ పూర్వ సమాజపు అవశేషాల మనుగడను గుర్తింప నిరాకరిస్తున్నాయి.

'పెట్టుబడి' మరియు 'అదనపు విలువ సిద్ధాంతా'ల వెలుగులో పై అంశాలను ఇయంయస్ పరిశీలించారు. భూమి కౌలు అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోనందునే బూర్జువా విప్లవం భూ సంబధిత కర్తవ్యాలను పూర్తి చేసిందన్న నిర్ణయానికి మితవాదులు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. భారత వ్యవసాయంలో పెట్టుబడిదారీ పూర్వ సమాజపు పలు అవశేషాలైన జంకర్ తరహా పెట్టుబడిదారీ భూస్వాములను కాపాడుతూనే, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న తీరును అతివాదులు గమనించటం లేదని ఆయన అభిప్రాయ పడినారు.

ఇయంయస్ దృష్టిలో వ్యవసాయ పరివర్తనలు పూర్తికాలేదు. ఒక వైపున ఆ రంగంలోని శ్రామికులకు వారి శ్రమ విలువ అందటం లేదు. వేరొకవైపున కౌలురైతుల పెట్టుబడికి తగిన సగటు ఫలితం అందటం లేదు. అందుకే భారత్‌లోని భూమి కౌలు పెట్టుబడిదారీ భూమి కౌలు స్థాయికి చేరలేదు. భూస్వామి పొందే కౌలు మొత్తంలోనే కొంత భాగం వ్యవసాయ కూలీల కనీస వేతనాలు, చిన్నకౌలు రైతులకు అందాల్సిన కనీస మిగులు కూడా ఇమిడి వున్నాయి. గత సమాజపు వారసత్వ లక్షణాలకు వ్యవసాయంలో

> **"భూస్వాములు అనుభవిస్తున్న భూమికౌలు నూతన పెట్టుబడి రూపం ధరించింది. అదే 'భూమి ధర'. భారీగా పెరిగిన భూమి ధర భూమిని మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్మకాలు, కొనుగోళ్ళు చేసుకునేందుకు ఆటంకంగా మారుతుంది. ఫలితంగా భూమిపై నూతన పెట్టుబడుల రాకకు పరిమితులు ఏర్పడతాయి."**




**జాతీయకరణ తర్వాత బ్యాంకులు వ్యవసాయరంగానికి ఋణాలివ్వడం పెరిగింది**

సరుకుల ఉత్పత్తి విస్తరిస్తున్న తీరు ఒక సంకేతంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఇంగ్లండుతో పోల్చినపుడు పెట్టుబడిదారీ అభివృద్ధిలో భిన్న పంథాను అనుసరిస్తున్న ఐర్లాండు గురించి మార్క్స్ క్యాపిటల్‌లో పొందుపరచిన అనుభవాలను ఇయంయస్ ఉదహరించారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మనుగడలో లేకుంటే ఐర్లండులోవలె భారత్‌లో కూడా భూ ఆస్తి అనేది పేరుకు మాత్రమే మనుగడలో ఉండేది. 'పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి ప్రకియలో భూ ఆస్తి పేరుకు మాత్రమే అమలులో ఉంటుంది. కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం వాస్తవంగా అమలులో లేదు'. అని రాశారు.

భూమికౌలు గురించి కాట్స్కీ (1988) విశ్లేషణలపై ఇయంయస్ ఇలా స్పందించారు. 'భూస్వాములు అనుభవిస్తున్న భూమికౌలు నూతన పెట్టుబడి రూపం ధరించింది. అదే 'భూమి ధర'. భారీగా పెరిగిన భూమి ధర భూమిని మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్మకాలు, కొనుగోళ్ళు చేసుకునేందుకు ఆటంకంగా మారుతుంది. ఫలితంగా భూమిపై నూతన పెట్టుబడుల రాకకు పరిమితులు ఏర్పడతాయి.

పెట్టుబడిదారీ భూమి కౌలుపై మార్క్స్ అవగాహనలను పెట్టుబడిదారీ వ్యవస్థ స్థాయికి పూర్తిగా పరివర్తన చెందని భారత్‌కు యథాతథంగా వర్తింప చేయలేమని ఇయంయస్ భావిస్తున్నారు. కేవలం తమ మనుగడ కోసం రైతువారీ వ్యవసాయం సాగుతున్న చోటనే పెట్టుబడిదారీ వ్యవసాయం కూడా సమాంతరంగా సాగుతుంటే అలాంటి సందర్భాలలో సాపేక్షకౌలు పద్ధతిని ఒక ముఖ్యమైన అంశంగా అధ్యయనం చేయాలని ఘోష్ అభిప్రాయపడినారు. సాపేక్షకౌలును ప్రధానంగా పెట్టుబడిదారీ పూర్వ సమాజపు కౌలు పద్ధతి అని, అది భూస్వాముల, కౌలు రైతుల పరస్పర బేరసారాల శక్తిపై ఆధారపడి నిర్ణయించ బడుతుందని ఆమె భావించారు. బ్రిటీష్ కాలంలో భారత్‌లోని నేటి ఉత్తరప్రదేశ్ ప్రాంత అనుభవాలను ఘోష్ ప్రస్తావిస్తున్నారు. పలు దుర్భేధ్యమైన ఆటంకాలున్న నాటి భూమి కౌలు విధానం పెట్టుబడుల ప్రవేశానికి అడ్డంకిగా మారిందని పేర్కొన్నారు. అయినా 1860– 1930లమధ్య దేశపు పశ్చిమ ప్రాంతంలోని ఆటంకాలు బలహీనపడినట్లు తెల్పారు. అందుకు దారితీసిన పలుకారణాలను ఇలా ప్రస్థావించారు

....వాణిజ్యీకరణమూలంగా వ్యవసాయం లాభదాయకంగా మారింది. ఎగుమతి మార్కెట్లు అభివృద్ధిచెంది, 1870– 1930ల మధ్య కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగాయి. కౌలుదారీ చట్టం అమలులోకి రావటంతో కౌలు రైతులు తాము సాగుచేస్తున్న భూములను తమ అధీనంలో ఉంచుకునేందుకు చట్టబద్ధ రక్షణ లభించింది. గతంకన్నా తక్కువ కౌలు రేట్లు చెల్లించే వీలు కల్గింది. జల వనరులు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో వ్యత్యాసపు కౌలు ప్రాధాన్యత పెరిగింది. పోటా పోటీగా పెరుగుతున్న కౌలు రేట్లనుపై అంశాలు ప్రభావితం చేయలేక పోయాయి.

పెట్టుబడిదారీ పూర్వ సమాజపు కౌలురేట్ల పద్ధతి వల్ల తూర్పు ప్రాంతపు వ్యవసాయంలోకి పెట్టుబడుల రాకకున్న పలు ఆటంకాలను అధిగమించటంలో పై అంశాలేవీ అంతగా ప్రభావం చూపలేదు. ఫలితంగా వ్యవసాయాభివృద్ధిలో తూర్పు ప్రాంతాలు బ్రిటీష్ కాలమంతా వెనుకబడిపోయాయి. వ్యవసాయ నిర్మాణం పెట్టుబడిదారీ పద్ధతులకు పరివర్తన చెందుతున్న క్రమంలో మార్క్స్ చెప్పినట్లు వ్యవసాయార్ధిక అంశాలను విశ్లేషించటంలో షరతులు లేని కౌలు అంశాన్ని ప్రత్యామ్నాయ విధానంగా పరిగణించ వచ్చని ఘోష్ అభిప్రాయ పడుతున్నారు.

**ముగింపు :**

మార్క్స్ క్యాపిటల్‌లో వ్యవసాయంపై సాగిన చర్చల వెలుగులో భారత వ్యవసాయక సమస్యకు పరిష్కారం కనుగొనటం మన దేశ ప్రజల ముందున్న తక్షణ ప్రాధాన్యత కలిగిన జాతీయ సమస్య అన్న విషయాన్ని ధృవీకరిస్తోంది. భారతదేశ వ్యవసాయ సమస్యను పరిష్కరించటం అంటే భూసంస్కరణలు అమలు జరపటమే. గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య విధానాన్ని రద్దు చేయటం, వడ్డీ వ్యాపారులు, ఇతర వ్యాపారుల దోపిడీని అరికట్టడం కూడా ఇందులో భాగమే. అలాంటి భూసంస్కరణలు వ్యవసాయంలో పెట్టుబడి ప్రవేశానికున్న ఆటంకాలను తొలగిస్తాయి. దేశీయ మార్కెట్ల విస్తరణకు దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాలలో అగ్రకుల ఆధిపత్యాలకున్న భౌతిక పునాదులను బలహీనపరచే చారిత్రక కర్తవ్యం నెరవేర్చేందుకు భూ సంస్కరణలు వుపకరిస్తాయి. ఆ విధంగా రైతులు, వ్యవసాయ కార్మికు లు, అణగారిన కులాల వుద్యమాలకు, పోరాటా లకు మార్క్స్ క్యాపిటల్ అధ్యయనం మార్గదర్శిగా నిలుస్తుంది.

**అనువాదం: వై సిద్ధయ్య**

# తెలంగాణలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

ఎస్. వీరయ్య

**బహుజనులంటే ఎవరు?**

**కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు కలిసి నడవడం అంటే ఏమిటి?**

**తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం ప్రభావం ఎలా ఉంటుంది?**

**వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన ఏర్పాటుకిది తోడ్పడుతుందా?**

సమాజంలో ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు గురవుతున్నవారందరినీ సమీకరించేందుకు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రయత్నిస్తున్నది. కష్టజీవుల శ్రమను దోచుకునే వర్గాలు, కులవివక్షకు పాల్పడే ఆధిపత్య శక్తులు మినహా తెలంగాణ ప్రజలందరినీ కదిలించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడే శ్రమజీవులు, వివక్షలను వ్యతిరేకించే సామాజిక శక్తులు, బడుగు బలహీన జనమందరినీ ఉద్యమ బాటలో నడపటమే బీఎల్ఎఫ్ లక్ష్యం. కష్టజీవులదీ, ఆధిపత్య శక్తులను ఎదిరించే శక్తులదే బహుజన లెఫ్ట్ ఫ్రంట్.

కమ్యూనిస్టులు, సామాజిక న్యాయం కోసం నిలబడే శక్తుల మధ్య పరస్పర సహకారంతోనే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడింది. ఈ సహకారం ఇప్పటికిప్పుడు కొత్తగా ఊడిపడ్డది కాదు. సుమారు రెండు దశాబ్దాల సీపీఐ(ఎం) కృషి కొనసాగింపే తెలంగాణలో ఈ ఫ్రంట్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కులవివక్షకు వ్యతిరేకంగా రెండు దశాబ్దాలుగా సీపీఐ(ఎం) సాగిస్తున్న కృషి ఫలితమిది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం సాగిన పోరాట అనుభవాలు కూడా ఇందుకు తోడైనాయి. రెండు దశాబ్దాల సుదీర్ఘకాలం నిలకడగా సాగిన ఈ కృషి అనేక సామాజిక శక్తులలో విశ్వాసం పాదుకొల్పింది. కమ్యూనిస్టులతో కలిసి పనిచేయడానికి మార్గం సుగమం చేసింది. ఈ క్రమంలోనే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం కేంద్రకమిటీ తీసుకున్న నిర్ణయం ఈ శక్తులలో మరింత విశ్వాసం పెంచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ కృషిలో మరో ముందడుగు వేసింది. బీసీ సబ్‌ప్లాన్ కోసం పోరాడటం, స్థానిక సంస్థలలో ఎంబీసీల రాజకీయ రిజర్వేషన్ల కోసం కృషి చేయటం కూడా మరింత తోడ్పడ్డది. ఈ నేపథ్యంలోనే పార్టీ నాయకత్వ బృందం రాష్ట్రంలో చేసిన సుదీర్ఘ పాదయాత్ర విస్తృత ప్రభావం చూపింది. ఆర్థిక, సామాజిక సమస్యల మీద ప్రారంభమైన కమ్యూనిస్టుల, సామాజిక న్యాయం కోసం నిలబడే శక్తుల కార్యాచరణ రాజకీయ సహకారానికి బాటలు వేసింది. ఈ పరిణామాల ఫలితమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం.

తెలంగాణలో రూపుదిద్దుకున్న ఈ రాజకీయ పరిణామం కేవలం నలుగురు నాయకుల చర్చల ఫలితం కాదు. లేదా నిర్దిష్ట సమస్యల పరిష్కారం కోసం ప్రారంభించిన తాత్కాలిక కృషి కాదు. పాదయాత్రకు ముందే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ 'సామాజిక న్యాయం-సమగ్రాభివృద్ధి' పేరుతో నిర్దిష్ట ప్రణాళికను రాష్ట్ర ప్రజల ముందుంచింది. వివిధ సామాజిక శక్తులు, రాజకీయ శ్రేణుల మధ్య ఇది విస్తృత చర్చకు దారితీసింది. ఇప్పటివరకు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం, టీఆర్ఎస్‌ల విధానాలకు భిన్నమైన ప్రణాళిక ఇది. సాధారణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్దిష్ట పరిష్కార మార్గాలతో ప్రజలముందుంచిన ప్రత్యామ్నాయం ఇది. ఈ ప్రత్యామ్నాయ ప్రణాళికను ఆమోదించేవారందరినీ బీఎల్ఎఫ్ సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ ప్రణాళిక తెలంగాణ రాష్ట్రంలోని సామాజిక శక్తులు, వామపక్ష మేధావులు, ఇతర ప్రజాతంత్రవాదుల మీద సానుకూల ప్రభావం చూపింది. అనేక శక్తుల, సంస్థల, వ్యక్తుల ఆమోదం పొందింది. వివిధ రాజకీయ శ్రేణుల ప్రభావంలో ఉన్నవారు అనేకమంది ఈ ప్రణాళికవైపు దృష్టి సారించారు. ఇందులోని అంశాలమీద స్థూలంగా ఏర్పడిన ఏకాభిప్రాయమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావానికి ప్రాతిపదిక నేర్పరిచింది. ప్రజాసంఘాల ఐక్య వేదికగా ఏర్పడిన టీ మాస్ ఫోరంలో విశాల ఐక్యత సాధ్యమైంది. వివిధ రాజకీయ పార్టీలలో చురుకైన పాత్ర వహిస్తున్న వారు అనేకమంది టీ మాస్ ఫోరంలో భాగస్వాములయ్యారు. వీరిలో కొందరు బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌కు దూరంగా ఉన్నారు. ఒక రాజకీయ శక్తిగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏమేరకు నిలదొక్కుకుంటే ఆ మేరకు ఇతర రాజకీయ శ్రేణులలోని ఇలాంటివారు బహిరంగంగా తెగతెంపులు చేసుకుని రావడానికి ధైర్యం చేయవచ్చు. రాజకీయంగా ఒక స్పష్టమైన వైఖరిని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్ వంటి పార్టీలకు ఇది దూరం. టీఆర్ఎస్ పాలనను అంతం చేసి తెలంగాణ రాష్ట్రంలో అధికారం సాధించాలనేదే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ లక్ష్యం. కేరళ మార్గమే తమ మార్గమని ఈ ఫ్రంట్ ప్రకటించింది.

విశాఖలో జరిగిన సీపీఐ(ఎం) 21వ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం పేరా నెం.2.72 లో "తనను తాను బలపరచుకోవడం, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టడం అనే పార్టీ ప్రయోజనాలు ఎన్నికల ఎత్తుగడలకు మార్గదర్శకమవుతాయి" అని చెప్పింది. అలాగే పేరా నెం.2.88 లో ఈ విధంగా చెప్పింది, "వామపక్ష ప్రజాతంత్ర ఐక్యత, నిర్మాణం వేరు వేరు రాష్ట్రాలలో వేరు వేరు విధాల్లో ఉంటుంది. రాష్ట్రాలలో వివిధ రకాలైన వామపక్ష, ప్రజాతంత్ర కూటములు ఆవిర్భవిస్తాయి. అయితే అవి అఖిలభారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి దోహదం చేస్తాయి. పార్టీ అనుసరించే ఎత్తుగడలన్నీ ఒక బలమైన వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను వాస్తవం చేయడంపైనే కేంద్రీకరిం

**“నిజానికి కమ్యూనిస్టులు, సామాజిక శక్తులకు మధ్య పెరుగుతున్న ఈ బంధం ఆర్థిక దోపిడీకి గురవుతున్న శ్రామికులందరినీ ఐక్యం చేస్తుంది. కులవివక్షకు పాల్పడుతున్న ఆధిపత్య శక్తులన్నింటినీ వ్యతిరేకిస్తుంది. మహిళల హక్కుల కోసం, మైనార్టీల భద్రత కోసం నిలబడుతుంది. అంతేకాదు, వెనకబడిన తరగతులకు సంబంధించిన క్రీమీ లేయర్ విధానం కూడా పాటించవలసి ఉంటుంది.”**




**తెలంగాణలో బిఎల్ఎఫ్ సమావేశంలో పాల్గొన్న తమ్మినేని, జిగ్నేష్ మేవాని తదితరులు**

చాలి”. తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించిన చర్యలన్నీ ఈ దిశలో వేసిన ఒక ముందడుగు.

సామాజిక శక్తులతో కలిసి పనిచేస్తున్న క్రమంలో వారి నినాదాలే కమ్యూనిస్టు పార్టీ నినాదాలుగా కొందరు భావించే అవకాశం ఉంది. ఫలితంగా కొన్ని అపోహలు ఏర్పడవచ్చు. ఇది సామాజిక శక్తులుగా ఉన్న 93 శాతం ప్రజలకు, అగ్రవర్ణాలుగా ఉన్న 7 శాతం ప్రజలకు మధ్య పోరాటంగా కొందరు అర్థం చేసుకున్నారు. నిజానికి కమ్యూనిస్టులు, సామాజిక శక్తులకు మధ్య పెరుగుతున్న ఈ బంధం ఆర్థిక దోపిడీకి గురవుతున్న శ్రామికులందరినీ ఐక్యం చేస్తుంది. కులవివక్షకు పాల్పడుతున్న ఆధిపత్య శక్తులన్నింటినీ వ్యతిరేకిస్తుంది. మహిళల హక్కుల కోసం, మైనార్టీల భద్రత కోసం నిలబడుతుంది. అంతేకాదు, వెనకబడిన తరగతులకు సంబంధించిన క్రీమీ లేయర్ విధానం కూడా పాటించవలసి ఉంటుంది. వెనుకబడిన తరగతులకు సంబంధించి రాజకీయ రిజర్వేషన్ల సమస్య ఒక రాష్ట్రంలో తేలవలసిన విషయం కాదు. దేశంలో వివిధ రాష్ట్రాలలో నెలకొన్న విభిన్న పరిస్థితుల రీత్యా జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయానికి రావలసిన విషయం ఇది. కులం పునాదిలో ఉన్నదా లేక ఉపరితలంలో ఉన్నదా అనే చర్చ కూడా ముందుకొచ్చింది. పార్టీ ఏర్పడిన తర్వాత కొంతకాలం సామాజిక సమస్యలకన్నా ఆర్థిక సమస్యల మీదనే ఎక్కువ శ్రద్ధ పెట్టడం వల్ల కొంతమందిలో అపోహలకు అవకాశం కలిగింది. కులం ఉపరితలంలో భాగం అన్నా లేదా పునాదిలోనే ఉన్నదన్నా, నిజానికి ఈ రెండూ పాక్షిక సత్యాలే. పార్టీ కార్యక్రమం స్పష్టమైన అవగాహననిచ్చింది. భారతదేశంలో ఫ్యూడల్ సంబంధాలను నాశనం చేయకుండానే పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించే ప్రయత్నం జరుగుతున్నదని పార్టీ కార్యక్రమం అంచనా వేసింది. ఫ్యూడల్ సంబంధాలు ఏమేరకు బలంగా ఉంటే ఆ మేరకు కులం పునాదిలో కూడా ఉంటుంది. పెట్టుబడిదారీ సంబంధాలు ఏమేరకు బలపడితే ఆ మేరకు కులం ఉపరితలంలో భాగమవుతుంది. ఇది నిరంతర ప్రక్రియ. ఇది పార్టీ కార్యక్రమం ఇచ్చే అవగాహన. అయినప్పటికీ ఈ కాలంలో సామాజిక న్యాయం కోసం పెరిగిన కృషి ఇలాంటి అనేక విషయాలలో కొంత చర్చకు తావిచ్చింది. పార్టీ శ్రేణులలో కొన్ని సందేహాలకు, గందరగోళానికి అవకాశమిచ్చింది. అందుకే ఈ సమస్యలన్నీ పొలిట్‌బ్యూరో లోతుగా చర్చించి స్పష్టతనిచ్చింది. ఈ పరిణామాల అనంతరమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భవించింది.

పార్టీకి సంబంధించినంత వరకు స్పష్టత ఉన్నప్పటికీ ఆచరణలో అనేక సమస్యలు సహజం. రాజకీయ రంగంలో వస్తున్న కొత్త పరిణామాలు, కొత్త ఎత్తుగడలే ఇందుకు కారణం. సామాజిక అణచివేత గురించి మాట్లాడితే పార్టీలో అనైక్యత వస్తుందేమో అన్న భయాందోళనలు కొందరిలో ఉండవచ్చు. పార్టీ విధానం పట్ల ఇంకా తగినంత స్పష్టత, అవగాహన పెంపొందించుకోకపోవడం వల్ల కూడా కొందరిలో గందరగోళం ఉండవచ్చు. మరోవైపు కొంతమంది అస్తిత్వవాద ప్రభావంలో కూడా ఉండవచ్చు. ‘ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత’ అనే నినాదంలో ఉన్న లోపం అర్థం కాక తప్పటడుగులు వేయవచ్చు. అస్తిత్వం కోసం, గుర్తింపు కోసం సామాజిక శక్తులు పడే తాపత్రయానికీ, శ్రమదోపిడీ నుండి విముక్తి, కుల వివక్ష, సమన్యాయం వంటి సామాజిక సమస్యల శాశ్వత పరిష్కారానికీ మధ్య ఉన్న తేడాను గమనించలేకపోవటం వల్ల పొరపాటుగా అర్థం చేసుకోవచ్చు. పార్టీ కార్యక్రమాన్ని లోతుగా అధ్యయనం చేయటం ద్వారానే సరైన అవగాహనను పెంపొందించుకోవచ్చు. అంతేకాదు, వివిధ సభలు, సమావేశాలలో సామాజిక సంస్థల నాయకులందరూ ఒకేరకంగా మాట్లాడతారనుకోలేము. అందరూ సమతుల్యత పాటించకపోవచ్చు. సామాజిక శక్తులతో కలిసి పనిచేసే క్రమంలోనే ఇలాంటి సమస్యలను అధిగమించవలసి ఉంటుంది. పార్టీ స్వతంత్రతను కాపాడుకుంటూ ఐక్య కార్యాచరణ చేయటంలో నైపుణ్యం పెంచుకోవటమే ఇందుకు మార్గం. పార్టీ శ్రేణుల సైద్ధాంతిక పునాదిని బలోపేతం చేసుకుంటూ కలిసి పనిచేయటం నేర్చుకోవాలి.

ఎన్నికల నాటికి ఇప్పుడు బీఎల్ఎఫ్‌లో కలిసివచ్చేవారంతా నిలబడతారా అన్న ప్రశ్న కూడా అక్కడక్కడా వినిపిస్తున్నది. ఎన్నికలు దగ్గరపడేనాటికి కమ్యూనిస్టులు కూడా ఈ విధానాన్ని కొనసాగిస్తారా లేక మళ్ళీ ఒక పార్టీని ఓడించడం కోసం మరో పార్టీతో ఎన్నికల అవగాహన అనే పాత పద్ధతిని అనుసరిస్తారా అన్న సందేహాలు కూడా సామాజిక శక్తులు వ్యక్తం చేస్తున్నాయి. కలిసి పనిచేసే క్రమంలోనే ఈ సందేహాలూ పరిష్కారం కావాలి. ఒకటిమాత్రం నిజం. ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో నిలబడడానికి

సిద్ధమైనవారే కడదాకా నిలబడతారు. ఎవరూ జారిపోరని గానీ, కొత్తగా ఎవరూ కలవరని గానీ అనుకోవలసిన అవసరం లేదు. వచ్చే ఎన్నికలలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏమేరకు ఫలితాలు సాధిస్తుంది అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజలలో జరిగే కృషిపై ఇది ఆధారపడి ఉంటుంది. సాధారణ ప్రజలలోకి చొచ్చుకుపోయే మోతాదును బట్టి ఫలితం ఉంటుంది. అందుకే గ్రామాల్లో, బస్తీల్లో అట్టడుగు స్థాయిలో బడుగు బలహీన వర్గాలను సమీకరించేందుకు ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. ప్రస్తుతం వివిధ సామాజిక తరగతులలోని మధ్యతరగతి, మేధావుల స్థాయిలో ఇది చర్చనీయాంశమైంది. రాజకీయ శ్రేణులలో విస్తృతంగా చర్చ నడుస్తున్నది. గ్రామస్థాయిలో, బస్తీ స్థాయిలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలను గుర్తించి ప్రజలను సమీకరించి ఉద్యమబాట పట్టవలసి ఉన్నది. మధ్యతరగతి బుద్ధిజీవులలో మేధోమధనం జరుగుతున్నది. తమ ప్రయోజనాల కోసం పనిచేయటమా లేక బడుగుజనం విముక్తి కోసం పోరాడటమా అన్నదే వీరి మీమాంస. మధ్య తరగతి బుద్ధిజీవుల ప్రయోజనం కూడా బడుగు బలహీన వర్గాల ప్రయోజనంతోనే ముడిపడి ఉన్నదని ఏమేరకు గుర్తిస్తే ఆ మేరకు ఫలితాలుంటాయి. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉన్నది. సరళీకృత ఆర్థిక విధానాల వైఫల్యాలు స్పష్టంగా బయటపడుతున్న సమయమిది. బూర్జువా పార్టీల ప్రయోగాల వైఫల్యం స్పష్టంగా చూశాము. ప్రపంచీకరణవైపు ఆకర్షణ మసకబారుతున్నది. మధ్యతరగతి గానీ, కొత్త తరం యువత గానీ సమస్యల పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ వెలుపల వెతికే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. అందుకే తెలంగాణలో జరుగుతున్న ఈ రాజకీయ మథనం మధ్యతరగతిని, కొత్త తరం యువతను కొంత ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. టీఆర్ఎస్ పాలనమీద వ్యక్తమవుతున్న అసంతృప్తి ఆటోమేటిక్‌గా కాంగ్రెస్‌వైపు వస్తుందన్న ఆశతో కాంగ్రెస్ నేతలు ఎదురుచూస్తున్నారు. కోదండరామ్ రాజకీయ పార్టీని స్థాపించాలనే నిర్ణయం ప్రకటించినప్పటికీ రానున్న ఎన్నికలలో తమ రాజకీయ వైఖరి ఎట్లా ఉండబోతున్నదో ఇంకా స్పష్టం చేయలేదు. ఏమైనా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలమీద బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చేసే కృషి ప్రజలలో విశ్వాసం నింపగల శక్తి మీదనే భవిష్యత్తు పరిణామాలు ఆధారపడి ఉన్నాయి. ఇది సంవత్సరంలో జరుగనున్న ఎన్నికల కోసం మాత్రమే చేస్తున్న ప్రయత్నం కాదు. ఇదొక దీర్ఘకాలిక ప్రణాళిక. ఆర్థిక, సామాజిక సమానత్వం సాధించేంతవరకూ జరగవలసిన కృషి. ఈ లక్ష్యంతోనే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అడుగులు వేస్తున్నది. ❊

**"మధ్యతరగతి బుద్ధిజీవులలో మేధోమధనం జరుగుతున్నది. తమ ప్రయోజనాల కోసం పనిచేయటమా లేక బడుగుజనం విముక్తి కోసం పోరాడటమా అన్నదే వీరి మీమాంస. మధ్య తరగతి బుద్ధిజీవుల ప్రయోజనం కూడా బడుగు బలహీన వర్గాల ప్రయోజనంతోనే ముడిపడి ఉన్నదని ఏమేరకు గుర్తిస్తే ఆ మేరకు ఫలితాలుంటాయి."**



బిఎల్ఎఫ్ నాయకత్వంలో ఆందోళనలో పాల్గొంటున్న ప్రజానీకం

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

# ప్రభుత్వ బ్యాంకులపై నయా ఉదారవాద దాడి



రచయిత ప్రజాశక్తి సహాయ సంపాదకులు

ఎ. కోటిరెడ్డి

బంగారం, వజ్రాల నగల వ్యాపారి నీరవ్‌మోడి పంజాబ్ నేషనల్ బ్యాంకును 11,500 కోట్ల రూపాయలకు మోసగించటం, ఐడిబిఐ, ఐసిఐసిఐ తదితర బ్యాంకులలో జరుగుతున్న కుంభకోణాలు కూడా వరుసగా వెల్లడి కావటంతో ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే చర్చను మరింత తీవ్రం చేశాయి. బ్యాంకులలో పేరుకు పోతున్న లక్షల కోట్ల రూపాయల పారు బకాయిలను సాకుగా చూపుతూ ప్రభుత్వరంగంలోని బ్యాంకులు అసమర్ధంగా తయారయాయని సరళీకరణవాదులు ఒక పథకం ప్రకారం తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ సాకుతో బ్యాంకుల ప్రైవేటీకరణను ముందుకు తెస్తూ, ఈ కుంభకోణాలను ఆయుధంగా వినియోగించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ప్రభుత్వ యాజమాన్యంలో ఉండటం వలననే మోసాలు జరిగి నష్టపోతున్నాయని, ప్రైవేటు యాజమాన్యంలో ఉంటే మోసాలు, అక్రమాలు జరగకుండా ఉంటాయని వాదిస్తున్నారు. వాస్తవం ఈ వాదనలకు విరుద్ధంగా ఉన్నది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలు అక్రమాలు, మోసాలకు దూరంగా ఉంటూ ప్రజలకు నిజాయితీగా సేవలందిస్తుండగా ప్రైవేటు బ్యాంకులు, ద్రవ్యసంస్థలలో అలవిమాలిన మోసాలు, అక్రమాలు జరుగుతున్నాయి.వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని అక్రమంగా దిగమింగుతున్నాయి. తాజాగా వెల్లడైన ఐసిఐసిఐ బ్యాంకు కుంభకోణం ఈ అంశాలను ధృవీకరిస్తున్నది. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులలో అక్రమాలకు పాల్పడిన వారంతా పెట్టుబడిదారులే. క్విడ్ ప్రో కో విధానంలో అక్రమంగా పొందిన రుణాలను తమలో తాము పంపకాలు చేసుకుంటూ, నెపాన్ని ప్రభుత్వ బ్యాంకులపైకి నెడుతున్నారు. బ్యాంకులలో జరుగుతున్న అక్రమాలలో ప్రభుత్వరంగ సంస్థలేవీ భాగస్వాములుగా లేవు. ప్రజల సొమ్మును మోసపూరితంగా స్వాహాచేస్తున్న ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ బ్యాంకులు అసమర్ధమైనవని ప్రచారం చేస్తూ తమ తప్పులను కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ నినాదాన్ని మొత్తం బడా బూర్జువా వర్గం, విదేశీ పెట్టుబడి దారులు, ప్రభుత్వం ఎందుకింత పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి?ఇది కేవలం బ్యాంకుల ప్రైవేటీకరణ మాత్రమే కారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ నంతా బడా పెట్టుబడిదారులు, విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టే చర్య. రైతులు, వృత్తిదారులు, చిరు వ్యాపారులు, చిన్న పెట్టుబడి దారులను దివాళా తీయించటంతో పాటు దేశ ఆర్థికవ్యవస్థను సర్వనాశనం చేయటానికి ఈ చర్య దోహదం చేస్తుంది.

**ప్రైవేటు బ్యాంకుల అక్రమాలు**

దేశంలో స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం ప్రైవేటుబ్యాంకుల చరిత్ర అంతా అక్రమాలు, మోసాలతో ముడిపడి ఉంది. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో ఏర్పడిన ప్రైవేటు బ్యాంకులు ప్రజల వద్ద నుండి వసూలు చేసిన డిపాజిట్లను తమ స్వప్రయోజనాలకు వినియోగించు కున్నాయి. అర్హత లేకపోయినా తమ ఆశ్రితులకు కోట్లాది రూపాయల రుణాలిచ్చాయి. ఆనాటికి ఉన్న 600 బ్యాంకులు పెద్ద పరిశ్రమలు, వాణిజ్యవర్గాలకు పరిశ్రమల నిర్మాణం, వర్కింగ్ కాపిటల్, ఇతర అవసరాలకు రుణాలు ఇస్తుండేవి. చిన్న వృత్తులు, వ్యాపారాలు చిన్న పరిశ్రమలు తదితరాలకు రుణాలు అందేవి కాదు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించక పోవటం, వసూలుపై బ్యాంకులు తగినంత శ్రద్ధ పెట్టకపోవటం, రుణాలు తీసుకున్న సంస్థలు చేసే మోసాలలో బ్యాంకులు కూడా భాగస్వాములు కావటం తదితర కారణాల వలన డిపాజిట్ దారులకు సకాలంలో చెల్లింపులు చేయక పోవటంతో బ్యాంకులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లింది. ఆ విధంగా అనేకబ్యాంకులు ప్రజల ధనాన్ని దిగమింగి, దివాళాలు ప్రకటించేవి. ఫలితంగా బ్యాంకులలో డిపాజిట్లు చేసినవారు తీవ్రంగా నష్టపోయారు. బ్యాంకుల పర్యవేక్షణకు కేంద్రబ్యాంకును ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ముందుకువచ్చింది. స్వాతంత్ర్యానంతరం 1949లో ఇంపీరియల్ బ్యాంకు- ప్రస్తుత ఆర్‌బిఐ-ను జాతీయం చేసి, బ్యాంకుల పర్యవేక్షణ అధికారాన్ని అప్పగించారు. తర్వాత 1955లో మొదటి ప్రభుత్వరంగ బ్యాంకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. ఎస్‌బిఐని ఏర్పాటు చేసినప్పటికీ చిన్న పరిశ్రమలు, వ్యాపారాలకు రుణాలు దొరకటం కష్టంగానే ఉండేది. ప్రైవేటుబ్యాంకులు తమ ఆశ్రితులకే రుణాలివ్వటం, ప్రజల డబ్బును తమ స్వలాభాలకు వినియోగించుకోవటం, బ్యాంకులను సంక్షోభంలోకి నెట్టే విధానాలనే అనుసరించాయి. 1935-47 మధ్య 900 బ్యాంకు కుంభకోణాలు జరగగా, 1947-69 మధ్య 665 కుంభకోణాలు జరిగాయి. ఈ విధంగా ప్రైవేటు బ్యాంకులు విఫలమౌతూ డిపాజిట్‌దారులు నష్టపోతున్న పరిస్థితులలో డిపాజిట్‌దారుల డబ్బుకు రక్షణ కల్పించటం కోసం 1962లో డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టారు. 1959లో జరిపిన పరిశీలనలో 566 బ్యాంకులలో 474 బ్యాంకులు ఆర్‌బిఐ నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించటం లేదని స్పష్టమైంది. ఈ విధమైన పరిస్థితులు, ప్రభుత్వం రూపొందించిన ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యతా క్రమంలో 1969లో 50 కోట్ల రూపాయలకు మించి డిపాజిట్లు ఉన్న 16 ప్రధాన ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేసి, ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకొచ్చారు. 200 కోట్ల రూపాయల డిపాజిట్లు దాటిన మరో 8 బ్యాంకులను 1980లో జాతీయం చేశారు. జాతీయకరణ తర్వాత బ్యాంకులు సాధారణ ప్రజలకు అందు

బాటులోకి వచ్చాయి. బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరిగింది. సాధారణ ప్రజలు బ్యాంకు లావాదేవీలలో భాగస్వాములు కావటం పెరిగింది.

ప్రభుత్వం రూపొందించిన పంచవర్ష ప్రణాళికలకు నిధులను సమీకరించటం, పారిశ్రామికీకరణకు నిధుల సమీకరణ, ప్రభుత్వం రూపొందిస్తున్న సబ్సిడీ పథకాలకు రుణాలు మంజూరు చేయటం తదితరాల కోసం ప్రభుత్వం బ్యాంకులను సాధనంగా వినియోగించుకున్నది. బ్యాంకులు దేశంలోని గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గిరిజన ప్రాంతాలలోకి చొచ్చుకు పోయాయి. 2005 నాటికి 58,000 బ్యాంకు బ్రాంచీలను కొత్తగా ఏర్పాటు చేశారు. సాధారణ ప్రజల నుండి విస్తారంగా డిపాజిట్లు సేకరించటం, రైతులు, చేతివృత్తులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు తదితరులకు రుణాలివ్వటం పెరిగింది. పది లక్షల కోట్ల రూపాయలను ప్రజల నుండి డిపాజిట్లుగా బ్యాంకులు సేకరించాయి. జాతీయకరణ తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల డిపాజిట్లు 31 శాతం నుండి 86 శాతానికి పెరిగాయి. ప్రాధాన్యతా రంగాలకు 33.3 శాతం రుణాలివ్వటం ప్రారంభించారు. 1980లో ఆరు బ్యాంకులను జాతీయం చేసిన తర్వాత డిపాజిట్ల సేకరణలో ప్రభుత్వబ్యాంకుల వాటా 92 శాతానికి,ప్రాధాన్యతా రంగ రుణాలు 40 శాతంకు పెరిగాయి. . బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ యాజమాన్యంలోని ఇతర ద్రవ్యసంస్థలు త్వరత్వరగా విస్తరించాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు దేశ ఆర్థికాభివృద్ధికి మూలస్థంభంగా నిలిచాయి. ప్రభుత్వ బ్యాంకుల సహకారంతో పారిశ్రామిక, వ్యవసాయ, సేవల రంగాలు త్వరితంగా విస్తరించాయి.

బ్యాంకులు ప్రైవేటు యాజమాన్యంలో ఉండగా క్యాష్ రిజర్వ్ రేషియో-సిఆర్ఆర్- 2 శాతం ఉండగా, స్టాట్యూటరి లిక్విడిటి రేషియో-ఎస్ఎల్ఆర్-25 శాతంగా ఉన్నది. జాతీయకరణ తర్వాత వీటిని క్రమంగా పెంచుతూ 1991 నాటికి వరుసగా 15, 38.5 శాతంకు పెంచారు. ఈ మార్పుల ఫలితంగా బ్యాంకు డిపాజిట్లలో 50 శాతంకు పైగా నిధులు ప్రభుత్వ అదుపులో ఉండేవి. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రాధాన్యతా రంగాలకు మరో 40 శాతం రుణాలు ఇచ్చేవారు. ఆ విధంగా జాతీయకరణ తర్వాత బ్యాంకులు సేకరించిన నిధులలో 90 శాతానికి పైగా ప్రభుత్వం వద్ద, లేదా ప్రభుత్వం నిర్దేశించిన రంగాలకు పెట్టుబడుల కోసం రుణాలుగా ఇవ్వటం జరిగింది. ప్రజల పొదుపు దేశాభివృద్ధికి వినియోగపడటంతో పాటు, ప్రభుత్వం అదుపులో క్షేమంగా ఉండేది. కుంభ కోణాలు, మోసాలుజరగటానికి అవకాశాలు తక్కువగా ఉండేవి.

**"ఆ విధంగా జాతీయకరణ తర్వాత బ్యాంకులు సేకరించిన నిధులలో 90 శాతానికి పైగా ప్రభుత్వం వద్ద, లేదా ప్రభుత్వం నిర్దేశించిన రంగాలకు పెట్టుబడుల కోసం రుణాలుగా ఇవ్వటం జరిగింది. ప్రజల పొదుపు దేశాభివృద్ధికి వినియోగపడటంతో పాటు, ప్రభుత్వం అదుపులో క్షేమంగా ఉండేది. కుంభకోణాలు, మోసాలు జరగటానికి అవకాశాలు తక్కువగా ఉండేవి."**



ఫిక్కీ సమావేశంలో బడా పెట్టుబడిదారులతో ప్రధాని మోడీ

**సరళీకరణ విధానాలు**

సరళీకరణ విధానాల అమలు ప్రారంభం అయిన తర్వాత ప్రభుత్వ బ్యాంకుల నిర్వహణా విధానంలో మార్పులు తీసుకొచ్చారు. ప్రైవేటు బ్యాంకులను ఏర్పాటు చేసుకోవటానికి, విదేశీ బ్యాంకుల ప్రవేశానికి అవకాశం కల్పించింది. దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను ప్రభుత్వం సడలించింది. ప్రభుత్వం అమలు చేయాల్సిన కార్యక్రమాలలో, ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనరంగంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్-పిపిపి- విధానాన్ని ప్రారంభించి, జాతీయబ్యాంకుల నుండి పెట్టుబడిదారులకు పెద్దమొత్తంలో రుణాలిప్పించారు. సరళీకరణ విధానాలలో ప్రధానాంశమైన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కారణంగా పెట్టుబడిదారులు, బూర్జువా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావటంతో పెట్టబడిదారులు బ్యాంకుల నుండి తమ తాహతుకు మించి, యధేచ్ఛగా రుణాలు పొందారు. తిరిగి చెల్లించాల్సి వచ్చేసరికి రుణాలు తీసుకున్న వారిలో కొందరు తిరిగి చెల్లించలేకపోయారు. చెల్లించగలిగిన వారు కూడా అక్రమపద్ధతిలో తమ లాభాలను పెంచుకోవటం కోసం రుణాలను ఎగవేశారు. ఆ విధంగా బ్యాంకులలో నిరర్ధక ఆస్తులు-ఎన్‌పిఎ- పెరగటం ప్రారంభమైంది. బ్యాంకులను ఉపయోగించుకొని తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకున్న పెట్టుబడిదారులు, బూర్జువా రాజకీయ నాయకులు ప్రభుత్వరంగ బ్యాంకులను తమ స్వంతం చేసుకోవటం కోసం తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వరంగ బ్యాంకులు అసమర్ధమైనవని, తిరిగిరాని బకాయిలు పెద్దమొత్తంలో పేరుకుపోయాయని, బ్యాంకులను ప్రభుత్వరంగం నుండి తప్పించి, ప్రైవేటు వారికిస్తే సమర్థవంతంగా పనిచేస్తాయని ప్రచారం తీవ్రం చేశారు. వాస్తవమేమిటి? ప్రైవేటువారి చేతుల్లో అసమర్ధంగా ఉన్న బ్యాంకులు జాతీయకరణ తర్వాత సమర్థతతో పనిచేస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి పట్టుకొమ్మలుగా మారాయి. దీనిని కప్పిపుచ్చి, ప్రైవేటు రంగం సమర్ధవంతమైనదని ప్రచారం చేయటం వెనుక లక్ష్యం మేకను కుక్క అని బ్రాహ్మణుని నమ్మించి, అతని వద్దనున్న మేకను కాజేసిన దొంగల వలె ప్రభుత్వ బ్యాంకులపై దాడిని తీవ్రం చేస్తున్నారు. ప్రజలను మభ్యపెట్టి, ప్రభుత్వ

**"బ్యాంకుల ప్రైవేటీకరణ జరిగితే అది దేశ ఆర్థికవ్యవస్థకు పెను ప్రమాదంగా పరిణమిస్తుంది. బ్యాంకులు ప్రభుత్వ రంగంలోకి వచ్చిన తర్వాత ఆర్థికరంగానికి అసమాన సేవలందించాయి. దేశ పారిశ్రామికాభివృద్ధికి బ్యాంకులు పెద్ద మొత్తంలో నిధులందించాయి. ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధిలో ప్రభుత్వ బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ముఖ్య పాత్రను నిర్వహించాయి."**



ప్రభుత్వ బ్యాంకుల ఋణాలతో నిలదొక్కుకుంటున్న చిరు వ్యాపారులు

బ్యాంకులను స్వంతం చేసుకోవాలన్న పెట్టుబడిదారుల కుట్ర దీనివెనుక దాగి ఉన్నది. నీరవ్‌మోడి, ఐడిబిఐ, ఐసిఐసిఐ, ఇతర బ్యాంకులలో జరిగిన కుంభకోణాలు బయటపడటం ప్రారంభమైన తర్వాత దేశంలో బడా పెట్టుబడిదారీ వర్గానికి నాయకత్వం వహిస్తున్న సిఐఐ, ఫిక్కి, అసోచాంలు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని డిమాండ్ చేస్తున్నాయి. కాని ఇంత మోసానికి పాల్పడిన నీరవ్‌మోడి, విజయ్ మాల్యా, లలిత్‌మోడి తదితర మోస గాళ్ళను దేశానికి రప్పించి, చట్ట ప్రకారం శిక్షించాలనే డిమాండ్ మాత్రం చేయటం లేదు. పెట్టుబడిదారులు ఎంతటి నయవంచకులో, ఏ విధంగా తిమ్మినిబమ్మిని చేయగలరో, తమ చేతులలో ఉన్న ప్రచార సాధనాలను ఉపయోగించి, అబద్ధాల ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టటానికి ఏ విధంగా దిగజారతారన్న విషయం ప్రభుత్వబ్యాంకులను ప్రైవేటీకరించాలన్న ప్రచారం స్పష్టం చేస్తున్నది.

అమెరికాలో 2008లో ప్రారంభమై, ప్రపంచదేశాలకు వ్యాపించిన గృహరుణ సంక్షోభం ప్రైవేటు బ్యాంకుల చలవే. 2000 సంవత్సరం తర్వాత అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి దశలో ఉన్నపుడు బ్యాంకులు విస్తారంగా గృహరుణాలు ఇవ్వటం ప్రారంభించాయి. పేదలు, చెల్లించగల స్థితిలేని వారికి కూడా రుణాలిచ్చాయి. రుణాలిప్పించిన మధ్యవర్తులు బ్యాంకుల నుండి కమీషన్లు పొందారు. పరిస్థితులు బాగా ఉన్నంతకాలం రుణం తీసుకున్న వారు నెలవారీ వాయిదాలు చెల్లించటం సక్రమంగానే సాగింది. 2007వ సంవత్సరం వచ్చేసరికి అర్హత లేకుండా రుణాలు తీసుకున్న వారు వాయిదాలు చెల్లించలేకపోయారు. వారు ఇళ్ళను వదులుకున్నారు. రుణం రికవరీ కోసం ఇళ్ళను వేలం వేయటానికి బ్యాంకులు పూనుకుంటే కొనేవారు దొరకలేదు. క్రమంగా ఇళ్ళ ధరలు పడిపోవటం ప్రారంభమైంది. రుణ వాయిదాలు చెల్లించగలిగిన వారికి వారు చెల్లిస్తున్న నెలవారీ వాయిదాల మొత్తం ఇంటి ఖరీదుకు మించిపోతున్నదని అర్థమైంది. వారు కూడా నెలవారీ వాయిదాల చెల్లింపును ఆపివేశారు. ఆర్థికవ్యవస్థ స్తంభించిపోయింది. చెల్లించగల స్థితిలేనివారికి ఇచ్చిన రుణాలకు కూడా 'ఎఎఎ', 'ఎఎ' రేటింగ్‌లు ఇచ్చి ఎస్ అండ్ పి, మూడీస్, ఫిచ్ తదితర రేటింగ్ సంస్థలు కూడా ఈ సంక్షోభానికి కారణమైనాయి. తాకట్టు రుణాలిచ్చిన సంస్థలు చెల్లింపులు చేయలేక పోవటం, కొన్ని సంస్థలు మూతపడటం జరిగింది. పెద్దసంస్థలు కూలిపోకుండా అమెరికా ప్రభుత్వం బెయిలవుట్‌లు ఇచ్చింది. అమెరికా ప్రభుత్వం మొత్తం 16.8 ట్రిలియన్ డాలర్లు బెయిలవుట్లుగా చెల్లించింది. ఈ మొత్తం ఆ సంవత్సరం అమెరికా జిడిపి కన్నా ఎక్కువ. ఆ తర్వాత ఈ సంక్షోభం ఇతర దేశాలకు పాకటం తెలిసిందే. ఇదీ ప్రైవేటు బ్యాంకుల నిర్వాకం.

### ప్రైవేటీకరణ అంటే దొంగల చేతికి తాళం ఇవ్వటమే

పెట్టుబడిదారులు డిమాండ్ చేస్తున్నట్లుగా బ్యాంకులను ప్రైవేటీకరిస్తే అవి ఎవరి చేతుల్లోకి పోతాయి? ఎవరైతే బ్యాంకులను మోసం చేస్తున్నారో, ఎవరైతే బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఎగ్గొడుతున్నారో ఆ మోస గాళ్ళ చేతుల్లోకే ప్రభుత్వ బ్యాంకులు వెళతాయి. బ్యాంకులు తిరిగి పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళి, ప్రైవేటుపరం అయితే వెనకటి చరిత్ర పునరావృతం అవుతుంది. బ్యాంకులపై యాజమాన్యం సాధించిన కొద్దిమంది ప్రయోజనాలను నెరవేర్చటానికి బ్యాంకులు పరిమితం అవుతాయి. జాతీయం చేయబడిన తర్వాత నిర్వహించిన ఏ ప్రధాన కర్తవ్యాన్ని నిర్వహించగల స్థితిలో బ్యాంకులు ఉండవు. దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి విఘాతం కలుగుతుంది. బ్యాంకుల జాతీయకరణ అనంతరం జరిగిన అభివృద్ధి, సరళీకృత ఆర్థిక విధానాల పర్యవసానాలను పరిశీలిస్తే పాలకుల మోసం బయట పడుతుంది.

### దేశాభివృద్ధిలో ప్రభుత్వ బ్యాంకుల పాత్ర

బ్యాంకుల ప్రైవేటీకరణ జరిగితే అది దేశ ఆర్థికవ్యవస్థకు పెను ప్రమాదంగా పరిణమిస్తుంది. బ్యాంకులు ప్రభుత్వరంగంలోకి వచ్చిన తర్వాత ఆర్థికరంగానికి అసమాన సేవలందించాయి. దేశ పారిశ్రామికాభివృద్ధికి బ్యాంకులు పెద్దమొత్తంలో నిధులందించాయి. ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధిలో ప్రభుత్వ బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ముఖ్యపాత్రను నిర్వహించాయి. ప్రభుత్వరంగ నిర్మాణం కోసం ప్రభుత్వ బ్యాంకులు లక్షల కోట్ల రూపాయల రుణాలను అందించాయి. ప్రైవేటురంగం అభివృద్ధిలో కూడా ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలదే కీలకపాత్ర. ప్రభుత్వబ్యాంకుల రుణాలతోనే ప్రైవేటుసంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేయగలిగాయి. ప్రభుత్వ, ప్రైవేటుసంస్థలకు నిర్వహణ నిధులు అందించటంలో కూడా బ్యాంకులు ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. పరిశ్రమలతో పాటు వ్యాపారాలకు కూడా పెద్దమొత్తంలో నిధులందిస్తున్నాయి. వృత్తులు, స్వయం ఉపాధి తదితరాలకు కూడా విస్తృతంగా రుణాలను అందజేస్తున్నాయి. వ్యవసాయరంగానికి బ్యాంకులు అందజేస్తున్న రుణాల వలన పేద, మధ్యతరగతి

> **"ప్రభుత్వరంగంలోని బ్యాంకులను ప్రైవేటీ కరిస్తే అవి ప్రైవేటు, విదేశీ కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళతాయి. కార్పొరేట్లు, విదేశీ సంస్థలు మోసపూరితంగా ఆర్థిక లావాదేవీలను నిర్వహించటం ద్వారా ప్రజల, ప్రభుత్వ సొమ్మును హరించటంలో ముందుంటాయి. తమ లాభం మినహా దేశాభి వృద్ధి, ప్రజల సంక్షేమం వీరికి పట్టదు. తమకు లాభం వస్తే ప్రజలను ముంచటానికి వారేమాత్రం వెనుకాడరు."**

రైతాంగం సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించారు. వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానం చొచ్చుకుపోతూ ద్రవ్యీకరణ చెందటంతో పెట్టుబడుల అవసరం పెరిగింది. జాతీయకరణ జరిగి గ్రామీణ ప్రాంతాలలోకి ప్రభుత్వబ్యాంకులు ప్రవేశించటానికి పూర్వం రైతాంగం తమ అవసరాల కోసం భూస్వాములు, వడ్డీ వ్యాపారులపై ఆధారపడి ఉండేవారు. వారు అధికవడ్డీలతో రైతాంగాన్ని పీల్చిపిప్పిచేసేవారు. అనేక మోసపు పద్ధతులకు పాల్పడుతూ రైతుల స్వంత భూములను కాజేసేవారు. అటువంటి స్థితిలో గ్రామీణ ప్రాంతాలలోకి ప్రవేశించిన బ్యాంకులు రైతాంగానికి విస్తారంగా పంటరుణాలను ఇవ్వటంతో రైతులకు భూస్వాములు, వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. సకాలంలో పెట్టుబడులకుడబ్బులందటంతో వ్యవసాయోత్పత్తి పెరిగింది. చేతివృత్తులు, స్వయం ఉపాధి చూసుకుంటున్న వారికి తక్కువ వడ్డీకి రుణాలివ్వటంతో అటువంటి వారు ఆర్థికంగా నిలదొక్కుకోవటం సాధ్యమైంది. చిన్న పరిశ్రమలు, చిరు వ్యాపారులు ఎక్కువగా బ్యాంకురుణాలపై ఆధారపడి వారి పరిశ్రమలు, వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఈ విధంగా ఆర్థికవ్యవస్థలోని అన్ని రంగాల అభివృద్ధిలోనూ ప్రభుత్వరంగ బ్యాంకుల పాత్ర విస్మరించలేనిదిగా మారింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి లభిస్తున్న రుణాలు వీటన్నింటికీ జీవనాడిగా ఉన్నాయి.

**బ్యాంకుల ప్రైవేటీకరణ పర్యవసానాలు**

ప్రభుత్వరంగంలోని బ్యాంకులను ప్రైవేటీకరిస్తే అవి ప్రైవేటు, విదేశీ కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళతాయి. కార్పొరేట్లు, విదేశీ సంస్థలు మోసపూరితంగా ఆర్థిక లావాదేవీలను నిర్వహించటం ద్వారా ప్రజల, ప్రభుత్వ సొమ్మును హరించటంలో ముందుంటాయి. తమ లాభం మినహా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వీరికి పట్టదు. తమకు లాభం వస్తే ప్రజలను ముంచటానికి వారేమాత్రం వెనుకాడరు. వారి కార్యకలాపాలలో ఏ మాత్రం నిజాయితీ ఉండదు. బ్యాంకులలో ప్రజల డిపాజిట్లకు గ్యారంటీ ఉండదు. ప్రస్తుతం బ్యాంకులలోని ప్రజల డబ్బు లక్ష రూపాయలకు మాత్రమే బీమా సదుపాయం ఉన్నది. అంటే ఏవైనా అనుకోని సంఘటనలు జరిగి, బ్యాంకులు డిపాజిట్లను తిరిగి చెల్లించలేకపోతే బ్యాంకులలో దాచుకున్న మొత్తంలో డిపాజిట్‌దారునికి లక్ష రూపాయలు మాత్రమే చెల్లించబడతాయి. అయినా బ్యాంకులలో కోట్ల రూపాయలు డిపాజిట్లు ఉన్నవారు కూడా నిశ్చింతగా ఉండటానికి కారణం బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉండటమే. తాము డబ్బు దాచుకున్న బ్యాంకు ప్రభుత్వ యాజమాన్యంలో ఉంది కాబట్టి తమడబ్బుకు ప్రమాదం లేదని ప్రజలు భావిస్తున్నారు. బ్యాంకులు ప్రైవేటు వారి చేతుల్లోకి వెళితే ఈ గ్యారంటి ఉండదు. ప్రస్తుతం ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉన్నప్పటికీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకులలో డబ్బు డిపాజిట్ చేసిన వారు ఆందోళనకు గురవు తున్నారు. బ్యాంకులలో డబ్బు దాచుకుంటే తిరిగి రావేమోనని సందేహిస్తున్నారు. అందువలననే బ్యాంకుల నుండి డబ్బు తీసుకున్నవారు తిరిగి బ్యాంకులో డిపాజిట్ చేయాలంటే భయపడు తున్నారు. ప్రభుత్వ యాజమాన్యంలో బ్యాంకులు న్నపుడే ఈ పరిస్థితి ఎదురౌతుంటే ఇక ప్రైవేటు వారిచేతుల్లోకి వెళితే అభద్రత ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవాల్సిందే.



బ్యాంకులను పర్యవేక్షిస్తున్న రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రైవేటుబ్యాంకులు తమ లాభాల కోసం అనేక అక్రమపద్ధతులకు పాల్పడతాయి. ఏ నిబంధనలు, చట్టాలను పాటించవు. తమకు లాభాలస్తున్నాయనుకుంటే దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి, తీవ్రవాదులకు కూడా నిధులను అందజేస్తాయి. బ్యాలన్స్ షీట్లలో నమోదు చేయని లావాదేవీలకు పాల్పడతారు. ఎకౌంట్లలో చూయించరు కాబట్టి ఈ లావాదేవీలలో ఎంతమొత్తం ఉందో ఎవరికీ తెలియదు. ఇటువంటి లావాదేశీలు ప్రైవేటుబ్యాంకులు 106 శాతం నిర్వహిస్తుండగా, విదేశీబ్యాంకులు 926 శాతం నిర్వహిస్తున్నాయి. బ్యాలెన్స్ షీట్లలో చూయించని లావాదేవీలలో సంఘ వ్యతిరేకశక్తుల చీకటి వ్యాపారాలకు రుణాలివ్వటం, షేర్ల కొనుగోలు, అక్రమ వ్యాపారాలలో భాగస్వాములు కావటం, అధికవడ్డీల కోసం అర్హత లేని సంస్థలు, వ్యక్తులకు రుణాలివ్వటం,వడ్డీరేట్లలో మార్పులు, పాక్షిక పెట్టుబడులకు చెల్లించాల్సినవి తదితరాలుంటాయి. వీటిలో ఎక్కువ భాగం డెరివేటివ్స్ రూపంలో ఉంటాయి. కాబట్టి ఉన్న ఆస్తులను అధికధరలలో లెక్కిస్తారు. ఆ విధంగా బ్యాంకులు లాభాలలో ఉన్నట్లు, ఆస్తులు అధికంగా ఉన్నట్లు చూయిస్తారు. సంక్షోభం ఎదురైన పరిస్థితుల్లో వీటి బండారం బట్టబయలవుతుంది. దివాళా పిటీషన్ దాఖలుచేసి డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన డబ్బును ఎగ్గొడతారు. ప్రజలు తాము కష్టపడి సంపాదించుకున్న డబ్బును కోల్పోవటం మినహా ఏమీచేయలేని నిస్సహాయ స్థితికి నెట్టబడతారు.

దేశంలో ప్రైవేటు, విదేశీ బ్యాంకులు 25

(మిగతా 35వ పేజీలో)

పుస్తక సమీక్ష

# బిజెపి అంతర్జాల మాఫియా గుట్టు రట్టు



రచయిత ప్రజాశక్తి
బుక్‌హౌస్ సబ్‌ఎడిటర్

**గుల్ల తిరుపతిరావు**

***అప్పటివరకూ దేశంలో అంతంత మాత్రంగా ఉన్న బిజెపి 2014లో ఉన్నట్టుండి అధికారంలోకి ఎలా వచ్చింది? గుజరాత్‌లో సమర్థత లేని ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీ ఏకంగా ప్రధానమంత్రి ఎలా అయ్యారు? ప్రజలను అంతలా ప్రభావితం చేసేలా బిజెపి చేసిన ఘనకార్యం ఏమిటి? భయంకరమైన ఫాసిస్టు సిద్ధాంతాలు గల పార్టీ ప్రజల్లో ఎలా మనగలుగుతోంది? నేనొక అంతర్జాల పోకిరిని పుస్తకంలో స్వాతి చతుర్వేది ఈ విషయాలను కూలంకషంగా వివరించారు.***

అనేక అంశాలుదీనికి దోహదం చేశాయి. అందులో ప్రధానమైన వాటిలో సోషల్ మీడియా ఒకటి. అబద్ధాలను, తప్పుడు విధానాలను పదేపదే బలంగా చెప్పి దానిని నిజమని నమ్మించడమే మొదట నుంచి వారి సిద్ధాంతం. వీరి గోబెల్స్ ప్రచారాలకు సోషల్ మీడియా దొరకడంతో ఇదే అదునుగా దేశవ్యాప్తంగా చొచ్చుకుపోయారు. సోషల్ మీడియా వేదికగా ఈ దేశంలో హిందువులకు ముస్లిములే శత్రువులన్న ద్వేషాన్ని రెచ్చగొట్టడం, ముస్లిములందరూ ఉగ్రవాదులనేలా వీడియోలు మార్ఫింగ్‌లు చేసి చూపించడం తదితర విద్వేష పూరితమైన ప్రచారంతో మెజారిటీ ప్రజలను తమవైపు తిప్పుకోవడమే లక్ష్యంగా అంతర్జాలంలో బిజెపి దండు పని చేసి, సఫలమవుతూ వచ్చింది. ఈ దుష్ట సైన్యం ఆగడాలు తెలియజెప్పే పుస్తకమే ఐ యామ్ ఎ ట్రోల్ (నేనో అంతర్జాల పోకిరి). ఢిల్లీలో ఓ పరిశోధనాత్మక విలేకరిగా పని చేస్తున్న స్వాతి చతుర్వేది రెండు సంవత్సరాలు పరిశోధన జరిపి వారి గుట్టు బట్టబయలు చేశారు. ఆ పరిశోధన సమగ్ర సమాచారమే ఈ పుస్తకం.

**ప్రణాళిక ప్రకారం సోషల్ మీడియా పని...**

ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాలో చూసినట్లైతే దేశంలో అసహనాన్ని పెంపొందించే, ఘర్షణలను ప్రేరేపించే, కులమత ద్వేషాలు రెచ్చగొట్టే పోస్టింగులు నిత్యం వందల్లో వస్తుంటాయి. వాటితో విభేదించినా, దానికి వ్యతిరేకంగా పోస్టు చేసినా కనీసం పది, పదిహేను మంది వేర్వేరు అకౌంట్లుతో ఒకేసారి దాడి చేస్తుంటారు. ఎక్కువగా తిట్లదండకాలతో సందేశాలు గుప్పిస్తారు. మతోన్మాద వ్యతిరేకులకు, ప్రజాతంత్రంగా ఆలోచించే వారికి ఇటువంటి సంఘటన సోషల్ మీడియాలో తారసపడే ఉంటుంది. ఎక్కడెక్కడో ఆన్‌లైన్‌లో ఉన్నవారు ఎలా ఇంత ప్రణాళికా బద్ధంగా దాడి చేస్తున్నారు? వీరంతా ఒక చోటే ఉండి దాడి చేస్తున్నారా? అనే అనుమానం కూడా కలిగి ఉంటుంది. ఆ అనుమానం నిజమని అంతర్జాల పోకిరి పుస్తకం చదివిన తరువాత అర్థమవుతుంది. స్వాతి చతుర్వేది పరిశోధనలో తేలిన అంశాలను మీ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాను.

న్యూఢిల్లీలోని 11– అశోకా రోడ్‌లో ఉన్న బిజెపి కేంద్ర కార్యాలయంలో ఐటి సెల్ లేక నేషనల్ డిజిటల్ ఆపరేషన్స్ సెంటర్ (ఎన్‌డిఒసి) అరవింద్ గుప్తా నాయకత్వంలో పనిచేస్తున్నది. ప్రధాని నరేంద్ర మోడీతోనూ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షాతోనూ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ప్రత్యేకంగా నియుక్తుడైన ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌తోనూ అరవింద్ గుప్తా ప్రత్యక్ష సంబంధంలో ఉంటాడు. ఈయన నియంత్రణలో సుమారు 50 వరకూ వాట్సాప్, ట్విట్టర్ కోర్ గ్రూపులు పని చేస్తుంటాయి. సామాజిక మాధ్యమంలో ఏ రోజు ఏ ప్రచారాన్ని 'ట్రెండ్'గా మార్చాలనే అంశంపై గుప్తా ఆదేశాల మేరకు ఈ కోర్ గ్రూపులు పని చేస్తుంటాయి. దేశవ్యాప్తంగా ప్రచారంలో నిమగ్నమై ఉన్న తమ సామాజిక మాధ్యమ కార్యకర్తలకు ఏ రోజుకు ఆ రోజు ఇక్కడనుండే ఆదేశాలు వెళ్తుంటాయి. ఇక్కడున్న ఐటి విభాగంలో పనిచేయడానికి పార్టీ నియమించిన వాలంటీర్లతో పాటు, సుమారు 200 మంది కూలికి పెట్టుకున్న సైబర్ కార్మికులూ ఉన్నారు. పార్టీకి ప్రజా సంబంధాలు మెరుగుపరిచే పనిలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాలనో, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా పలుకులనో 'ట్వీట్' చేస్తూ ఉంటారు. ట్విట్టర్‌లో ఖాతాలను పరిశీలించే షరతులు అంత కఠినంగా లేని రోజుల్లోనే బిజెపి ముందు చూపుతో కొన్ని వేల ట్విట్టర్ ఖాతాలు తెరిచి అట్టేపెట్టుకుంది. ఇవన్నీ పార్టీ కార్యకర్తల ఖాతాలే. అవసరం వచ్చినప్పుడల్లా వీటిని వాడుతుంటారు. గుజరాత్‌లోని కొన్ని అహమ్మదాబాద్, వడోదరా పటణాల్లో కూడా ఈ తరహా సెంటర్‌లు ఏర్పాటు చేశారు. ఈ రెండు పట్టణాల్లో సుమారు 2000 మందిని నియమించుకున్నారు. పార్టీ ఐటి విభాగం 'బాట్స్'(Bots)ను కూడా నియంత్రిస్తూ ఉంటుంది. ఈ 'బాట్స్' ద్వారా ఒకే సందేశాన్ని పదులు, వందలు, వేలుగా పంపించవచ్చు. వాస్తవానికి ఇవి కలనగణితం (అల్గారిథమ్) ఆధారంగా పనిచేసే యాంత్రిక ఖాతాలు కాని పైకి చూస్తే నిజమైన వ్యక్తుల ఖాతాలుగా కనిపిస్తాయి. ఈ రకమైన బందోబస్తు ఏర్పాట్లతో కావల్సిన ట్వీట్‌లతో 'టైమ్‌లైన్' లను వరదలా పోటెత్తిస్తారు.

ఎవరన్నా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన 'హైప్రొఫైల్' ఖాతాదారులను విమర్శిస్తే వారిపై అనామక అంతర్జాల పోకిరీలు మిడతల దండులా దాడికి తెగబడు తుంటారు. మహిళ

లైతే అభ్యంతరకరమైన స్త్రీ రహస్యకేశాల చిత్రాలు, అత్యంత అసభ్యపద జాలంతో కూడిన సందేశాలు వరదలా పారి స్తారు. ఎదుటివారు ఎంత పేరుగలవారయితే ఈ పోకిరీలు ఉపయోగించే భాష అంత అధమ స్థాయి అసభ్యకరభాష ఉపయోగిస్తూ ఉంటారు. టీవీ జర్నలిస్టులలో బాగా పేరున్న బర్ఖాదత్, రాజ్‌దీప్ సర్దేశాయ్‌లు ఎక్కువగా వీరిలక్ష్యంగా ఉంటారు. ఒక్కసారి వాట్సప్ గ్రూప్‌లో లక్షిత వ్యక్తి ఫోన్‌నెంబర్ చలామణి చేసిమరీ ఈ పోకిరి దాడులను పై స్థాయికి తీసుకెళుతుంటారు. 'సెక్యులర్'(లౌకిక)భావజాలం కలిగినవారిని 'సిక్యులర్' (రోగగ్రస్తులు)ని మీడియాలో పనిచేసే వారిని 'మీడియా వ్యభిచారులు' (ప్రెస్టిట్యూట్) అని సంబోధించడం వీరికి పరిపాటి.

> **"ఇలాంటి అంతర్జాల పోకిరీల ఖాతాల నుండి - పోలీసు కేసులున్నా, ట్విట్టర్ ఖాతా ఒకసారి రద్దు చేయబడిన వారి నుండి మోడీ దూరంగా జరిగిందిలేదు. పైపెచ్చు ఇలా తాను అనుసరి స్తున్న 150 ట్విట్టర్ ఖాతాదారులందరిని పోగేసి 2015 జూలై 1న నెంబర్ 7, రేస్‌కోర్స్ రోడ్‌లోని (ప్రస్తుతం దీనినే 'లోకకళ్యాణ్ మార్గ్'గా పేరుమార్చారు) ప్రధాని అధికారిక నివాసంలో 'డిజిటల్ సంపర్క్' పేరిట ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు."**

**మోడీ అనుయాయులే అంతర్జాల పోకిరీలు**

నరేంద్రమోడీ 2009లో ట్విట్టర్‌లో ఖాతా తెరిచారు. నరేంద్రమోడీ ట్విట్టర్ ఖాతాకు 21.60 లక్షల మంది ఫాలోయర్స్ ఉన్నారు. మోడీ 1375 మంది ఖాతాలకు 'ఫాలోయర్'గా ఉన్నాడు. ఆయన అనుసరించే ఖాతాల్లో 26 ట్విట్టర్ ఖాతాలు ఇతర రాజకీయ పార్టీల నాయకులు, పత్రికా విలేకరుల మీద ప్రత్యేకించి మహిళలు, మైనార్టీలు దళితుల మీద నిత్యం తిట్ల దండకాలు లంకించుకోవడం, లైంగికంగా అనుచిత వ్యాఖ్యలు చెయ్యడం, హత్యచేస్తామని బెదిరించడం చేస్తూ ఉంటాయి. తిట్ల పాలయిన పౌరులు ఎవరైనా 'మోడీ మహాశయా ఇదేం అన్యాయం, ఇట్లాంటి పోకిరీల ఖాతాలను మీరెందుకు అనుసరిస్తున్నారని' ప్రశ్నిస్తే సదరు మోడీగారు మౌనవ్రతం పాటిస్తారు. ఇలాంటి అంతర్జాల పోకిరీల ఖాతాల నుండి – పోలీసు కేసులున్నా, ట్విట్టర్ ఖాతా ఒకసారి రద్దు చేయబడిన వారి నుండి మోడీ దూరంగా జరిగిందిలేదు. పైపెచ్చు ఇలా తాను అనుసరి స్తున్న 150 ట్విట్టర్ ఖాతాదారులందరిని పోగేసి 2015 జూలై 1న నెంబర్ 7, రేస్‌కోర్స్ రోడ్‌లోని (ప్రస్తుతం దీనినే 'లోకకళ్యాణ్ మార్గ్'గా పేరుమార్చారు) ప్రధాని అధికారిక నివాసంలో 'డిజిటల్ సంపర్క్' పేరిట ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు సదరు మోడీ మహాశయులు. బిజెపి మంత్రులు వీరిని 'యోధులు' అని ముద్దుగా పిల్చుకుంటారు. ఈ యోధులు ఎలా ఉంటారో, ఏ విధంగా దాడి చేస్తారో మీకు పరిచయం చేస్తాను.

**అసభ్యకర రాతలు – వికృత చేష్టలు**

ఈ యోధుల ట్విట్టర్ ఖాతాల్లో కొంతమంది ఊరూ, పేరూ వివరాలులేని అనామకులుగా ఉంటారు. 'సురేష్ నఖోవ్' అన్న పేరుగల ఖాతాను పరిశీలిస్తే ప్రధాని నరేంద్ర మోడీ ఆ ఖాతాను అనుసరిస్తున్నారు – సెప్టెంబరు 14న ఇండియాటుడే ఈ ఖాతాను 'బ్లాక్' చేసింది. ట్విట్టర్ నా ఖాతాని సెప్టెంబరు 14న 24 గంటలపాటు సస్పెండ్ చేసింది. నరేంద్రమోడితో కరచాలనం చేస్తున్న ఫోజుతో ఉన్న ఫొటోని ఖాతాదారు ప్రొఫైల్ పిక్చర్‌గా ఉంచుతున్నాడు. "గాడిదకొడకా లం॥ కొడకా. నిన్ను తిట్టాననుకున్నావా? నీది బలవంతపు పుటకరా (బలాత్కారం మూలంగా నువ్‌పుట్టావ్)"




**ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో అట్టడుగుకు దిగజారిన వారిని ఫాలో అవుతున్న ప్రధాని**

మహావీర్ @ మహావీర్‌యం అని మరో కరుడుగట్టిన అశ్లీలరాతగాడు 'ఆమ్‌ఆద్మీ పార్టీ' సానుభూతిపరుడు నవేందుసింగ్ మీద 2016 ఆగస్టు 16న మహాశయుడు ఏమని ట్విట్ చేసాడో చూడండి.

'హాహ్వా.... @ నవేందుసింగ్ మీ అమ్మ పెద్దబోకని నాకు తెలుసు. ఐనా ఉపయోగం లేదు. ఏదన్నా లోషన్‌వాడు'

జెకావేరి, రాజ్యశ్రీ అనే మహిళలను ఉద్దేశించి "స్మృతి(ఇరానీ) అంటే మీకంత సలపరం దేనికో దేవుడుమీకు పంది మొహం, నీటి ఏనుగంత శరీరం ఇచ్చాడుగా"ఇలాంటి అసభ్య, అశ్లీల రాతల మూలంగా ట్విట్టర్ ఇతని ఖాతాను సస్పెండ్ చేస్తే ఈ సస్పెన్షన్ ఎత్తివెయ్యాలని కేంద్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ నాయకత్వాన మితవాద పోకిరీలంతా ఒక్కపెట్టున ట్విట్టర్ మీద దండెత్తారు.

ట్విట్టర్ నిస్సహాయంగా ఈ సస్పెన్షన్ ఎత్తివేసింది. కాని ఇప్పటికీ మహావీర్ తన మత విద్వేషరాతలు గాని, అశ్లీలరాతలు గాని ఆపలేదు. తాజాగా అతనేం 'ట్వీట్' చేసాడో చూడండి. 'అఖ్లాఖ్ అనే సాధారణ పౌరుడిని కొంత మంది మూక చంపేస్తే 45 లక్షలు, 4 ఫ్లాట్లూ ఉద్యోగమునా! అదే సంతోష్ అనే పోలీసు మూక చేతిలో హత్య గావించబడితే 20 లక్షలా! పరిహారం మతం మీద ఆధారపడి ఉంటుంది. 2015లో దాద్రిలో నివసిస్తున్న మహమ్మద్ అఖ్లాఖ్ కుటుంబం గోమాంసం వండుకు తింటుందనే పుకారు లేవదీసి హిందూత్వ మూకలు ఆ ఇంటిమీద దాడిచేసి అఖ్లాఖ్‌ని అన్యాయంగా చంపేసారు. ఆ తరువాత వాళ్ళ ఇంట్లో వండుకున్నది గోమాంసం కాదు వేట మాంసం అని తేలింది. అయినా అఖ్లాఖ్ హత్య తదనంతర కాలం నుండి మహావీర్ ఏదో ఒక రూపంలో ఈ సిగ్గుమాలిన చర్య నుండి దృష్టి మళ్ళించేం

**“ఇందుకు రుజువుగా టినూజైన్ నరేంద్రమోడితో కలిసి తీయించుకున్న చిత్రాలను తన ట్విట్టర్ ఖాతా ముఖపత్ర చిత్రాలుగా కూడా ప్రదర్శించాడు. 2016 సెప్టెంబరు 7న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ పోలీసులు ఇతన్ని ఒక సెక్స్‌రాకెట్‌లో నిందితుడిగా అరెస్టు చేసారు. ఒక ‘స్పా’లో ఇతను అభ్యంతరకర స్థితిలో పట్టుబడ్డాడని పోలీసులు ప్రకటించారు.”**




**మహిళా జర్నలిస్టులను, మోడీ వ్యతిరేకులను వేధిస్తున్న వారితో మోడీ సమావేశం**

దుకు రకరకాల ఫీట్లు చేస్తూ అందులో భాగంగానే పైన ఉదహరించిన ట్వీట్ చేసాడు.

ప్రముఖ రచయిత్రి శోభాడే బిజెపి నాయకుడు కేంద్ర మంత్రి అయిన గోపీనాథ్ ముండే హఠాన్మరణం గురించి 2014 జూన్ 3న సంతాప సూచకంగా ‘దిగ్భ్రాంతికరమైన వార్త– ముండే మరణవార్త ఎంతటి విషాదం. ఆత్మకు శాంతికలుగుగాక. కుటుంబానికి చెడ్డరోజులు వచ్చాయి. నా ప్రగాఢ సంతాపం’. అని శోభాడే ట్వీట్ చేయగా బిజెపికి చెందిన రాహుల్‌రాజ్, @ భక్‌సాలా ఇలా స్పందించాడు.“హాయ్@ డే శోభా నీ బాధ నాకు అర్థమైంది. చాలా రోజు లుగా పడకసుఖానికి దూరంగా ఉన్నట్లున్నావ్ మరీ అంతగా వెంపర్లాడకు” అని చెత్త రాతలు రాశాడు.

**లైంగిక వేధింపులు – విద్వేష ప్రచారాలు**

జర్నలిస్టుల మీద బూతులు లంకించుకోవడం, లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు మత విద్వేష ప్రచారాలకు పాల్పడడంలో దిట్టలు వీళ్ళు. ముస్లింలు దాడులకు తెగబడిన దృశ్యాలను, గోవధ చిత్రాలను ఏ పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో జరిగినవో సంగ్రహించి వాటిలో ‘ఆడియో’ను చేరిపేసి ఇక్కడే మనదేశంలోనే జరుగుతున్నట్లు ప్రచారం చేస్తుంటారు. ఒక్కసారి ఈ తప్పుడు ప్రచారం నిజమని నమ్మించడానికి అత్యున్నతస్థాయి బిజెపి నాయకులు గోదాలోకి దిగుతుంటారు. తమగొంతూ కలుపుతారు విద్యా పారంగతురాలు, సామాజిక కార్యకర్త అయిన మధుకీష్వర్ కూడా ఈ కోవకే చెందుతారు. ఈవిడ ట్విట్టర్ ఖాతాని ప్రధాని మోడి సహా మొత్తం 5,76,000 మంది అనుసరిస్తూ ఉన్నారు. ఇట్లానే ఈవిడ ఒకసారి పాకిస్తానీ వీడియోని ఇక్కడి వీడియోగా చలామణి చెయ్యడాన్ని ఆధారాలతో సహా వివిధ జర్నలిస్టులు, సామాజిక మాధ్యమ వినియోగదారులు ప్రశ్నిస్తే, ఆవిడ చాలా తేలిగ్గా నాకు వాట్సప్‌లోవస్తే పెట్టాను అని జవాబు ఇచ్చిందే కాని, తప్పు గ్రహించి ఆ వీడియో తొలగించేదానికి ప్రయత్నించలేదు. ఇలాంటి పోస్టుల అసలు లక్ష్యం ఎక్కడో ఒకచోట అలజడి సృష్టించడం, ఘర్షణలు రేపడం. ఆ ఉద్దేశ్యంతోనే ఇలాంటి పోస్టులను హాష్‌ట్యాగ్ చేసి లెక్కలేనన్ని అనామక ఖాతాలు దీన్ని ప్రచారంలోపెట్టి మరీ దీనినే ట్రెండ్‌గా మార్చేస్తారు. ఉదాహరణకు # మాల్డా సంగతి ఏంటి అనే ట్వీట్‌ను చూడండి. బెంగాల్‌లో 2016లో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా మాల్డా జిల్లాలో ముస్లిమ్‌లు ఒక పోలీస్ స్టేషన్‌మీద దాడి చేసారనే వార్తను అదే పనిగా ట్వీట్ చేస్తూ ఒక ‘ట్రెండ్’గా మార్చేసి మీడియా దృష్టిని అటువైపు తిప్పారు. ఓటింగ్‌లో మతపరమైన విభజన లబ్దిపొందాలనుకోవడం ఈ ట్వీట్ వెనుక ఉన్న అసలు ఉద్దేశం. సత్యసాధక్ సత్యాన్వేషి @ రీతూరాధౌర్ పేరిట బిజెపి కార్యకర్త ఒక ట్విట్టర్ హాండిల్ నడుపుతూ ఉంది. ఈ ఖాతాను 5,94,000 మంది అనుసరిస్తూ ఉన్నారు. మహమ్మద్ అఖ్లాక్ హత్యానంతరం ఈమె తన ట్విట్టర్ ఖాతాలో ఉత్తరప్రదేశ్ పోలీసు ఒకరిని ఆవుల అక్రమ రవాణాదారులు వాహనంతో తొక్కించి చంపేసారంటూ ఒక ఫొటోపోస్ట్ చేసింది. ఈ పోస్టింగ్ ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టాలనే వ్యూహాన్ని పసిగట్టిన అనేకమంది విలేకరులు ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్‌ను అప్రమత్తం చేసారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసులు ఆమెపై కేసునమోదు చేసారు. ఈ రాధౌర్ నిత్యం ఆవులను వధిస్తున్న ముస్లిమ్‌లను పోలిన వారి వీడియోలను, ఫొటోలను లవ్‌జిహాద్ పేరిట హిందూ అమ్మాయిలను ఎగరేసుకుపోతున్న ముస్లిం కుర్రాళ్ళు అంటూ ఏవేవో రాతలు, చిత్రాలు పోస్టు చేస్తుంటుంది.

టినూజైన్ అనే పెద్దమనిషి ‘నరేంద్రమోడీ ఆర్మీబ్రిగేడ్’ వ్యవస్థాపకుడిగా చలామణి అవుతున్నారు. నరేంద్రమోడి ఇతగాడి ట్విట్టర్ ఖాతానుకూడా అనుసరిస్తున్నాడు. ఇందుకు రుజువుగా టినూజైన్ నరేంద్రమోడితో కలిసి తీయించుకున్న చిత్రాలను తన ట్విట్టర్ ఖాతా ముఖపత్ర చిత్రాలుగా కూడా ప్రదర్శించాడు. 2016 సెప్టెంబరు 7న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ పోలీసులు ఇతన్ని ఒక సెక్స్‌రాకెట్‌లో నిందితుడిగా అరెస్టు చేసారు. ఒక ‘స్పా’లో ఇతను అభ్యంతరకర స్థితిలో పట్టుబడ్డాడని పోలీసులు ప్రకటించారు. సదరు ‘భక్తుడు’ “ఇందులో దాచాల్సింది ఏమీ లేదు నేను ఎలాంటి వాడినో అలానే మీ ముందు ఇలా నిలబడ్డాను” అని ట్వీట్ చేసాడు.

ఇహ ప్రీతిగాంధీ అనబడే ఆమె మిసెస్ గాంధీ పేరిట ట్వీట్‌లు చేస్తుంటుంది. మోడీతో కలిసి దిగిన మూడు ఫొటోలను ఈమె ఖాతాలో మనం చూడోచ్చు. నేను ‘నాథూరాంగాడ్సే’ (గాంధీహంతకుడు)కి పెద్ద అభిమానిని అని గతంలోనే ట్వీట్ చేసింది. ట్విట్టర్‌లో అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక వేధింపుల బారిన పడ్డామని ఎవరన్నా మహిళలు బాధను వ్యక్తం చేస్తే అట్లాంటి వాళ్ళను ఎగతాళి చేస్తుంటుంది ఈవిడగారు. ‘వంటగదిలో ఉన్నాక వేడిని తట్టుకోవాలి లేదంటే వంటగదిని వదిలివెళ్ళాలి’ అంటూ ట్విట్టర్ ఖాతా ఉంటే ఇలాంటివన్నీ

పడడానికి సిద్ధపడాలి అని సుద్దులు చెబుతుంటుంది. 2014 సాధారణ ఎన్నికల సందర్భంగా వికీలిక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజె మోడీకి మద్దతు పలికాడు అంటూ ప్రీతిగాంధీ ట్వీట్ చేసింది. కాని అసాంజె దీన్ని ఖండించడంతో బిజెపి ఇరుకునపడింది.

కేంద్ర మహిళా శిశు సంరక్షణా శాఖా మంత్రి మేనకాగాంధీ అంతర్జాలంలో మహిళలకు వేధింపుల బాధ నుండి ఉప శమనం కలిగించేందుకు # ఐయామ్ ట్రోల్డ్‌హెల్ప్ పేరిట ఒక హెల్ప్‌లైన్ ప్రారంభించేసరికి మితవాదులు ఆమె మీద దండెత్తారు. నరేంద్రమోడీ అనుసరిస్తున్న ఖాతాదారులు కూడా ఆమెను దుమ్మెత్తిపోసారు. మేనకాగాంధీ వాక్‌స్వాతంత్ర్యాన్ని అణిచివెయ్యాలని చూస్తున్నారు అని ఘాటుగా విమర్శించారు. @ రిషిబాగ్రి అనే అతను బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాకి ఇలా ట్వీట్ చేసాడు. – "మేం మా ఆరోగ్యాలుపాడు చేసుకుని, కుటుంబాలకు కూడా సమయం కేటాయించకుండా రోజుకి 6 నుండి 8 గంటలు బిజెపి కోసం సోషల్ మీడియాలో పనిచేస్తుంది మేనకా గాంధీ నుండి ఇలాంటి దాడులు ఎదుర్కోవడం కోసమా!" ఊరూపేరూలేని (అనామధేయుడు) మరో ట్విట్టర్ ఖాతా ఏకంగా ప్రధాని మోడీ ఖాతాకు ట్యాగ్ చేస్తూ "ఇది మీ ఆన్‌లైన్ మద్దతుదారుల పునాది మీద జరుగుతున్న దాడి" అని పేర్కొన్నాడు.

బిజెపి ప్రభుత్వం జి.యస్.టి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్న సందర్భంగా జరిగిన టివీ చర్చలలో కాంగ్రెస్ పార్టీ తరఫున పాల్గొన్న ప్రతినిధి ప్రియాంక చతుర్వేదిని 'నిర్భయ' తరహా రేప్‌కు గురిచేస్తాం అంటూ సోషల్ మీడియాలో బెదిరించారని పేర్కొన్నారు. ఈ అంతర్జాల పోకిరీలు అధికారికంగానే భారతీయ జనతాపార్టీ కోసం పని చేస్తున్నారా లేక కేవలం వీళ్ళొక అనాగరికుల గుంపా అన్న అనుమానం కలగక మానదని ఆవేదన వ్యక్తం చేశారు.

**జమ్మూ, కాశ్మీరీలనూ రెచ్చగొట్టే ధోరణి**

జమ్మూ కాశ్మీర్ అంశం చాలా సున్నితమైనది. భారతదేశంలో ఉన్న ఆ ప్రాంతం కోసం పాకిస్తాన్‌తో అనేక యుద్ధాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూ, కాశ్మీర్ ప్రజల మద్దతును కూడగట్టుకొని వారు భారతదేశంలోనే ఉండాలన్న భావన కలిగించాల్సిన బాధ్యత ప్రతి భారతీయునిపైనా ఉంది. అటువంటి నేపథ్యంలో ఈ అల్లరి మూకలు జమ్మూ, కాశ్మీర్‌లో రెచ్చగొట్టే ధోరణి అవలంభిస్తున్నారు.

**"ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్‌లో అంతర్జాల పోకిరీలను ఎలా అనుసరిస్తున్నారో ఆయన మంత్రివర్గ సహచరులూ అదే బాటపట్టారు. ఒక వి.కె.సింగ్ ఒక దయాశంకర్‌సింగ్ ఇలా చాలామంది. గిరిరాజ్‌సింగ్ అనే మంత్రి జర్నలిస్టుల మీద 'పాకిస్తాన్‌కు పొండి' అని విరుచుకుపడుతుంటాడు. బిజెపితో విభేదించేవారిని 'బర్నాల్ రాసుకోండి' (అంత మంటగా ఉంటే) అని అవహేళన చేస్తుంటాడు."**




మహిళా జర్నలిస్టులను, మోడీ వ్యతిరేకులను వేధిస్తున్న వారితో మోడీ సమావేశం

జమ్మూ కాశ్మీర్‌లో బుర్హాన్ వనిని ఎన్‌కౌంటర్ చేసి చంపడాన్ని నిరసించడంతో పాటు సుమారు 20 వేల మంది బుర్హాన్ అంతిమ యాత్రల్లో పాల్గొన్నారు. గీతికా అనే ఖాతా నుంచి ఆ అంతిమ యాత్ర చిత్రాలు పెట్టి "నేనైతే ఒక బాంబువేసి ఈ 20 వేల పందులకి శాశ్వతంగా స్వేచ్ఛను సాదించేద్దును" అని ట్వీట్ చేశారు. ఈ ఖాతాకు ప్రధానితో సహా 80 వేల మంది అనుచరులున్నారు. ఈ ట్వీట్‌ను 10986 మంది లైక్ చేయడంతో పాటు 1184 మంది రీ ట్వీట్ చేశారు. అయినా మోడీ దీనిని ఖండించలేదంటే మోడీ నిజస్వరూపం అర్థమవుతుంది.

**ఆవు చేలోమేస్తుంటే దూడగట్టునమేస్తుందా**

ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్‌లో అంతర్జాల పోకిరీలను ఎలా అనుసరిస్తున్నారో ఆయన మంత్రివర్గ సహచరులూ అదే బాటపట్టారు. ఒక వి.కె.సింగ్ ఒక దయాశంకర్‌సింగ్ ఇలా చాలామంది. గిరిరాజ్‌సింగ్ అనే మంత్రి జర్నలిస్టుల మీద 'పాకిస్తాన్‌కు పొండి' అని విరుచుకు పడుతుంటాడు. బిజెపితో విభేదించేవారిని 'బర్నాల్ రాసుకోండి' (అంత మంటగా ఉంటే) అని అవహేళన చేస్తుంటాడు. ఎబిపి న్యూస్ ఛానల్‌కు చెందిన అభిసార్‌శర్మ మీద నిత్యం ఏదోరకంగా విరుచుకుపడుతుంటాడు. అవార్డులను తిరిగి ఇచ్చేసిన రచయితల మీద మరి కొందరు జర్నలిస్టులమీద 'పాకిస్తాన్‌కు పొండి' అంటూ హూంకరించాడు.

బిజెపికి చెందిన అనిల్‌విజ్ రాష్ట్రక్రీడా శాఖామంత్రి హోదాలో 2016 'రియో ఒలంపిక్స్'కు అతిపెద్ద క్రీడా బృందానికి నాయకత్వం వహించి రియో వెళ్ళాడు. క్రీడాకారులకు ఎదురయిన ప్రయాణపు ఇబ్బందులను కొన్ని పత్రికలు వార్తలుగా ఇచ్చాయి. దాంతో సెప్టెంబరు 2న సదరు మంత్రిగారు నిర్ధారిత ట్విట్టర్ ఖాతాద్వారా 'కొన్ని వీధికుక్కలు పదేపదే మేం రియోకి టిక్కెట్లు కొనలేదని రాస్తున్నాయి అది సరికాదు.' అంటూ జర్నలిస్టులను ఉద్దేశించి పోస్టు చేసారు. సదరు పోస్టు సందేశాన్ని ప్రకటన రూపంలో చలామణి చేసేందుకు సొమ్ము చెల్లించి మరీ అంతర్జాల పోకిరీలను జర్నలిస్టుల మీదకు ఉసిగొల్పారు.

**ఉన్మాదంతో రగిలిపోతున్న పోకిరీలు**

ఈ ఉన్మాదుల ఆలోచన సరళి ఎలా ఉంటుందో ముగ్గురు అంతర్జాల పోకిరీలతో రచయిత జరిపిన సంభాషణ పరిశీలిస్తే వారు ఎంత ఉన్మాదంగా ఉన్నారో అర్థమవుతుంది.

**“మామూలు జనానికి మేం పథకం ప్రకారం దాడి చేస్తున్నాం అని తెలీదు. దాంతో దిగ్భ్రాంతికి లోనవుతారు. మీ లాంటి జర్నలిస్టులకి ఒక అంచనా ఉంటుంది కాబట్టి వెంటనే ‘బ్లాక్’ చేసేస్తారు. అది కూడా మాకు పైచెయ్యి కింద లెక్కే. మీరు ఏకంగా ఖాతా రద్దు చేసుకుని పత్తాలేకుండా పోయారనుకోండి. అప్పుడు కరెక్ట్‌గా దెబ్బపడినట్లు. అని సమాధానమిచ్చాడు.”**

వీరు ముస్లిములపై ఏహ్య భావం కలిగి ఉన్నారు. ముస్లిములు రిజర్వేషన్ల పేరుతో తమ ఉద్యోగాలను తన్నుకుపోతున్నారని తత్ఫలితంగా తాము నిరుద్యోగులయిపోతున్నామని చెప్పాడు. వారు మాంసం తింటారు కాబట్టి హింసా ప్రవృత్తి అబ్బిందని, మత కలహాలన్నింటా ముస్లిములే నిందితులుగా ఉన్నారని ఒకడు ఆవేదన వెళ్లగక్కాడు. మోడీ ఏడాదికి కోటి ఉద్యోగాలిస్తామన్న వాగ్దానంపై కోటి ఆశలతో ఉన్నట్లు కనిపించింది.

ఏ రోజుకి ఆ రోజున సోషల్ మీడియాలో ‘హాష్‌ట్యాగ్’ల ద్వారా ఏ అంశాన్ని ‘ట్రెండ్’గా మలచాలి అనుకుంటున్నారో నిర్ణయిస్తారట. మోడీకి వ్యతిరేకంగా నోరు విప్పిన ప్రముఖులలో ఎవరో ఒకరిని గాని, కిరాయి రాతలురాసే కుహనా ‘పత్రికా సాను (ప్రెస్టిట్యూట్స్)లని బూతు పంచాంగంతో దాడి మొదలుపెడతారట అన్న ప్రశ్నకు ‘మిమ్మల్ని గురించి రాయాల్సి వస్తే ఈమాటలు వాడనులెండి’ అని గొణిగాడు.

“మీరు మహిళా జర్నలిస్టులను ‘రేప్ చేస్తాం’ అని బెదిరించడం, వాత్సాయన కామసూత్రాలని రంగరించి శృంగారిస్తాం అని రాయడం, ఆఖ రికి ఆడవారి రహస్య కేశాల చిత్రాలు పెట్టి ఎలా శుభ్రం చేసుకోవాలంటూ బూతులు విప్పడం-ఇలా ఎలా చెయ్యబుద్ధవుతుంది? మీకు నిజానికి అలాంటి అభ్యంతరకర చిత్రాల గురిం చి కంప్లైంట్ చేస్తే ట్విట్టర్ వెంటనే ఆ ఖాతాలను సస్పెండ్ చేస్తుందని కూడా తెలియదా అన్న ప్రశ్నకు ‘మేడం, మాకు ఇది ఆకుకి సున్నం రాసినంత వీజీ. మామూలు జనానికి మేం పథకం ప్రకారం దాడి చేస్తున్నాం అని తెలీదు. దాంతో దిగ్భ్రాంతికి లోనవుతారు. మీ లాంటి జర్నలిస్టులకి ఒక అంచనా ఉంటుంది కాబట్టి వెంటనే ‘బ్లాక్’ చేసేస్తారు. అది కూడా మాకు పైచెయ్యి కింద లెక్కే. మీరు ఏకంగా ఖాతా రద్దు చేసుకుని పత్తాలేకుండా పోయారనుకోండి. అప్పుడు కరెక్ట్‌గా దెబ్బపడినట్లు. అని సమాధాన మిచ్చాడు. తాను మోడీ భక్తున్నని, కేవలం కమిట్‌మెంట్‌తో మాత్రమే పని చేస్తున్నామని చెప్పుకొచ్చాడు.

మరో పోకిరిని కదిలించగా ‘‘ఈ తురకోళ్లు ఉన్నారే మా సెక్స్ పిచ్చోళ్లు. వాళ్ల ఆడవాళ్ల దగ్గర సరిపడా సుఖం దొరక్క మన ఆడవాళ్ల వెంట పడుతున్నారు. వాళ్లకి అంత సెక్స్ పిచ్చి ఎందుకో తెల్సా వాళ్లు ‘బీఫ్’ తింటారు. అందుకే’’ అన్నాడు. అక్కడితో ఆగకుండా ‘మీలాంటి వాళ్లు అసలు సిసలైన భారతీయులే కాదు’. అందుకే ఇక్కడ హిందువులు ఏమైపోతున్నా పట్టించు కోవడం లేదు. మీకసలు లెక్క లేకుండా ఉంది. మీకు ఆ కిరస్తానీ దేశాల నుండి డబ్బు దోపుతున్నారు. అందుకే మీరంతా వాళ్లకి బాకా లుగా మారిపోయారు. మోడీజీ ప్రధానమంత్రి అయినాకే మనకి నిజంగా స్వాతంత్ర్యం వచ్చిం ది. ఇంతకు ముందు స్వాతంత్ర్యం అంతా ఓ బూటకం. మనదేశం అంటే ఇంతకు ముందు ప్రపంచంలో ఎవరూ లెక్కచేసేవాళ్లు కాదు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిదేశమూ ఆఖరికి చైనా సహా అందరూ మన దేశాన్ని గేలిచేసే వాళ్లు. కాని ఇవాళ ఆ రోజులు పోయాయి. విరాట్ పురుషుడు మోడీజీ ఏలు తున్న మన భారత దేశానికి ప్రపంచమంతా నీరాజనాలు పడుతుంది. అంటూ ఏకరవు పెట్టాడు.

**తీవ్ర స్థాయిలో వేధింపులు :**

వారి వేధింపులు ఎంత తీవ్రస్థాయిలో ఉంటాయో స్వయంగా అనుభవించిన స్వాతి చతుర్వేది తన పుస్తకం ముందుమాటలో రాసు కొచ్చారు. ఇవి గమనిస్తే వారు ఎంత కఠి నాత్ములో అర్థమవుతుంది.

2016 జూలై నెలలో బుర్హాన్ వని మరణానంతరం కాశ్మీర్‌లో ‘పెల్లెట్‌గన్’ల వాడ కం మూలంగా శాశ్వత అంధులుగా మారుతున్న అమాయక పౌరుల గురించిన కథనాలు రాసి నందుకుగాను @లుటెన్‌సిన్‌సైడర్ పేరుపెట్టుకున్న ఖాతాదారుతో పాటు అనేక మంది నాపై దాడికి దిగారు. ‘నిర్భయ’ని బలాత్కారం చేసినట్లు నిన్నూ ‘రేప్’ చేస్తామని, ఎకే-47 బుల్లెట్ తినిపిస్తామని బెదిరించారు. అక్కడితో ఆగకుండా ఒక రాజ కీయవేత్తతో అక్రమ శారీరక సంబంధం అంట కట్టాడు. తెల్లారి లేచి చూస్తే చాలు నా ట్విట్టర్ ఖాతాలో, వందలాది అసభ్యకరమైన అభ్యంతర కరమైన నోటిఫికేషన్లు దర్శనమిస్తుండేవి. ‘రాత్రికి నా రేటు గురించి’ ‘రాత్రిపూట రతిరహస్యాల’ గురించి అత్యంత అసభ్యకరమైన రీతిలో నన్నొక కామపిశాచిలా చిత్రీకరిస్తూ సందేశాలు పెడుతున్నారు. ఇరవైఒక్కయేండ్లు నా వృత్తి గౌరవాన్ని చిదిమేసి సామాజిక మాధ్యమంలో నన్నొక బజారు ఆడదానిగా చిత్రీకరించడానికి ప్రయత్ని స్తున్నారు” అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలను పరిశీలిస్తే నిత్యం శీలం గురిం చి, దేశభక్తిని గురించి, భారత్‌మాతాకి జై అంటూ ఆర్‌ఎస్‌ఎస్ చెప్పే మాటలలోని బూట కత్వం బట్టబయలు అవుతుంది. నైతికంగా ఏ విలువలు పాటించని సంస్థలు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలని స్పష్టం అవుతుంది. ❊

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, ‘మార్క్సిస్టు’** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# క్యూబాలో సహకార సంఘాలు

క్లిఫ్ డురాండ్

సోవియెట్ పతనం తరువాత సోషలిస్టు దేశాలు పాత సిద్ధాంతాలను, ఆలోచనలను పునర్నిర్మించుకోవడమే కాక చారిత్రికంగా అభివఅద్ధి చెందిన సోషలిజం మూలాల గురించి కూడా వునరాలోచిస్తున్నాయి. ముఖ్యంగా రాజ్య కేంద్రంగా అభివఅద్ధి చెందిన ప్రస్తుత నమూనాను పలువురు ప్రశ్నిస్తున్నారు. నిజమయిన సోషలిజానికి ఒక ప్రణాళికా బద్ధమయిన ఆర్థిక వ్యవస్థ, రాజ్యం అధీనంలో ఉండి క్రమానుగతంగా నియంత్రించ బడుతున్న వ్యవస్థ అవసరమా అని ప్రశ్నించబడుతున్నది. లేదా ఉత్పత్తి దారుల కూటమి 'అధికారంలో ఉన్న కేంద్రంగా ఉంటే సరిపోతుందా? సోష లిజం తక్షణ కర్తవ్యం ఉత్పత్తి శక్తుల అభివఅద్ధా లేక మానవుల అభివఅద్ధా? సోషలిజంలో మార్కెట్లకు స్థానం ఉందా? సోషలిస్టు సంపద అంటే రాజ్యం ఆధీనంలోనే సంపదంతా ఉ ండడమేనా? శ్రామికుడి అధీనంలో ఉన్న లేదా శ్రామికుని చేత నడపబడుతున్న సహకార సంఘాల మాటేమిటి?'

21వ శతాబ్దంలో సోషలిజం నిర్మాణం గురించిన అధ్యయనాలు ఎక్కువగా హ్యూగో చావెజ్‌తో ముడిపడి ఉన్నాయి, కానీ ఈ రోజు క్యూబాలోను, మెక్సికో లోని జపాటిస్టా ప్రాంతం లోను ఇతర అనేక ప్రాంతాలలో కూడా ఈ ప్రశ్నలే ఉదయిస్తున్నాయి. ఆయా దేశాలలోని పరిస్థితులలో మార్పులు వైవిధ్యంగా ఉన్నప్పటికీ ఈ సమకాలీన సోషలిస్టు సమాజాలు కొన్ని విలువలను పంచుకుంటున్నాయి. పౌర సమాజం శక్తివంతంగా ఉండడం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, వికేంద్రీకరణ, సహకారం, మానవ వనరుల అభివఅద్ధి మొదలైనవి.

ఈ ఉమ్మడి అంశాల గురించి నేను ప్రస్తావించే ప్రయత్నం చేయాలనుకుంటున్నాను. డేవిడ్ హార్వే సూచించినట్టు పెట్టుబడిదారి విధానం ఉమ్మడి ఆస్తులను ప్రజల దగ్గరి నుండి వేరుచేసి అభివఅద్ధి చెందిందని, అది ఈ నాటికీ కొనసాగుతూనే ఉన్నదని చరిత్రకారులు చాల కాలం క్రిందటే ధఅవీకరించారు. అందువలన నేను(1) ఈ ప్రక్రియను పూర్తిగా వెనక్కు మళ్లిస్తే, అంటే సామాన్య ప్రజలకు సంపదను పంచిపెడితే, ఉన్న వనరులన్నీ మానవాభివఅధికి తోడ్పడతాయని, అది ప్రజాస్వామ్యయుతంగా పరిపాలించ బడుతున్న స్థానిక సమాజం ద్వారా పంచుకోవడం జరిగితే మానవాభివఅధికి మరింత దోహదం అవుతుందని భావిస్తున్నాను. (2) ఇందులో అడవులు పెట్టుబడిదారీ విధానానికి ముందున్న భూములు, విద్యా వ్యవస్థలు, ఆరోగ్య భద్రతా వ్యవస్థలు, పార్కులు, వీధులు, నదీజలాల రవాణా వ్యవస్థ కూడా ఉ న్నాయి. అంతే కాదు. సంస్కఅతిని, జ్ఞానాన్ని, సమాజం యొక్క ఉత్పత్తి వనరులను కూడా పంచుకోవాలి. (3) పెట్టుబడి దారీ విధానం ఈ వనరులను అన్నిటినీ ప్రైవేటు పరం చేయ దానికి, అన్నిటిని సరుకులుగా మార్చడానికి ప్రయత్నిస్తుంది. ఇంధనాన్ని ఉపయోగించు కోవడం దగ్గరి నుండి విద్య, ప్రభుత్వ భూమి, నూతన సాంకేతిక ఆవిష్కరణల వరకు అన్నిటిని వ్యక్తులు పొందడం ఈ నయాఉదారవాద యుగ సయ్యాటలో సమంజసంగా, న్యాయంగా పరిగణించబడుతుంది. (4) విస్తఅతంగా చుస్తే ఈ వనరులన్నింటిని సమాజపరం చేయడం, సాధారణ ప్రజలకు అందుబాటులోకి తేవడం సోషలిస్టు నిర్మాణ ప్రధాన ఉద్దేశ్యం. సమాజం అంటేనే మనం ఒకరితో ఒకరు సంబంధాలు కలిగి ఉండడం, సంస్థలను సామాజికరించడం అంటే సామాన్యుని మంచి కోసం సంస్థలరూపు, దిశను మార్చడం. (5) సంస్థలను సామాజీకరిం చడం అంటే సమాజంలోని ప్రతి ఒక్కరు ఆ సంపదపై భాగస్వామ్యం కలిగి ఉండడం, ఆ ప్రయోజనాలు అందరికి అందుబాటులో ఉ ండేలా చేయటమే.

అయితే కేవలం సంపద సమాజం సొత్తు అవగానే సరిపోదు. సామాన్యులు ప్రజాస్వామ్య యుతంగా పరిపాలించ బడతారన్న నమ్మకము మాట ఏమిటి? ప్రజాస్వామ్యం ఉమ్మడి సహకార సంస్థ పైన, ఆ సంస్థ ఉమ్మడి గుర్తింపు పైన ఆధారపడి ఉంటుంది. (6) అంటే సామాన్యులు తమను తాము ఉమ్మడి సామాజిక వనరులను వాడుకునే వారుగా భావించాలి. ఆ వనరుల సద్వినియోగానికి బాధ్యత వహించాలి. అలా చేయటానికి వీలుకల్పించే సంస్థే సహకార సంఘం అని నా భావన.

ఈరోజు క్యూబన్ విప్లవం పాత తరహా కేంద్రీకరించిన సోషలిస్టు రాజ్యం నుంచి దూరం గా జరుగుతున్నది. వారి నాయకులు సంస్థలను కొత్త పద్ధతులలో సామాజికరించేందుకు పూను కుంటున్నారు. 1960ల లోనే క్యూబన్ ప్రభుత్వం సమాజ వనరులన్నింటిని పెట్టుబడి దారుల దగ్గరి నుంచి స్వాధీనం చేసుకున్నా అది వాటిని సమాజపరం చేయలేదు. అందుకు బదులుగా రాజ్యం సమాజం యొక్క ఏజెంట్ రూపం దాల్చింది. ఫలితంగా ప్రజల చైతన్యపూరిత పాత్రను పక్కన పెట్టినట్టయింది. (7) ఒక పితఅస్వామ్య ప్రభుత్వం ప్రజలకు విద్యను, ఆరోగ్యాన్ని ఇచ్చింది. ప్రజలు అందుకు ప్రతిఫలంగా దానికి విశ్వాసంగా ఉన్నారు. కానీ వారు దానిలో భాగస్వాములుగా మారలేదు. వారి భవితవ్యాన్ని నిర్ణయించే ప్రజాస్వామ్యంలో చురుకయిన పాత్రను పోషించడం లేదు. ఫలితంగా ఇరవైయవ శతాబ్దం అంతం నాటికి అదొక పౌర సమాజంగానే మిగిలింది.

కొత్త క్యూబన్ రాజ్యం అధికారాన్ని, అంటే పాలనను కింది వరకు – ప్రాంతీయ స్థాయికి, సహకార సంస్థల స్థాయికి తీసుకుని వెళతున్నది. ఇంకా అత్యధిక ఆస్తులు రాజ్యం అధీనంలోనే ఉన్నప్పటికీ యాజమాన్యం ఉపయోగించు కుంటున్న వారికి బదిలీ చేయడం జరిగింది.

" అయితే ప్రభుత్వం వాటిని గుత్తకి ఇస్తున్నది. స్వతంత్ర సామాజిక సంస్థలుగా లాభనష్టాలకు జవాబుదారీగా నడపబడుతున్నాయి. పన్నులు, ఖర్చులు, నిల్వలకు పక్కన పెట్టిన తరువాత మిగిలినది సభ్యులు పంచుకుంటున్నారు. ప్రాథమిక లెక్కల ప్రకారం ఈ సహకార పద్ధతిలో సరాసరి ఆదాయాలు అంతకు ముందు కంటే మూడు నుండి తొమ్మిది రెట్లు పెరిగాయి. "



క్యూబాలో సహకార రంగంలో నడుస్తున్న చిన్న పరిశ్రమలు

ఈ విధంగా యాజమాన్యాన్ని హక్కులను వేరుచేయడం వలన చిన్న పరిశ్రమలు కార్మికుల సమూహం హస్తగతం అవుతున్నాయి. 'రాయితీ' సూత్రాల కనుగుణంగా రోజువారీ నిర్ణయాలు క్రింది స్థాయిలోనే తీసుకోబడుతున్నాయి. ఇందుకు పై అధికారుల మద్దతు అవసరం లేదు. ఈ రకంగా సంస్కరణల ద్వారా క్యూబా ప్రజా స్వామ్యాన్ని కింది నుండి పునర్ నిర్మిస్తున్నది. రాజ్యాధికారం పౌరుల అధికారంగా మార్పు చెందుతున్నది.

(8) సోషలిస్టు సమాజ నిర్మాణం అంటే సామాన్యులకు చెందవలసిన పెట్టుబడి వనరులను తీసుకుని అవి చెందవలసిన సామాన్యులకు అందచేయడం. అయితే క్యూబాలో లాగా ఆ వనరులన్నీ మరింత ఎక్కువగా రాజ్యం నుండి సమీకరించి, రాజ్యం యొక్క క్రియాశీలక సహాయంతో అవి చెందవలసిన వారికీ అందచేయడం. దీనిని మనం కొన్ని విభాగాలలో – పలహారశాలలు, ఫ్యాక్టరీలు, రవాణా, నిర్మాణ కంపెనీలలో – స్పష్టంగా చూస్తాం. 1968 నుండి ప్రభుత్వంచే నడుపబడుతున్న వ్యాపారాలు ఇప్పుడు కార్మికుల యాజమాన్యంలో సహకార రంగంలో నడుస్తున్నాయి. అంటే ఇప్పుడవి దేశ మంత్రిత్వశాఖ అధీనంలో ప్రభుత్వ సంస్థలుగా లేవు. అయితే ప్రభుత్వం వాటిని గుత్తకి ఇస్తున్నది. స్వతంత్ర సామాజిక సంస్థలుగా లాభనష్టాలకు జవాబుదారీగా నడపబడుతున్నాయి. పన్నులు, ఖర్చులు, నిల్వలకు పక్కన పెట్టిన తరువాత మిగిలినది సభ్యులు పంచుకుంటున్నారు. ప్రాథమిక లెక్కల ప్రకారం ఈ సహకార పద్ధతిలో సరాసరి ఆదాయాలు అంతకు ముందు కంటే మూడు నుండి తొమ్మిది రెట్లు పెరిగాయి.

(9) అందువలన సహకారం అంటే ఒక రకంగా శ్రామికులందరికి చెందినదిగా చెప్పుకోవచ్చు.

(10) ఒక సమూహం చైతన్య వంతంగా తన ప్రయోజనాలను, లక్ష్యాలను నిర్దేశయించుకుని, వాటిని చేరుకునే విధంగా అందరు కలిసి పనిని పంచుకోవడమే. కలిసి నిర్ణయాలు తీసుకోవడం వలన సామాజిక బాధ్యత పెరుగుతుంది. అది ప్రతివానిని సమాజంలో భాగాన్ని చేస్తుంది. మార్క్స్ చెప్పినట్టు మనిషిని 'జాతిలో భాగంగా చేయడాన్ని' సమాజం యొక్క పనిగా సహకారం మారుస్తుంది. అది శ్రామికుడిని సామాజిక శ్రామికునిగా మారుస్తుంది. సహకార సంఘాలు సోషలిజం నేర్చుకునే పాఠశాలలు.

అయితే శ్రామికులు సమాజపరం కావడం అన్నది స్వయంచాలకంగా జరగదు. ఇది క్రమక్రమంగా జరుగుతుంది. ముఖ్యంగా ఇది వరకు ప్రభుత్వ రంగంలో ఉండి ఒక ఆధిపత్య యజమాన్య సంబంధాలకు అలవాటు పడినప్పుడు, ఎప్పటినుండో అలవాటు పడ్డ విధానాలను మార్చుకునేందుకు మళ్ళీ అభ్యసించడం అవసరమవుతుంది. ఉదాహరణకు హవానా కేంద్రంలో ఇది వరకు ప్రభుత్వ సంస్థగా ఉన్న కుట్టు పరిశ్రమకు నేను వెళ్ళినప్పుడు అక్కడి మేనేజర్ తనతో పనిచేసే కార్మికులను ఉద్దేశించి 'నా పనివారిని' అని సంభోదించారు. తనతో పనిచేసే మహిళ ఈ విషయాన్ని నెలవారీ జరిగే సర్వసభ్య సమావేశంలో గట్టిగా నిలేసినప్పటికీ ఇలాగే జరుగుతున్నది. పాత అలవాట్లు ఒక పట్టాన వదిలి పెట్టవు. మునుపటికి ఇప్పటికి వ్యత్యాసం ఏమిటంటే మునుపటిలాగా ఇప్పుడామె తన నిర్ణయాలపై పై అధికారి ముద్రను వేసుకోవలసిన అవసరం లేదు. ఆమెకు కొంత స్వయం నిర్ణయాధికారం ఉన్నది. ఇందువలననే ఆ దేశ 'తత్వశాస్త్ర సంస్థ' క్రమం తప్పకుండా కొత్తగా ఏర్పడ్డ సహకార సంఘాలకు ట్రైనింగ్ వర్కుషాప్స్ నిర్వహిస్తూ ఉంటుంది. సభ్యులకు, యజమానులకు స్వతంత్ర ప్రజాస్వామ్య యాజమాన్యం గురించిన బోధనలు చేస్తూ ఉంటుంది.

కొత్తగా ఏర్పడ్డ సహకార సంస్థలలో ఈ పని సులువుగా జరుగుతుంది. ఎందుకంటే కొత్తగా సామాజిక సంబంధాలను సృష్టించడం తేలిక. మొదటి నుండి కార్మికులు సమాన భాగస్వామ్య ప్రాతిపదికనే కలిసి పనిచేస్తారు. ఎల్బీకీ పలహారశాల ఇందుకో ఉదాహరణ. 2014 ఫిబ్రవరిలో ఒక చిన్న సమూహం విశ్వవిద్యాలయానికి సమీపంలో హవానా నడిబడ్డున ఒక భవనాన్ని కేంద్రం నుండి అద్దెకు తీసుకుని పలహారశాల నడపడానికి అనుమతి పొందింది. ఆ భవనాన్ని ఆధునీకరించే సమయంలో (దీనికి రాజ్యం మద్దత్తుతో అప్పు ఇవ్వబడింది) స్వయం నిర్ణయాధికారం గల సంస్థగా గుర్తించే మరి కొందరు ఇందులో సభ్యులుగా చేరారు. 2015 నవంబర్‌లో ఇది ప్రారంభించబడింది. ప్రస్తుతం ఇందులో 200 మంది సభ్యులున్నారు. వీరందరూ కలిసి మంచి సిబ్బంది గల ఫలహారం శాలను నడుపుతున్నారు. ఇందులో బార్, పేస్ట్రీ షాప్ ఉన్నాయి. ఇక్కడ సభ్యులు సగం రోజు పనిచేసి ప్రభుత్వ ఆధీనంలోని వాటికన్నా కొన్ని రెట్లు ఎక్కువ సంపాదించుకో గలుగుతున్నారు.

గత రెండు సంవత్సరాలలో సెంటర్ ఫర్ గ్లోబల్ జస్టిస్ డెలిగేట్‌గా నేను ఇటువంటి 9 సంస్థలను దర్శించాను. మేము కొన్ని బస్సుల సమూహాన్ని నడుపుతున్న ఒక రవాణా రంగ సహకార సంఘాన్ని చూసాం. ఫర్నిచర్ సహకార సంఘాన్ని దర్శించాము. ఒక నిర్మాణ సహకార సంఘం, అనేక పలహార శాలల సహకార సంఘాలను కూడా చూశాం. పట్టణాలలో

ఈ కొత్త సహకార సంఘాలు వందల సంఖ్యలో ఏర్పడ్డాయి. అవి ఆర్థికరంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటికితోడుగా ప్రైవేటురంగంలో వ్యక్తిగత సేవలు చేసే వ్యాపారాలు -బ్యూటీ పార్లర్లు, హాస్పిటాలిటీ రంగం-గదులు అద్దెకు ఇవ్వడం. రెస్టారెంట్స్ నడపడం వగైరా ఉన్నాయి. సహకారరంగం ప్రభుత్వ ఉద్యోగితకు ప్రైవేటు యజమాని అధిపత్యానికి మధ్యే మార్గంగా ఉంటుంది.

క్యూబన్ వ్యవసాయం ఎప్పటి నుండో సహకార రంగంలోనే ఉన్నది. కానీ 2012 డిసెంబర్‌లో జాతీయ అసెంబ్లీ పట్టణ సహకార సంఘాలకు ప్రయోగాత్మకంగా అనుమతి ఇచ్చింది. 2016లో సమగ్ర సహకార చట్టం వస్తుందని భావించినా అది జరగలేదు. ఇప్పుడు 2017 చివరికి వస్తుందని ఆశపడుతున్నారు. క్యూబన్ నాయకత్వంలో ఈ విషయంలో, మరి కొన్ని సంస్కరణల విషయాలలో బేధాభిప్రాయాలున్నాయి. కొందరు సహకార రంగం ప్రయోగాత్మకంగా విస్తతత పరచానికి సుముఖంగా లేరు. చాలామంది కార్మికులు మాత్రం సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోడానికి సిద్ధంగా ఉన్నారు. అధికారులు వీరి ఆతతను అందిపుచ్చుకోవలసి ఉంది.

ఈ మధ్య కాలంలో ప్రైవేటు వ్యాపారాలు పెరుగుతున్నాయి. దాదాపు 200 అనుబంధ రంగాల్లో క్యూబన్లు ఇప్పుడు స్వయం ఉపాధి పొందవచ్చు. ప్రైవేటు వ్యక్తులు కార్మికులను నియమించుకోవచ్చు. ఇవి నిజానికి పెట్టీబూర్జువా సంస్థలు. ఇవి చిన్నవిగా ఉండడం వలన, సంస్థలో పనులు యజమానులు స్వయంగా చేసుకుంటుండడం వలన ఇవి ఇంకా పెట్టుబడి దారీ సంస్థలు కాలేదు. క్యూబాలో విధి, విధానాలు ప్రైవేటు సంపద పోగుపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. వారు పెట్టుబడిదారీ వర్గానికి చెందినవారని చెప్పలేము గాని సోషలిస్టు తరగతికి చెందుతారని కూడా చెప్పలేము. ప్రైవేటు వ్యాపారాలు చేసేవారు సోషలిస్టు చైతన్యం కలిగి ఉండడం అరుదయిన విషయం. ఎక్కువశాతం పెట్టీ వ్యాపారి లక్షణాలే కలిగి ఉంటారు. రాహుల్ కాస్ట్రో తన ఎడవ పార్టీ కాంగ్రెస్ నివేదికలో చెప్పినట్టు "పెట్టీ బూర్జువా సైదాంతికంగా వ్యక్తివాదంతోను, స్వార్ధంతోనూ ఉంటూ లాభాలను పెంచుకునే ఆలోచనలతోనే ఉంటాడు. సాధారణంగా వినిమయ తత్వం పెంచే విధంగా ఉంటాడు" (11) పన్నులు ఇతర నియంత్రణలతో సోషలిజంతో మనుగడ సాగిస్తాడుకాని సోషలిస్టు కాదు.

అందుకు భిన్నంగా సహకార సంఘాలు సోషలిజం కార్యాచరణలో, కార్మికుల దినసరి జీవితంలో, వారి జనజీవనంలోనూ ఆచరణలో కనిపిస్తాయి. ఒక సామాజిక జీవనం ఎక్కువ కాలం మనగలగాలంటే అది నైతికంగా బలమయిన పునాదిని కలిగి ఉండాలి. ప్రజల స్వభావాలలో ఒకటిగా అయి ఉండాలి. వారి విలువలు స్పందనలు వారి వ్యవస్థకు అనుగుణంగా ఉండాలి. దీర్ఘకాలంలో సహకార సంఘాలు ఈ సామాజిక అవసరాన్ని పూరిస్తాయి. (12) సోషలిజం ఫలప్రదం కావాలంటే ఒక్క సోషలిస్టు రాజ్యం ఉంటే సరిపోదు. సోషలిస్టు ప్రజలు కూడా కావాలి. సహకార సంఘాలు ఇటువంటి ప్రజలను తయారు చేయగలవు.

**"అందుకు భిన్నంగా సహకార సంఘాలు సోషలిజం కార్యాచరణలో, కార్మికుల దినసరి జీవితంలో, వారి జనజీవనంలోనూ ఆచరణలో కనిపిస్తాయి. ఒక సామాజిక జీవనం ఎక్కువ కాలం మనగలగాలంటే అది నైతికంగా బలమయిన పునాదిని కలిగి ఉండాలి. ప్రజల స్వభావాలలో ఒకటిగా అయి ఉండాలి. వారి విలువలు స్పందనలు వారి వ్యవస్థకు అనుగుణంగా ఉండాలి."**



క్యూబాలోని ఒక గ్రామంలో వ్యవసాయ సహకారసంఘ సభ్యులు

క్యూబాకు సంబంధించిన కొత్త విధానాలను రూపకల్పన చేస్తున్న సందర్భంలో ఒబామా క్యూబాలో ప్రైవేట్ వ్యాపారాన్ని అభివఅద్ధి చేయ డంలో సహాయ పడాలనుకున్నారు. ఇవి సహకార సంఘాలకు భిన్నమయినవి. (13) ట్రంప్ ఈ విధానాలను అడ్డుపెట్టుకుని సోషలిజాన్ని కూలదోయాలని ప్రయత్నిస్తారో లేదో చూడాలి. ఏమయినా క్యూబా నాయకత్వం అంతులేని ప్రైవేటు విస్తరణ జరగకుండా, దానిపై అవినీతి ప్రభావం పడకుండా చూసుకుంటూ చాల అప్రమత్తంగా ఉన్నది. సహకార సంఘాల విస్తరణ పెట్టుబడిదారీ విధానం విస్తరించకుండా శక్తివంతంగా అడ్డుకట్ట వేయగలదు. ప్రైవేట్ వ్యాపారం విపరీతంగా పెరగకుండా ఆదాయాలు పెరగడంతో పాటే పన్నులు పెంచే విధంగా పన్నులు, సుంకాలు వేయవచ్చు. ప్రైవేటు వ్యాపారం ఒక స్థాయికి చేరగానే దానిని సహకార సంఘంగా మార్చవచ్చు. ఆలా చేసి కార్మికులందరూ అందులో భాగస్వాములుగా మారేట్టు చేయవచ్చు.ఆ రకంగా నిర్ణయాలలోను, బాధ్యతలలోను భాగస్వాములు అయేటట్టు చూడవచ్చు. ఆ రకంగా చేస్తే కొద్దికాలంలోనే కార్మికులు స్వంతదారులు అవుతారు. సంస్థ సహకారసంస్థ అవుతుంది. ఈరకంగా పెద్ద పెద్ద ప్రైవేటు వ్యాపార సంస్థలు కాలక్రమంలో సమాజపరం అవుతాయని ఆశిద్దాం.

ప్రైవేట్ రంగాన్ని నియంత్రిచడానికి ఒక కొత్త నియంత్రణ విధానం రూపొందించబడి అమలు చేయబడాలి. అదే సమయంలో క్యూబా సోషలిస్టు సహకార రంగాన్ని అత్యంత వేగంగా పెంచుకోవాలి. అలా చేయడం వలన సహకార కార్మికశక్తిని ఉత్పత్తి పెంచుకోడానికి పెద్ద ఎత్తున ఉపయోగించుకో గలుగుతుంది. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచుకోగలుగుతుంది. సోషలిస్టు నిర్మాణానికి అవసరమయిన సామూహిక చైతన్యాన్ని పెంపొందించుకోగలుగుతుంది.

**అనువాదం: కె ఉషారాణి**

# విశ్వవిద్యాలయాలపై దాడి



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త

**జయతి ఘోష్**

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ దేశ వ్యాప్తంగా ఒక ఉత్తమమైన ఉన్నత విశ్వవిద్యాలయంగా ఎదగటానికి ఇన్ని సంవత్సరాల పాటు ఏ ఆదర్శాలకు, కట్టుబాట్లకు ఒక ఒడంబడికగా నిలబడిందో, ఆ విధానాలకు నష్టం కలిగించేలా, బలహీనపర్చేలా ప్రస్తుత యాజమాన్యం గత రెండు సంవత్సరాలుగా చాపక్రింద నీరులా పనిచేస్తోంది.

గత రెండు సంవత్సరాల నుండి జెఎన్‌యు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిందని అనుకోవటానికి వీలులేదు. ఏ మూల సూత్రాల ఆధారంగా ఇన్ని సంవత్సరాలుగా అది అత్యుత్తమంగా నిలబడిందో, వాటిని నిర్వీర్యం చేయటానికి పై నుంచి ఒక పథకం ప్రకారం జరుగుతున్న దాడివలన ఈ పరిస్థితి వచ్చింది. ఎవరైతే తమ విధానాలతోనూ, చేతలతోనూ ఈ ఔన్నత్యాన్ని నిలబెట్టే స్థానాన్ని ఆక్రమించారో వారే దీనికి బాధ్యులు. సాక్షాత్తు విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఆయన నియమించిన పాలకమండలిని గమనిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతుంది. ఈ పాలకమండలి చర్యలను నిశితంగా పరిశీలిస్తే, అనాదిగా ఆచరణలో ఉన్న కట్టుబాట్లు ఆదర్శాలు, ప్రశాంత వాతావరణం అన్నింటినీ కక్షపూరితంగా తుడిచి పెట్టేయ్యాలనే వారి తపన మనకి అర్థమవుతుంది.

ఎందుకని ఈ విశ్వవిద్యాలయాన్ని నాశనం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు? అది ఏ తప్పు చేసిందని ఈ విధంగా దాడి చేస్తున్నారు? అటు కేంద్ర ప్రభుత్వ సంస్థలచే గుర్తింపబడి, ఎల్లప్పుడూ దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా మొదటి ర్యాంకులో నిలిచిన సంస్థ ఇది. కొన్ని దశాబ్దాలుగా సామాజిక శాస్త్రం, మానవీయ శాస్త్రం, సహజశాస్త్రాలలో దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన మేధావులను, ఏందరో ఉత్తములను సృష్టించిన విద్యాలయం ఇది. ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు దాదాపు అన్ని రంగాలలో విజయం సాధించిన వారై ఉన్నారు. విద్యావేత్తలుగా, పండితోత్తములుగా, పరిశోధకులుగా, అధికార యంత్రాంగంలోను, న్యాయకోవిదులుగాను, వ్యాపార, వాణిజ్య రంగంలోనూ, కార్పొరేట్ కంపెనీలలోనూ ఉన్నత స్థాయిలో విజయాలు అందించారు. సామాజిక సేవా రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ వీరువిస్తరించి ఉన్నారు. ఈ విద్యాలయము సాధించిన విజయాలను పరిశీలిస్తే, దీనికి దేశంలోపలగాని, బయటగాని శత్రువులు ఉండాల్సిన అవసరం లేదు. ఈ విజయాల వెనుక జెఎన్‌యు నిర్దేశించుకున్న విద్యా ప్రమాణాలు (కఠినమైన) స్వేచ్ఛాయుత ఆలోచనలకు చోటు, సామాజిక భిన్నత్వంపై కేంద్రీకరించటం, స్వేచ్ఛాయుత చర్చలను ప్రోత్సహించి, భావవ్యక్తీకరణ, వినూత్న పద్ధతులలో వక్తీకరణకు స్వేచ్ఛ తదితర అంశాలన్నీ మిళితమై ఉన్నాయి.

బహుశా ఈ అంశాలే అధికారంలో ఉన్న నేటి నాయకత్వానికి నచ్చక దీనిమీద దృష్టి సారించినట్లుగా ఉంది. జెఎన్‌యు ఎప్పుడూ ఒక రాజకీయ చర్చా వేదికగా ఉండేది. సిద్ధాంత పరమైన అంశాలతో పాటు, అన్ని ఇతర అంశాలపై లోతైన చర్చలు విద్యాలయమంతా వ్యాప్తి చెందేలా జరిగేవి.

విద్యాప్రమాణాలను దిగజార్చే విధంగా గాని, ఒకే అభిప్రాయాన్ని బలవంతంగా రుద్దే విధంగా గాని ఈ చర్చలు ఉండేవికావు. స్వేచ్ఛగా విభిన్నరాజకీయ భావాలను విద్యార్థులందరితోనూ పంచుకునే విధంగా సంభాషణలు ఉండేవి. ఈ రోజుకీ భారతీయ జనతాపార్టీకి చెందిన కొంతమంది మంత్రులతో సహా వామపక్షపార్టీల వరకు అనేకమంది జెఎన్‌యు పూర్వ విద్యార్థులు ఉన్నారు.

కానీ ఇటువంటి చర్చలు స్వేచ్ఛా వాతావరణానికి ప్రోత్సాహం, విభిన్న అంశాలపై భిన్న వాదనలు నేడు అధికారంలో ఉన్నవారికి కంటగింపుగా ఉన్నాయి. ఎందుకంటే ఈ విధానం వలన భావి భారత పౌరులకు ఆలోచించే తత్వం, మొత్తం సమాజ సమకాలీన అంశాలపై స్పందించే సున్నిసిత మనస్తత్వం, ప్రశ్నించేతత్వం అలవడ్డాయి. ఇదే నేటి పాలక వర్గానికి పెద్ద సమస్య. వారికి ప్రశ్నించేవారంటే అసహ్యం. ఈ వర్గం వారు ఏది అమలు చేస్తే దానిని వినమ్ర, విధేయతలతో రెండో ఆలోచన లేకుండా ఆచరించే వారే కావాలి. జెఎన్‌యు మీద వీరి దాడి, కేవలం ఉన్నత విద్యారంగంపై దాడి మాత్రమే కాదు. ప్రశ్నించే తత్వంగల పౌరులపై దాడిగా మనం చూడాలి. ఎందుకంటే ఇన్ని సంవత్సరాలుగా ఈ విద్యాపీఠం దానికోసమే నిలబడింది కాబట్టి.

సరిగ్గా రెండేళ్ళ క్రితం ఈ యూనివర్సిటీ, దానిలోని అధ్యాపకులు, విద్యార్థులు బాహ్య ప్రపంచం నుంచి తీవ్రమైన దాడిని ఎదుర్కొన్నారు. కల్పిత కథనాలతో, కట్టుకథలతో, కొంతమంది బాధ్యతా రహితమైన మీడియా సంస్థల సహకారంతో దేశద్రోహులకు నిలయమనే ప్రచారం లేవనెత్తి దాడిచేశారు. కాని ఈ ప్రయత్నం వారనుకున్నంత విజయాన్ని సాధించలేకపోయేసరికి, అంతర్గతంగా దీని విశిష్టతను నాశనం చెయ్యాలని తలించి, యూనివర్సిటీ పాలకమండలి ద్వారా ప్రవేశించి, చర్చలకు తావులేని, ప్రశ్నించే హక్కులేని, భయానక వాతావరణాన్ని రుద్దే క్రమం రోజురోజుకి పెంచుకుంటూ విద్యాలయ ప్రమాణాలను భ్రష్టు పట్టిస్తున్నారు. ఇవన్నీ చేయటానికి వారు ఏ స్థాయికి దిగజారారంటే, సమావేశాల ఎజెండాలోని లిఖిత అంశాలను కూడా తారుమారు చేయటం, పచ్చి అబద్ధాలను లేదా పాక్షిక వాస్తవాలను ప్రచారం చెయ్యటం, కోర్టులకి కూడా అలాంటి సమాచారం ఇవ్వటం, డీన్స్‌ను, ఛైర్‌పర్సన్‌లను ఎంపిక చేయటంలో సీనియారిటీని పక్కన బెట్టి, ఎవరు తాము చెప్పింది గుడ్డిగా ఆచరణలో పెడతారో వారిని ఆ స్థానాల్లో నియమించడం, పాలకవర్గాన్ని ప్రశ్నించకుండా చూడటం, తమ రాజకీయ దృక్పథం అమలుచేసే భావజాలం ఉన్నవారిని అక్రమ పద్ధతులలో సెలక్ట్ కమిటీలకు నియమించడం, (అర్హులను తొక్కివేయడం), సామాజిక శాస్త్రాల విభాగంలో ఎవరితోనూ సంప్రదించకుండా రీసెర్చ్ స్కాలర్ల సీట్లు కుదించి వేయడం, ఇతర విభాగాలలో కూడా ఫ్యాకల్టీతో, విద్యార్థులతో చర్చించకుండా సీట్లు పరిమితం

చేయడం, చట్ట ప్రకారం అమలు చేయాల్సిన రిజర్వేషన్ కోటా ఎస్సి, ఎస్టి ఓ.బి.సి సీట్లు నింపకపోవడం, అలా చేయటానికి ఎన్నడూలేని విచిత్రమైన రూల్స్‌ని అమలులోకి తేవడం, ఎందుకిలా అని ప్రశ్నించినవారికి హాస్టల్ వసతిలో, వార్డెన్‌షిప్‌లో, సెలవులు ఇవ్వటంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం, తందాన అన్న కార్యక్రమాలకు అనుమతులివ్వడం లాంటి ఎజెండాతో ఈ విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు.

పరిపాలనా విధానాల నుండి దారి మళ్లటం, ఆచరణలో ఉన్న ప్రమాణాలు తుంగలో తొక్కడం వంటివిచాలా ఉదాహరణలు ఉన్నాయి. అవన్నీ ఇక్కడ రాయలేము. ప్రతివారం చివర కొత్త కొత్త తుగ్లక్ విధానాల సర్క్యులర్‌లు రావటం, వాటిని తక్షణమే అమలు చేయాలని ఆదేశించడం, అందులో కొన్నింటిని మరల రద్దుచేస్తూ, కొన్నింటికి వివరణ ఇస్తూ మరలా తాఖీదులు పంపించి, అవి అమలు చేయని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం సర్వసాధారణం అయిపోయింది. మొత్తంమీద చూస్తే, వారు కల్పిస్తున్న పరిస్థితి వలన, విశ్వవిద్యాలయంలోని వాస్తవ సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు, యంత్రాంగం, ఇతర సిబ్బంది, సహజసిద్ధంగా పనిచేసే వాతావరణాన్ని దెబ్బతీసింది. ఈ విశ్వవిద్యాలయం ఇప్పటిదాకాతెచ్చుకున్న పేరు ప్రఖ్యాతులను విచ్ఛిన్నం చేయడమే వారి ఉద్దేశంగా కనిపిస్తోంది. అంతేకాదు, ఇటువంటి చర్యల ద్వారా విశ్వవిద్యాలయంలో నిరంతరం అలజడి వాతావరణం సృష్టించడంద్వారా, అస్థిరతతోపాటు, సమాజం దానిని గేలిచేసేవిధంగా తయారు చేయడం వారి లక్ష్యంగా ఉంది.

ఉదాహరణకు 'తప్పనిసరి హాజరు' అంశం. ఇటీవల కాలంలో అతిపెద్ద అలజడికి కారణమైంది. అసలు సహజంగానే ఈ విద్యాలయంలో హాజరు శాతం ఎక్కువగానే ఉంటుంది. అందువలనే విద్యాప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయన్నది సుస్పష్టం. కాని రీసెర్చ్ స్కాలర్స్ (పరిశోధనా విద్యార్థులు)కు రోజూ హాజరు పట్టిక తప్పనిసరి చేసే చర్య అత్యంత దుర్మార్గమైనది. వారు దేనిమీద పరిశోధన చేస్తున్నారు, వారికున్న మౌలిక అవసరాలు విద్యాలయాల్లో ఉన్నాయా లేవా అనే దాంతో సంబంధం లేకుండా వారికి రోజూ హాజరు వేయటం హాస్యాస్పదమైనది. ఈ రకమైన హాజరు పద్ధతి ప్రపంచంలోని పేరుగాంచిన విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా మనకి కనిపించదు. కనీసం ఇది అమలు చేయటానికి సంబంధిత విభాగాల కమిటీలతో కాని, బోర్డ్ ఆఫ్ స్టడీస్ కౌన్సిల్‌తోగాని చర్చించ కుండా సర్క్యులర్ పంపారు. అది ఎలా అమలు

“అసలు సహజంగానే ఈ విద్యాలయంలో హాజరు శాతం ఎక్కువగానే ఉంటుంది. అందువలనే విద్యాప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయన్నది సుస్పష్టం. కాని రీసెర్చ్ స్కాలర్స్ (పరిశోధనా విద్యార్థులు)కు రోజూ హాజరు పట్టిక తప్పనిసరి చేసే చర్య అత్యంత దుర్మార్గమైనది. వారు దేనిమీద పరిశోధన చేస్తున్నారు, వారికున్న మౌలిక అవసరాలు విద్యాలయాల్లో ఉన్నాయా? లేవా? అనే దాంతో సంబంధం లేకుండా వారికి రోజూ హాజరు వేయటం హాస్యాస్పదమైనది.”



జెఎన్‌యు విసి విధానాలకు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చేయాలో తెల్పే విధానాలు తయారు కాకముందే, సర్క్యులర్ పంపారు. అసలు అమలుకు అసాధ్యంగా ఉండే అంశాలను ఎంచుకుని బుర్రలేని విధంగా ఉత్తర్వులు జారీచేస్తున్నారు. దీనివలన అర్థమయ్యిందేమిటంటే, కావాలనే ఇటువంటి చర్యలతో విద్యార్థులను రెచ్చగొట్టడం, అసహనానికి గురిచేయడం ద్వారా నిరంతర అలజడి సృష్టించడం తప్ప, అక్కడ విద్యాప్రమాణాలను పెంపొందిచడానికి కానేకాదు.

ఇటువంటి అనాలోచిత దుర్మార్గపు పోకడలకు మరో నిదర్శనం ఇటీవలనే పాలకమండలి ఆదేశించిన మరో ఉత్తర్వులో ఉంది. అది 25 నుంచి ఎమ్‌ఫిల్, పి.హెచ్.డిలకు జరిగే వైవా" పరీక్షలు అన్నీ వైఫై ద్వారానే జరగాలని ఆదేశించారు. అసలు వైవా అనేది కేవలం పరీక్షే కాదు. దాని ద్వారా విద్యార్థి చర్చించడం వలన అనేక అంశాలను నేర్చుకునే అవకాశం ఉంది. అటువంటి ఉపయోగకరమైన, సుదీర్ఘంగా జరిగే చర్చలను ఇంటర్‌నెట్ ద్వారా జరపడం దుర్లభం. నెట్ కనెక్షన్ సక్రమంగా రాక చర్చల ప్రక్రియ దాగుడుమూతలుగా సాగుతుంది. బయటి నుండి ఎగ్జామినర్లను తేవడం ఖర్చుతో కూడిన పని అనే కారణం నిజమయితే, స్థానికంగా ఢిల్లీలోనే ఉన్న ఎగ్జామినర్లను కూడా అనుమతించకుండా స్కైప్ ద్వారానే వైవాని నిర్వహించడం వెనుక అసలు కారణం ఏమిటనేది ప్రశ్న? చాలాసార్లు కనెక్టివిటీ లేక విద్యార్థులు చెప్పేవి ఎగ్జామినర్‌కి అర్థంకాక, ఆయన చెప్పేది విద్యార్థికి అర్థంకాక తీవ్రమైన ఇబ్బందులు పడిన స్థితి ఉంది. దీనికి పరిష్కారం చూపండి అని అడిగితే ఇక నుండి వైవాలు వాట్సాప్‌లో చేసుకోండని పాలక మండలి సమాధానం ఇచ్చింది.

నా విద్యార్థి ఒకరు, సంవత్సరం క్రితం పిహెచ్‌డి థీసిస్ సమర్పించారు. కాని వైవా మటుకు ఇంతవరకు సాధ్యంకాలేదు. ఎందుకంటే అతని ఎగ్జామినర్ ముంబయిలో ఉంటారు. అతను ఆఫీసుపని వేళల్లో స్కైప్‌కాని వాట్సాప్‌కాని వాడకూడదు. ఇక్కడ జెఎన్‌యూ అధికారులు వారాంతపు సెలవులోకాని, పని వేళల తరువాత కాని వైవా చేయడానికి అంగీ కరించడం లేదు. ఆ టైమ్‌లో టెక్నికల్ టీమ్ ఉండరనేది కారణంగా చెబుతున్నారు. ఇదంతా విద్యాప్రమాణాలు పెంపొందడానికేనా? కానేకాదు. కేవలం విద్యా ర్థులను అధ్యాపకులను నిస్సహాయతకు, ఆందోళనకు గురిచేయడానికి మాత్రమే అని అర్థం అవుతోంది.

విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడంలో, అభివృద్ధి చేయడంలో పాత్ర ఉన్న వారందరికీ అది ఎంత శ్రమకోర్చి సాధించాల్సినది అని తెలుసు. అందులోనూ ఇంత పేరు ప్రఖ్యాతులు సాధించడానికి ఎంత చెమటోడ్చాలో అందరికీ తెలుసు. ఇప్పుడు వారందరికీ తెలుస్తోందేమిటంటే, ఒక ఉన్నత విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయాలంటే ఇటువంటి, నిరంకుశ, అహంకార పూరిత, దురుద్దేశ్యపూర్వక విధానాల ద్వారా భవిష్యత్తులో ఏమి సాధిస్తామో కూడా తెలియని పాలక వర్గం ఉంటే చాలని అర్థమవుతోంది. ఇప్పుడు మనకి కావాల్సింది నిరాశా. నిస్పృహలు కాదు, ఈ విశ్వవిద్యాలయాన్ని దాని ఔన్నత్యాన్ని కాపాడుకునే పోరాటం, అది కేవలం విశ్వవిద్యాలయ పోరాటం కాదు, ఈదేశపు భవిష్యత్తుకోసం జరిగే పోరాటంలో భాగం.

**అనువాదం : లక్కరాజు భారవి**

# దాతృత్వ మాయగాళ్లు

పవన్ కులకర్ణి



రచయిత ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

నేడు దాతృత్వ మాయగాళ్లు మాయలు, మారు పేర్లతో వర్ధమాన దేశాల్లోని ప్రజారోగ్యం, వ్యవసాయ రంగాలను కొల్లగొడుతున్నారు. దాతృత్వ ముసుగులో వున్న బడా బహుళజాతి కంపెనీలను అనుమతించడం నిజంగానే చాలా ప్రమాదకరం. మొదట టీకా మందులు, హైబ్రిడ్ విత్తనాలను డిస్కౌంట్ రేటుకు అమ్ముతాయి. గుత్తాధిపత్యం పూర్తయిన తరువాత ఇవి తమ విశ్వరూపం చూపిస్తాయి. ఈ దాతృత్వ మాయగాళ్లకు బిగ్ బాస్ బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్. దీనినే బిల్ గేట్స్ ఫౌండేషన్ అని కూడా పిలుస్తారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఈ ప్రైవేట్ సంస్థ ప్రపంచంలోనే అతి పెద్దది, అత్యంత సంపన్నమైనది మాత్రమే కాదు, అతి శక్తివంతమైనది కూడా. ఈ బడా అమెరికన్ దాతృత్వ సంస్థ కింద అనేక స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జిఓలు) పనిచేస్తుంటాయి. టీకా మందులు, విత్తన రంగాలపై బిల్ గేట్స్, దాని అనుబంధ కంపెనీలు గుత్తాధిపత్యం చలాయించేందుకు, పెద్దయెత్తున లాభాలు పోగేసుకునేందుకు అనువైన భూమికను ఇవి కల్పిస్తాయి. ఈ కార్యకలాపాల నిర్వహణకు గాను ఫౌండేషన్ వీటికి ఉదారంగా సాయం అందిస్తుంది. ఈ 'సాయం'తో బాటు ప్రభుత్వ 'ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) సంస్థల ద్వారా లక్షలాది డాలర్ల ప్రజల సొమ్మును ప్రైవేట్ ప్రాజెక్టులకు మళ్లించేలా చూస్తుంది. వర్ధమాన దేశాల్లో మేధో సంపత్తి హక్కుల (ఐపిఆర్) వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఈ గేట్స్ ఫౌండేషన్ గట్టి లాబీయింగ్ చేయడం, అప్పటికే వున్న, స్వల్ప మార్పులతో తయారు చేసే ఔషధాలపై పేటెంట్ గడువును పొడిగించాలని ఒత్తిడి తెస్తుంది. ఈ ఫౌండేషన్ ఆఫ్రికాలోని కొన్ని ప్రభుత్వాలను ఇప్పటికే లొంగదీసుకుంది. అక్కడ తమ విత్తన వ్యాపారానికి ఎదురులేకుండా చూసుకునేందుకు పేటెంట్ చట్టాలను తిరగరాయించింది. కంపెనీవిత్తనాలు తప్ప రైతులు సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేయడాన్ని నేరంగా పరిగణించే స్థితికి ఇది దారి తీస్తుంది.

టీకాలపై గుత్తాధిపత్యానికి పక్కా ప్రణాళిక 2000 సంవత్సరంలో గేట్స్ ఫౌండేషన్ ప్రోత్సాహంతో 75 కోట్ల డాలర్లతో ఏర్పాటైన గ్లోబల్ అలయెన్స్ ఫర్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ (గావి) సంస్థ నేడు బడుగు దేశాల్లో టీకా మార్కెట్‌ను శాసించే ఒక ప్రధాన శక్తిగా అవతరించింది. ప్రైవేట్ దాతృత్వ నిధులకు తోడు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో ప్రజాధనాన్ని ఫౌండేషన్‌తో సంబంధమున్న సంస్థలకు మళ్లించేందుకు ఇదొక వారధిగా పనిచేస్తున్నది. గావికి చేకూరుతున్న నిధుల్లో 80 శాతం దాకా పిపిపి ద్వారా చేకూరిన ప్రజల సొమ్మేనన్నది స్పష్టం. మిగిలిన 20 శాతాన్ని గేట్స్ ఫౌండేషన్ లాంటి కొన్ని ప్రైవేట్ దాతృత్వ సంస్థలు సమకూరుస్తాయి. ఈ సాయానికి ప్రతిఫలంగా యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ), ప్రపంచ బ్యాంకులతో కూడిన బోర్డు ఆఫ్ అలయెన్స్‌లో గేట్స్ ఫౌండేషన్‌కు శాశ్వత సభ్యత్వ హోదా కల్పించారు. ఈ బోర్డులో రెండు స్థానాలు టీకా మందుల తయారీ సంస్థల ప్రతినిధులకు రిజర్వు చేశారు. పరిమిత గడువుతో కూడిన మిగతా స్థానాలను స్వతంత్ర వ్యక్తులకు, ప్రభుత్వ, పౌర సమాజ సంస్థల ప్రతినిధులకు కేటాయించారు.

తాను ఉత్పత్తి చేసిన టీకా మందులను పదేళ్లపాటు తప్పనిసరిగా కొనుగోలు చేసే విధంగా వివిధ వర్ధమాన దేశాల నుంచి గావి సంస్థ ముందస్తు అంగీకార పత్రాలు తీసుకుంటుంది. దీనికే అది అడ్వాన్స్ మార్కెట్ కమిట్‌మెంట్ (ఎఎంసి) అనే ముద్దు పేరు పెట్టింది. ఎఎంసి సక్రమంగా అమలయ్యేలా చూసే బాధ్యత యునిసెఫ్ తన నెత్తికెత్తుకుంది. ఎఎంసి ఒడంబడిక ప్రకారం సంవత్సరానికి రెండు కోట్ల టీకా మోతాదుల (డోస్‌లు) చొప్పున పదేళ్ల పాటు గావి సరఫరా చేయాల్సి వుంటుంది. ఒక్కొక్క డోస్ ఖరీదు మూడున్నర డాలర్లు. దీనిని బట్టి బడా ప్రైవేట్ మందుల కంపెనీలకు వర్ధమాన దేశాల్లో ఫార్మా మార్కెట్‌పై గుత్తాధిపత్యం కల్పించడమే ఎఎంసి లక్ష్యం కనీసం పదేళ్ల పాటు ఈ బడా బహుళజాతి మందుల కంపెనీలకు మార్కెట్‌లో ఎలాంటి పోటీ లేకుండా ఇది చూస్తుంది. తలసరి సగటు స్థూల జాతీయాదాయం (జిఎన్‌ఐ) గడచిన మూడేళ్లలో 1580 డాలర్లు, అంతకన్నా లోపు వున్న దేశాలు మాత్రమే గావి ఆర్థిక సాయం పొందేందుకు అర్హులని ఒక నిబంధన విధించారు. అందులోనూ నిర్దిష్ట పరిమాణంలో టీకా మందులను కొనుగోలు చేసిన దేశాలకే ఇది వర్తిస్తుందని మరో మెలిక పెట్టారు. బడుగు దేశాలకు మూడున్నర డాలర్ల రేటు చొప్పున కొన్ని డోస్‌లకు ప్రభుత్వాలు డబ్బు చెల్లిస్తే, మిగతా డోస్‌లకు గావి సంస్థ చెల్లిస్తుంది. ఈ రాయితీ ఎక్కువ కాలం వుండదు. అంచెలంచెలుగా అయిదేళ్లలో దీనిని పూర్తిగా ఎత్తివేయాలన్నది నిబంధన. ఆ తరువాత 'సచివాలయ నిర్ణయ లేఖ' లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆ మిగతా డోస్‌లను మూడున్నర డాలర్ల చొప్పున ప్రభుత్వాలే కొనుగోలు చేయాల్సి వుంటుంది.

ఏ దేశమైనా దీనిని నెరవేర్చడంలో విఫలమైతే దానిని 'డిఫాల్టర్'గా పరిగణించి జరిమానాలు విధిస్తారు. అంతేకాదు, ఇతర టీకా మందుల సరఫరాను, సేవలను నిలిపేస్తారు. గావిపై ఆధారపడడం మినహా మరో మార్గం లేని పరిస్థితిని కల్పిస్తారు. డిఫాల్ట్ నుంచి బయటపడాలంటే గావి చెల్లింపుల ప్రణాళికలో పేర్కొన్న విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతకు ముందున్న సంవత్సరపు బకాయిలన్నిటినీ మందుల కంపెనీలకు అణాపైసలతో సహా తొలి కిస్తీగా చెల్లించాల్సి వుంటుంది. ఈ

అంశంపై గావి ఆర్థిక సహకార పత్రం (వర్షన్ 2.0) ఇలా పేర్కొంది.

"ఎఎంసి అమలులోకి వచ్చిన ఒకటి రెండేళ్ల తరువాత టీకా మందు తయారీదారులకు అంగీకృత డోస్ ధర (మూడున్నర డాలర్లు)కు రెట్టింపు చెల్లించేలా చూస్తానని గావి హామీ ఇస్తోంది."

ప్రపంచంలో రెండు అతి పెద్ద మందుల కంపెనీలుగా పేరొందిన జిఎస్‌కె, పిఫైజర్ కంపెనీలు సంవత్సరానికి 3కోట్ల టీకా డోస్‌ల చొప్పున పదేళ్లపాటు సరఫరా చేసే కాంట్రాక్టును దక్కించుకున్నాయి. ఎఎంసి నుంచి ఈ సంస్థలకు ఒక్కొక్కదానికి ఏటా కనీసం 22.5 కోట్ల డాలర్ల ఆదాయం వచ్చేలా చూస్తామని గావి హామీ ఇస్తున్నదని ఆ పత్రం పేర్కొంది. అంటే డోస్‌కు మూడున్నర డాలర్లు చొప్పున గావి చెల్లించేదానికి ఇది అదనమన్నమాట. ఈ లెక్కన మొదటి రెండేళ్లలో డోస్‌కు మొత్తంగా ఏడు డాలర్ల దాకా బహుళజాతి మందుల కంపెనీలకు చెల్లించాల్సి వుంటుంది.

జిఎస్‌కె కంపెనీకి గేట్స్ ఫౌండేషన్‌కు మధ్య వున్న బంధం అటువంటిది. గావి నుంచి కాంట్రాక్టును పొందిన మరో కంపెనీ పి ఫైజర్. ఈ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు ఎమీలియో ఎమిని గేట్స్ ఫౌండేషన్ గ్లోబల్ హెల్త్ కార్యక్రమ డైరక్టర్‌గా నియమించబడ్డారు. గేట్స్ ఫౌండేషన్‌కి, పి ఫైజర్‌కి మధ్య విడదీయరాని బంధం వుందనడానికి ఇదొక నిదర్శనం.

గేట్స్ ఫౌండేషన్‌తో సంబంధమున్న ప్రపంచం లోని అతి పెద్ద మందుల కంపెనీలకు రాయితీల కింద పెద్దయెత్తున ముట్టజెప్తున్న ఆ సొమ్మును భారత్, చైనా, బ్రెజిల్‌లో జనరిక్ మందుల కంపెనీలకు ఉపయోగిస్తే మరింత చౌకగా మందులను ప్రజలకు అందుబాటులో వుంచొచ్చని ఆక్స్‌ఫామ్, ఎంఎస్ఎఫ్ వంటి సంస్థలు చేస్తున్న వాదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది.

❝ గేట్స్ ఫౌండేషన్‌తో సంబంధమున్న ప్రపంచం లోని అతి పెద్ద మందుల కంపెనీలకు రాయితీల కింద పెద్దయెత్తున ముట్టజెప్తున్న ఆ సొమ్మును భారత్, చైనా, బ్రెజిల్‌లో జనరిక్ మందుల కంపెనీలకు ఉపయోగిస్తే మరింత చౌకగా మందులను ప్రజలకు అందుబాటులో వుంచొచ్చని ఆక్స్‌ఫామ్, ఎంఎస్ఎఫ్ వంటి సంస్థలు చేస్తున్న వాదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది. ❞

గేట్స్ ఫౌండేషన్ ఈ ధన సాయానికి బదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వర్థమాన దేశాలకు బదలాయిస్తే జనరిక్ ఫార్మా సంస్థలకు ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది. ఆ అధునాతన టెక్నాలజీని వినియోగించి మందులను మరింత తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయడానికి వీలవుతుంది.దీనికి ఫౌండేషన్ ససేమిరా అంటోంది. పైగా వాణిజ్య సంబంధ మేధో సంపత్తి హక్కుల (ట్రిప్స్) ఒప్పందానికి అందరూ కట్టుబడాలని బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్‌తో సహా పలు బడా కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ట్రిప్స్ ఒప్పందం ప్రకారం సభ్య దేశాలు ఔషధాలపై పేటెంట్



బిల్ గేట్స్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

హక్కును కనీసం 20 ఏళ్లపాటు గౌరవించాలి. ఇది చాలదన్నట్లు 2007లో మైక్రో సాఫ్ట్ సంస్థ గ్లోబల్ మేధో సంపత్తి హక్కులు (ఐపిఆర్) కు మరింత పదునుపెట్టాలని అప్పటి జి–8పై ఒత్తిడి తెచ్చింది. మైక్రో సాఫ్ట్ గొంతెమ్మ కోర్కెను అంగీకరిస్తే, ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో పడిన వర్థమాన దేశాల ప్రజారోగ్య రంగం మరింతగా దిగజారే ప్రమాదముందని ఆక్స్‌ఫామ్ హెచ్చరించింది.

మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ బలంగా వుండాలని ఫార్మా లాబీ నిరంతరం వాదిస్తుంది. ఆవిష్కరణలకు ప్రోత్సాహం వుండాలంటే పేటెంట్ హక్కులు కచ్చితంగా అమలు జరగాల్సిందేనంటుంది. ఈ వాదన చేసే కంపెనీలు ఉద్దేశపూర్వకంగానే ఒక వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నాయి. అమెరికా ప్రభుత్వ నివేదికలతో సహా పలు అంతర్జాతీయ అధ్యయనాలు ఒక విషయాన్ని స్పష్టంగా తేల్చి చెప్పాయి. అదేమిటంటే మందుల తయారీ కంపెనీల ప్రయోజనాల కనుకూలంగా వుండే ప్రాజెక్టులకు ప్రభుత్వాల నుంచి ఇప్పటికే పెద్దయెత్తున సబ్సిడీలు ముదుతున్నాయి. వీటికి దాతృత్వ సంస్థల నుంచే కాకుండా, వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి కూడా ప్రజా ధనం పెద్దయెత్తున మళ్లించబడుతోంది. దీర్ఘకాలిక టీకా మందుల కార్యక్రమంలో భాగంగానే ఈ సబ్సిడీలు అందించాల్సి వస్తోందని ప్రభుత్వాలు తమ చర్యను సమర్థించుకోజూస్తున్నాయి. నేడు గ్లోబల్ హెల్త్ గురించి అందరికన్నా ఎక్కువగా మాట్లాడే బిల్ గేట్స్ దాతృత్వ ముసుగులో బడుగుదేశాల సంపదను కొల్లగొట్టడంలో అందరికన్నా ముందుంటారు.

**ఆఫ్రికాపై పట్టు కోసం పెనుగులాట**
**వలసవాదుల గుప్పెట్లోకి వ్యవసాయం !**

ఔషధరంగం తరువాత అత్యంత కీలకమైన వ్యవసాయ రంగంపై గుత్తాధిపత్యం కోసం గేట్స్ ఫౌండేషన్ వేయని ఎత్తు లేదు. 2015 మార్చిలో బ్రిటిష్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ అభివృద్ధి వ్యవహారాల విభాగం, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో ప్రధాన పాత్రధారులుగా వున్న గేట్స్ ఫౌండేషన్, యుఎస్ఎయిడ్ సంస్థల ప్రతినిధులు రహస్యంగా సమావేశమై సబ్ సహారన్ ఆఫ్రికాలో కంపెనీ విత్తనాల అమ్మకాలను ఎలా పెంచుకోవాలన్న దానిపై చర్చించారు. ఈ సమావేశంలో గేట్స్ ఫౌండేషన్, యుఎస్ ఎయిడ్ సంస్థలు పేద రైతులు అధికంగా కలిగిన ఆఫ్రికాలో విత్తన పేటెంట్ల కోసం గట్టిగా పట్టుబట్టాయి. ఈ సమావేశానికి ఒక్క రైతు సంఘాన్ని కూడా పిలవలేదంటేనే వీరి ఉద్దేశమేమిటో అర్థమవుతుంది. 'ఆహార సార్వభౌమత్వ పరిశోధకుడు' ఇయాన్ ఫిట్జ్ పాట్రిక్ రూపొందించిన నివేదికపై ఈ సమావేశంలో చర్చించారు. పాట్రిక్ చేసిన సిఫారసుల్లో ఒకటి. "ఏ దేశంలోనైతే పేటెంట్ విత్తనాలకు గిరాకీ తక్కువగా వుందో అక్కడ (అంటే రైతులు తమ సొంత విత్తనాలను భద్రపరచుకుని వాడుతున్న చోట ) ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందించాలి. దీనివల్ల ప్రైవేట్ కంపెనీలకు 'పెట్టుబడి రిస్కు' లేకుండా చూడవచ్చు. రెండవది, హైబ్రిడ్ విత్తన ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మేధో సంపత్తి హక్కులను ప్రవేశపెట్టేలా ఎన్‌జీవోలను, ప్రభుత్వాలను 'దాతృత్వ' సంస్థ

**"గేట్స్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌ల సాయంతో 2006లో ఏర్పాటైన మరో కీలక సంస్థ 'అలయెన్స్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఇన్ ఆఫ్రికా' (ఎజిఆర్‌ఎ). ఆఫ్రికన్ ప్రాంతంలో పేటెంట్ విత్తనాల వ్యాపారాన్ని ప్రోత్సహించడం దీని ప్రధాన విధి. ఆఫ్రికాలో గేట్స్ ఫౌండేషన్, దాని అనుబంధ కంపెనీల వాణిని గట్టిగా విని పించడంలోను, వాటి మార్కెట్ విస్తరణ సాఫీగా సాగేలా చూడడంలోను ఎజిఆర్‌ఎ కీలక పాత్ర పోషిస్తున్నది."**

లు ప్రోత్సహించాలి. వీటి సాయంతో రైతులను సాంప్రదాయక వంగడాలపై ఆధారపడే పరిస్థితి నుంచి తప్పించాలి. ఆ తరువాత వాణిజ్యపర మైన, పేటెంట్ విత్తనాలను కొనుగోలు చేసేలా వారిని ఒప్పించాలి.

విత్తనాలపై పేటెంట్ కోసం లాభార్జన దృష్టిలేని సంస్థల (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్) నెట్‌వర్కు ద్వారా లాబీయింగ్ నిర్వహించాలనేది ఈ కమిటీ చేసిన మరో సిఫారసు. ఆఫ్రికన్ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఎఎటి ఎఫ్) లాంటి సంస్థలు ఇప్పటికే ఆ పనిలో వున్నాయి. ఈ పనిచేస్తున్నందుకుగాను ఎఎటిఎఫ్‌కు గేట్స్ ఫౌండేషన్ 11.8 కోట్ల డాలర్ల సాయాన్ని ఉదారంగా అందించింది. అమెరికా కు చెందిన డిఎఫ్ఐడి, యుఎస్ఎయిడ్ వంటి సంస్థల నుంచి కూడా దీనికి భారీగానే నిధులు ముట్టాయి.

ఈ సాయానికి గాను ఎఎటిఎఫ్ సంస్థ బడా విత్తన కంపెనీలసేవలో మరింతగా తరిస్తున్నది. మీడియాను, ప్రజాభిప్రాయాన్ని నియంత్రించడం, మేధో సంపత్తి హక్కులు సాఫీగా అమలు జరిగేలా చూడడం, జన్యుపర మైన విత్తనాల తయారీ, మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ వంటి అంశాలకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగిం చేందుకు ఉత్తుత్తుల వారీగా ఎంపిక చేసిన సమాచారాన్ని బయటకు వదలడంలో ఈ సంస్థ చాలా సమర్థవంతంగా వ్యవహరిస్తున్నది. దీంతోబాటు వివిధ దేశాల్లో మేధో సంపత్తి హక్కుల వ్యవస్థల పని తీరును మదింపు వేయడం, భాగస్వామ్య ఒప్పందాలకు ప్రభుత్వా లను ఒప్పించడం వంటివి కూడా చేస్తున్నది.

గేట్స్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌ల సాయంతో 2006లో ఏర్పాటైన మరో కీలక సంస్థ 'అలయెన్స్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఇన్ ఆఫ్రికా' (ఎజిఆర్ఎ). ఆఫ్రికన్ ప్రాంతంలో పేటెంట్ విత్తనాల వ్యాపారాన్ని ప్రోత్సహించడం దీని ప్రధాన విధి. ఆఫ్రికాలో గేట్స్ ఫౌండేషన్, దాని అనుబంధ కంపెనీల వాణిని గట్టిగా విని పించడంలోను, వాటి మార్కెట్ విస్తరణ సాఫీగా సాగేలా చూడడంలోను ఎజిఆర్ఎ కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ ప్రాధాన్యతను గుర్తించే గేట్స్ ఫౌండేషన్ దీనిని "ఆఫ్రికన్ ఫేస్ అండ్ వాయిస్ ఆఫ్ అవర్ వర్కు" గా అభివర్ణించింది. విత్తన పేటెంట్ వ్యవస్థను అమలులోకి తెచ్చేందుకు ఆఫ్రికన్ ప్రభుత్వాలపై ఇది బహుముఖ రూపాల్లో ఒత్తిడి తెస్తుంది. పేటెంట్ విత్తన కంపె నీల ప్రయోజనాలకు అనుగుణంగా జాతీయ విత్తన విధానాన్ని తిరగరాస్తుంది. ఘనాలో అది ఈ పనే చేసింది. దీనికి ఘనా ఆహార సార్వ భౌమత్వ నెట్‌వర్కు నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో తోక ముడిచింది. ఆ తరువాత టాంజానియాలో అడుగుపెట్టి అక్కడి జాతీయ విత్తన విధానాలను సమీక్షిం చింది. అధ్యయన నివేదికల పేరుతో కంపెనీ విత్తనాలకు ఆ దేశం లో చాలా గిరాకీ ఉన్నట్లు చూపించింది. ఇందుకుగాను ఆ సంస్థకు గేట్స్ ఫౌండేషన్ ఈ ఒక్క సంవత్సరానికే 20 కోట్ల డాలర్లను పరిహారంగా ముట్టజెప్పింది.

ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఈ విత్తన వ్యాపార వ్యవస్థలతో వచ్చే చేటు గురించి 'గ్లోబల్ జస్టిస్ నౌ' సంస్థ ఘాటుగానే హెచ్చరించింది. 'విత్తన పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి, పంపిణీ' రంగాన్ని కొద్ది సంఖ్యలో వున్న బడా కంపెనీల చేతుల్లో పెట్టే ఈ విధానాలు ఆఫ్రికాను నట్టేట ముంచుతాయని ఈ సంస్థ సరిగానే హెచ్చ రించింది. మేధో సంపత్తి హక్కుల్లో వాణిజ్య విత్తనాలను చేర్చాలంటే ఆఫ్రికా దేశాల విత్తన చట్టాల్లో మౌలిక మార్పులు తీసుకురావాల్సి వుంటుంది. కంపెనీ విత్తన వ్యవస్థను అను మతించడమంటే ఆ సర్టిఫైడ్ విత్తనాలను పరిరక్షించడమొక్కటే కాదు, ఆ విత్తన కంపెనీ లకు రాయల్టీలు చెల్లించాలి. సవరించిన చట్టాల ప్రకారం సర్టిఫైడ్ కాని విత్తనాలు అంటే సాంప్ర దాయకంగా రైతులు సొంతంగా భద్రపరచుకుని వాడుకుంటున్న విత్తనాలు ఇక ఎంతమాత్రమూ కలిగివుండేందుకు వీలుండదు. ఒక వేళ ఎవరైనా వాటిని కలిగివుంటే అది నేరంగా పరిగణించబడుతుంది' అని జస్టిస్ నౌ తన నివేదికలో వివరించింది.

బడా కార్పొరేట్ ఆగ్రో బిజినెస్ సంస్థలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఎజిఆర్ఎ వంటి సంస్థలను ఉపయోగించుకుని లాబీయింగ్ నిర్వహించడం ఒక ఎత్తు అయితే, ఆగ్రో డీలర్ల నెట్‌వర్కును ఉపయోగించుకుని ఆయా దేశాల్లోకి చొచ్చుకుపోవడం మరో ఎత్తు. మోన్‌శాంటో( ఇది ప్రస్తుతం జర్మన్ రసాయన కంపెనీ బేయర్‌తో విలీనానికి యత్నిస్తోంది) తన విత్తనాలను, హెర్బిసైడ్ల అమ్మకాలను ఈ ప్రాంతమంతటికీ విస్తరించినట్లు మలావిలోని ఆ కంపెనీ మేనేజరు చెప్పారు.

అధిక దిగుబడులకు భరోసా ఇచ్చే హైబ్రిడ్ విత్తనాలను ఆఫ్రికాలో ఎజిఆర్ఎ ద్వారా మోన్ శాంటో సరఫరా చేస్తున్నది. ఈ విత్తనాలు కావాలనుకున్న రైతులు విత్తనాలతో బాటు, నిర్దిష్ట పరిమాణంలో ఆ కంపెనీల రసాయనిక ఎరువులు, మందులు కూడా తప్పనిసరిగా కొనుగోలు చేయాలని షరతు పెట్టింది. ఆగ్రో డీలర్లు విక్రయించే రసాయనిక ఎరువుల్లో 67 శాతం దాకా రైతులు ఈ విధంగా కొనుగోలు చేస్తున్నవే. దీనివల్ల అంతిమంగా లబ్ధి పొందేది మోన్‌శాంటో లాంటి బడా కంపెనీలే. 2007–2010 మధ్య మూడేళ్ల కాలానికి ఆగ్రోడీలర్లు 10,908 టన్నుల విత్తనాలు, 18.071 టన్నుల రసాయనిక ఎరువులను విక్రయించారు. వాటి అమ్మకాలు ఒక్కసారిగా 85 శాతం పెరిగిపోవ డానికి ఈ నిబంధనే కారణమని గ్లోబల్ జస్టిస్ నౌ నివేదిక వెల్లడించింది.

ఈ అమ్మకాల ద్వారా ఎక్కువగా లబ్ధి పొందిన మోన్‌శాంటో కంపెనీలో 2.3 కోట్ల డాలర్ల విలువైన 5లక్షల షేర్లను గేట్స్ ఫౌండేషన్ 2010లో కొనుగోలు చేసింది. 2011 చివరి నాటికి ఫౌండేషన్ తన మోన్‌శాంటో షేర్లను అమ్మేసినట్లు వారెన్ బఫెట్ గత ఏడాది వెల్లడిం చాడు. అదే సమయంలో గేట్స్ ఫౌండేషన్ ట్రస్ట్ 6 కోట్ల షేర్లను కలిగివున్న బఫెట్ బెర్క్‌షైర్ హతావే కంపెనీ 84.6 కోట్ల డాలర్ల విలువైన 80 లక్షలమోన్‌శాంటో షేర్లను చేజిక్కించుకుంది.

ఫౌండేషన్‌కి, మోన్‌శాంటోకి మధ్య పెన వేసుకున్న ప్రయోజనాలు కేవలం ఆ కంపెనీలో ఫౌండేషన్ ఆర్థిక వాటాలకే పరిమితం కాదు. ప్రపంచ ఔషధ సంస్థ జిఎస్‌కె విషయంలో

సాధా రణ సిబ్బంది వరకు ఈ పొత్తు విస్తరిం చింది. గతంలో మోన్‌శాంటోలో అంతర్జాతీయ అభి వృద్ధి భాగస్వామ్య నాయకుడిగా వున్న రాబ్ హర్ష్ గేట్స్ ఫౌండేషన్ వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి బృందం డిప్యూటీ డైరక్టర్‌గా 2006లో నియమించబడి ఇప్పటికీ ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నాడు.

మోన్‌శాంటోలో పనిచేయడానికి ముందు యూనియన్ కార్బైడ్ అండ్ డౌ ఆగ్రో సైన్సెస్‌తో సంబంధం కలిగివున్న శామ్‌డ్రైడెన్‌ను గేట్స్ ఫౌండేషన్ వ్యవసాయ అభివృద్ధి డైరక్టర్‌గా నియమించబడ్డాడు. 2009 అక్టోబరులో డ్రైడెన్ చేసిన బయోటెక్ అనుకూల ప్రసంగానికి మెచ్చి ఆయన్ని ఈ పదవితో ఫౌండేషన్ సత్కరించింది. ఆ ప్రసంగంలో డ్రైడెన్, 'అమెరికా తరహా పేటెంట్ కవచాన్ని, మోన్‌శాంటో లాంటి అతి పెద్ద, అతి శక్తివంతమైన రసాయనిక –జీవ సాంకేతిక సంస్థలను, ఆఫ్రికా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు అవి సూచించిన 'సత్వర పరిష్కారాలను' పదే పదే పొగిడాడు. మరో వైపు ఆయన ప్రసంగంపై విమర్శలు వెల్లువెత్తాయి. మోన్‌శాంటో, ఈ తరహాకే చెందిన మరి కొన్ని కంపెనీలు పేద రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి పెద్దయెత్తున లాభాలు పోగేసుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ కంపెనీలు తమ విత్తనాల పైన, ఎరువులపైన ఆధారపడక తప్పని పరిస్థితికి పేద రైతులను ఎలా నెడుతున్నదీ, తద్వారా లాభాలు ఎలా పిండుకుంటున్నదీ గార్డియన్ పత్రిక వ్యాసం సవివరంగా తెలిపింది. డ్రైడెన్ గురించి ఆ పత్రిక ప్రస్తావిస్తూ, బహుశా నేటి ప్రపంచ వ్యవసాయంలో 'అత్యంత శక్తివంత మైన వ్యక్తి' ఈయనే కావచ్చు అని వ్యాఖ్యానించింది.

**"మోన్‌శాంటో, ఈ తరహాకే చెందిన మరి కొన్ని కంపెనీలు పేద రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి పెద్ద యెత్తున లాభాలు పోగేసుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ కంపెనీలు తమ విత్తనాల పైన, ఎరువులపైన ఆధారపడక తప్పని పరిస్థితికి పేద రైతులను ఎలా నెడుతున్నదీ, తద్వారా లాభాలు ఎలా పిండుకుంటున్నదీ గార్డియన్ పత్రిక వ్యాసం సవివరంగా తెలిపింది."**

ఈ అంశం గురించి ఇంతగా ఎందుకు నొక్కి చెప్పాల్సి వస్తుందంటే గేట్స్ ఫౌండేషన్ అనేది మామూలు దాతృత్వ సంస్థల్లాంటిది కాదు. ప్రపంచ ఆరోగ్య, వ్యవసాయ రంగాలపై బహుళజాతి సంస్థలకు గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టే ఒక సాధనంగా ఇది వ్యవహరిస్తున్నది. కొద్ది సంఖ్యలో వున్న ఈ రాకాసి సంస్థలను వర్ధ మాన దేశాల్లోకి అనుమతిస్తే, దీనివల్ల తక్షణం వచ్చే నష్టం అంతగా వుండకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో వర్ధమాన దేశాలు దీనికి భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆరోగ్యం, వ్యవసాయ రంగాలపై ఈ బడా కంపెనీల గుత్తాధిపత్యం పూర్తయిన తరువాత వీటికి మూల్యం చెల్లించుకోలేక పేద దేశాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ❋

# ప్రభుత్వ బ్యాంకులపై నయా ఉదారవాద దాడి

(15వ పేజీ తరువాయి)

సంవత్సరాలకు ముందునుండి పనిచేస్తున్నాయి. అయినా అవి మార్కెట్‌లో నాలుగో వంతులోపు భాగస్వామ్యాన్నే సాధించాయి. 2008 సంక్షోభా నికి ముందు 25 శాతానికి చేరిన వారి వాటా ఆ తర్వాత కొద్దిమేరకు తగ్గింది. ముఖ్యంగా పెట్టుబడిదారులు ప్రైవేటు బ్యాంకులలోని తమ డిపాజిట్లను ఉపసంహరించి, ప్రభుత్వ బ్యాంకులలో పెట్టటం ఇందుకు ప్రధాన కారణం. ఇది పెట్టుబడిదారుల ద్వంద్వ స్వభావాన్ని వెల్లడి చేస్తున్నది. తమ డబ్బు ప్రభుత్వబ్యాంకులలో భద్రంగా ఉండాలి! ప్రజల సొమ్మైతే ప్రైవేటు బ్యాంకులలో డిపాజిట్ చేయించి తేరగా కాజే యాలి! ఇదీ పెట్టుబడిదారుల ప్రైవేటీకరణ తర్కం!

బ్యాంకులు తిరిగి ప్రైవేటు యాజమాన్యం చేతుల్లోకి వెళితే అన్ని రంగాలు క్షీణదశకు చేర తాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సకాలంలో రుణాలందవు. వ్యవసాయ రంగం లోని చిన్న రైతులు, కౌలురైతులు, తదితరులు రుణాలు పొందలేరు. వృత్తులు, వ్యాపారాలు నిర్వహించుకొంటున్న, స్వయం ఉపాధి పొందు తున్న వారికి ప్రైవేటు బ్యాంకులలో రుణాలు దొరకవు. కాబట్టి ఆ రంగాలు క్రమంగా కుంచిం చుకుపోతాయి. వీటితో పాటు సరళీకరణ విధా నాల లక్ష్యం ఆర్థికవ్యవస్థపై గుత్తపెట్టుబడి, ద్రవ్య పెట్టుబడులు ఆధిపత్యం సంపాదించటం కోసం రూపొందించబడినవి. మనదేశ ఆర్థికవ్యవస్థపై ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం సాధించటానికి ప్రభు త్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ఆటంకంగా ఉన్నాయి. అవి ప్రైవేటు యాజమాన్యంలోకి వెళితే ఆర్థికవ్యవస్థ వారి అదుపాజ్ఞలలోకి వెళుతుంది. వారు వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, చేతివృత్తులు, స్వయం ఉపాధి తదితర రంగాలకు రుణాలివ్వరు. సకాలంలో రుణాలందకపోతే ఈ వృత్తులు, వ్యాపారాలు బతికి బట్టకట్టలేవు. ఇవి క్రమంగా దివాళాతీస్తాయి. వ్యవసాయ రంగంలో చిన్న, మధ్యతరగతి రైతులు మిగలరు. ఈ విధంగా కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాలు సంక్షోభంలో చిక్కుకుంటాయి. వాటిపై ఆధారపడిన కోట్లాది మంది నిరుద్యోగులౌతారు. కోట్లమంది ఉపాధిని, ఆదాయాలను కోల్పో వటంతో దేశీయ మార్కెట్ కుదించుకుపోతుంది. ఇది చైన్ రియాక్షన్ లాగా అన్ని రంగాలపైనా ప్రభావం చూపుతుంది. ఆర్థికవ్యవస్థను దీర్ఘకాల సంక్షోభంలోకి నెడుతుంది. ఇటువంటి ఫలితాలకు దారితీసి, దేశార్థికవ్యవస్థను ధ్వంసం చేసే బ్యాంకుల ప్రైవేటీకరణను బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారం ముందుకు తీసుకువస్తున్నది. దేశభక్తిని గురించి నిత్యం పాఠాలు బోధించే బిజెపి దేశ ఆర్థికవ్యవస్థను ధ్వంసం చేసే ప్రభుత్వ రంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థల ప్రైవేటీకరణకు పరుగులు పెడుతున్నది ఇదీ బిజెపి దేశభక్తి! బ్యాంకుల ప్రైవేటీకరణలోని ప్రమాదాన్ని గమ నించి, బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టటానికి ప్రజలు ముదుకురావాలి. ❋

# కార్పొరేట్ కనుసన్నల్లో ప్రజారోగ్యం

టికె రాజలక్ష్మి



రచయిత్రి ప్రముఖ పాత్రికేయురాలు

ఔషధ ధరలను శాసిస్తూ, రోగుల నుండి మితిమీరి బిల్లులు వసూలు చేసే ప్రైవేటు ఆసుపత్రులను నియంత్రించడానికి చిత్తశుద్ధితో పనిచేసిన "జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ" (ఎన్‌పిపిఎ) ఛైర్మన్ భూపేంద్రసింగ్‌ను కేంద్రం బదిలీ చేయడం, మందుల ధరల అతిక్రమణను అరికడతామని ప్రధాని చెప్పే మాటలను ప్రశ్నార్థకం చేశాయి.

మార్చి మొదటివారంలో, కేబినెట్ నియామక కమిటీ గుట్టు చప్పుడు కాకుండా కొన్ని బదిలీలను చేసింది. అవి సర్వసాధారణమైనవని అనుకోవచ్చు. కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన విషయమేమిటంటే, జాతీయ ఔషధ ధరల సంస్థ (ఎన్‌పిపిఎ) ఛైర్మన్ భూపేంద్రసింగ్‌ణు, జాతీయ రసాయనికి ఆయుధాల సంస్థకు అదనపు కార్యదర్శిగా బాధ్యతలు కేటాయిస్తూ బదిలీ చేయడం జరిగింది. నమూనా పరిస్థితులలోనైతే ఇది సాధారణమైనదిగా పరిగణించబడేది. కానీ జాతీయ ఔషధ ధరల నియంత్రణా సంస్థ, మందుల ధరలను నియంత్రించే విషయంలో, అధిక ధరలను రద్దుచేసే విషయంలో బెదిరింపులను ఎదుర్కొంటున్నది. దాని ఛైర్మన్ భూపేంద్రసింగ్ కూడా అనేక హెచ్చరికలను ఎదుర్కొవడంతో ఇది సర్వసాధారణంగా జరిగే బదిలీ కాదు అని స్పష్టమైంది.

భారతీయ జనతాపార్టీ (బిజెపి) నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, అనేక సందర్భాలలో మందుల ధరలను గుండెకు వేసే స్టంట్ లాంటి వైద్య పరికరాల ధరలను నియంత్రిస్తామని, దానికి కట్టుబడి ఉన్నామని అనేక సందర్భాలలో ప్రకటించింది. అయితే ఈ ప్రకటనలకు భిన్నంగా ఎవరైతే తన హయాంలో మందుల ధరలను నియంత్రించడంతో పాటు, పెనాల్టి రూపంలో కోట్ల రూపాయలను వసూలు చేసి ఔషధాల ధరలను విపరీతంగా పెంచి అమ్మిన ఔషధ కంపెనీలను నియంత్రణలో పెట్టడానికి స్పష్టమైన విధివిధినాలను అనుసరించిన ఔషధ ధరల నియంత్రణ సంస్థ ఛైర్మన్‌ను మాత్రం బదిలీ చేయడానికి అనుమతించారు.

జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పిపిఎ), జాతీయ అత్యవసర మందుల జాబితా 2015 క్రింద (ఎన్‌ఎల్‌ఇఎమ్), 871 రకాల అత్యవసర ఔషధాలు, విడిధరలతో అమ్మబడే 642 రకాల ఔషధాలతో కలుపుకొని తయారీదారులు వాటిని "కొత్త ఔషధాలు"గా వర్గీకరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, అత్యవసర మందుల ధరల నియంత్రణ గురించి గొప్ప 'వాగాడంబరం'గా చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వం "దాచిపెట్టబడిన" గుండెకు ఉపయోగించే స్టంట్స్, మోకాలిలో అమర్చే పరికరాల ధరల గురించి ఆకస్మికదాడులు ఎలా చేస్తారో ప్రకటనల రూపంలో ప్రారంభించారు తప్ప ఆచరణలో ఏమీ లేదు.

ఈ సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో ఒక అతిపెద్ద ప్రకటన ఏమంటే 'జాతీయ ఆరోగ్య భద్రతాపథకం' క్రింద 10 కోట్ల కుటుంబాలకు 5 లక్షల రూపాయల వరకు బీమాను వర్తింపచేస్తామని ప్రకటించడంపై విషయాన్ని మళ్లీ గుర్తుకు తెస్తుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమింటే ప్రభుత్వం చెప్పే గణాంకాలకు భిన్నంగా ఆకాశానంటుతున్న, వైద్య ఖర్చుల నుంచి, రోగులు భద్రతను కోరుకోవడం.

ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులు 2013, షెడ్యూలు 1 క్రింద ఉన్న మందుల జాబితాను విస్తరించేదానికి బదులు దానిని రహస్యంగా ఉంచడం, ఆ విధంగా మందులను వినియోగించే మందులు, విధానాలు ఆసుపత్రిలో చేరిన రోగులకు, ఏ విధ:గా బిల్లులు వసూలు చేస్తారో అదే విధంగా బయటి ఉండి చూపించుకునే రోగులకు కూడా వసూలు చేయడం, వైద్యాన్ని పూర్తిగా ప్రైవేటు రంగంలో ఉంచడం, జాతీయ ఆరోగ్య భద్రతా పథకం (ఎన్‌హెచ్‌పిఎస్) యొక్క కొత్త రూపమైన "రాష్ట్రీయ స్వాస్థ్య బీమాయోజన" పథకాన్ని జాతీయ స్థాయిలో కనీసం ప్రాథమిక సమీక్ష కూడా చేయకుండా ప్రభుత్వం బీమా కవరేజీతో ఈ పథకాన్ని ప్రారంభించడం ప్రమాదకరం. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పిపిఎ) గుండెకు ఉపయోగించే స్టంట్‌ల ధరలను హేతుబద్ధీకరణ చేసినప్పటినుంచి, ధరల నియంత్రణను ముఖ్యాంశాలుగా చేసింది. డెంగ్యూ, ఇతర జబ్బులకు వైద్యం చేసే దాంట్లో జాతీయ రాజధాని ప్రాంతంలో నాలుగు ప్రముఖ ఆసుపత్రులు అధికధరలను వసూలు చేయడం తాజాగా జరిగిన దానికి ఒక మంచి ఉదాహరణగా ఉంది.

**ఫోర్టిస్ కేసు**

గురుగ్రాంలోని ఫోర్టిస్ స్మారక పరిశోధన సంస్థలో ఏడు సంవత్సరాల ఆద్యసింగ్ మరణించడం జరిగింది. గత సంవత్సరం ఈ సంఘటన తరువాత కేంద్రప్రభుత్వం తక్షణం ఆరోగ్యశాఖ కార్యదర్శి ద్వారా, అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులకు ఖచ్చితమైన చికిత్సా పద్ధతులను పాటించాలని, అధికధరలను వసూలు చేయడం లాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలని లేఖలు పంపింది.

ఈ లేఖ వైద్య, పరిశోధక వ్యవస్థలను (రిజిస్ట్రేషన్, నియంత్రణ) అప్రమత్తం చేసింది. 2010 ఆసుపత్రుల నియంత్రణ చట్టాన్ని క్రియాశీలకం చేసింది. ఇందులో మోసపూరితమైన, అనైతికమైన పనులకు పాల్పడే ఆరోగ్య రక్షణా వ్యవస్థల మీద చర్య తీసుకోవడం జరుగుతుందని ఉంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని వైద్య, ఔషధ ధరల నియంత్రణకు చిత్తశుద్ధితో ఉపయోగించాలని ఈ లేఖ రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపింది. కేవలం రాష్ట్రాలు ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే ఈ చట్టాన్ని అమ

లు చేసినాయి. ఈ చట్టంలో ఉన్న ముఖ్యాం శాలలో ఒకటేమింటటే, ఆ సంస్థ యొక్క స్థాపన పూర్తి వివరాలు, ఫీజులు (బిల్లులు), వివిధ పరీక్షలను వసూలు చేసే బిల్లుల వివరాలను స్పష్టంగా ముఖ్యమైన ప్రదేశంలో ప్రదర్శించాలి. ఫోర్టిస్ కేసు అనేది వరుస సంఘటనల ప్రభావం గా బయటకు వచ్చినటువంటిది. ఇతర మిగిలిన పెద్ద ఆసుపత్రుల నుంచి కూడా అధికధరలను వసూలు చేసే ఉదాహరణలు అనేకం ఫిర్యాదు చేయబడ్డాయి. జాతీయ ఔషధధరల నియంత్రణా సంస్థ అధిక ధరలను వసూలు చేస్తున్నారని రోగుల బంధువుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన తరువాత, 2013 ఔషధధరల నియంత్రణా ఉత్తర్వుల క్రింద తప్పనిసరి చర్యలను తీసుకుంది. ఆ విధంగా అధిక ధరలను వసూలు చేసిన జాతీయ రాజధాని ప్రాంతానికి చెందిన నాలుగు ప్రధాన ఆసుపత్రుల బిల్లుల వివరాలను ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసింది. ఆ నాలుగింటిలో మూడు గోప్యతను అభ్యర్థించినాయి. ఏదైతే జాతీయ ఔషధధరల నియంత్రణామండలి ఫిర్యాదు చేసిందో దానిని ప్రజాప్రయోజనాల రీత్యా విధిగా చేయవలసి ఉన్నప్పటికీ అలా చేయలేదు.

ఆ నాలుగు ఆసుపత్రుల బిల్లుల వివరాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. జాతీయ అత్యవసర మందుల జాబితా, మందుల నియంత్రణా ఉత్తర్వులకు విరుద్ధంగా పెద్ద మొత్తంలో బిల్లులను వేశారు. ఆ విధంగా మందులు, ఔషధాల జాబితాను విస్తరించడం అత్యవసరం వినియోగదారీ మందులు, వైద్యపరికరాలు, వైద్యవిధానాలు, రోగ నిర్ధారణ సేవలు జాతీయ అత్యవసర మందుల జాబితా క్రింద, మరీ ముఖ్యంగా ధరల నియంత్రణ క్రింద అన్నిరకాల మందులలాగా కాకుండా, జాతీయ అత్యవసరమందుల జాబితాను అధిక ధరల నుంచి నియంత్రించాలి.

వాస్తవానికి అత్యవసర వస్తువుల చట్టం 1955, సెక్షన్‌కి ఔషధధరల నియంత్రణా ఉత్తర్వులను సవరించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. ఔషధాలను, తయారీ విధానాలను కలుపుకొని ఇప్పటివరకు ధరల నియంత్రణ నుంచి మినహాయింపు నిచ్చింది. 2016 డిసెంబర్‌లో జాతీయ ఔషధ ధరల నియంత్రణా సంస్థ ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖచేతగుండె స్టంట్‌లను ఔషధధరల నియంత్రణా ఉత్తర్వులు 2013 క్రింద కలపాలని అజ్ఞాపించ బడింది. ఇది ఎన్‌పిపిఎ, ఫిర్యాదులు, ప్రాతి నిధ్యాలలో జోక్యం చేసుకోవడం ప్రారంభించిన తరువాత, ప్రత్యేకించి స్టంట్‌లను

**❝ఆ విధంగా అధిక ధరలను వసూలు చేసిన జాతీయ రాజధాని ప్రాంతానికి చెందిన నాలుగు ప్రధాన ఆసుపత్రుల బిల్లుల వివరాలను ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసింది. ఆ నాలుగింటిలో మూడు గోప్యతను అభ్యర్థించినాయి. ఏదైతే జాతీయ ఔషధధరల నియంత్రణామండలి ఫిర్యాదు చేసిందో దానిని ప్రజాప్రయోజనాలరీత్యా విధిగా చేయవలసి ఉన్నప్పటికీ అలా చేయలేదు.❞**



**ఇన్‌పేషంట్లకు అక్రమ ఛార్జీలు వసూలుచేసి నిషేధానికి గురైన ఫోర్టీస్ హాస్పటల్**

అధికధరలకు అమ్మడం అనేదాని దగ్గర మొదలైంది. గుజరాత్ ఎన్నికలకు ముందు సూరత్‌లో జరిగిన సమావేశంలో మోడీ తనకుతాను స్వయంగా గుండె సంబంధ స్టంట్‌లను ధరలను తగ్గిస్తామని, పేదరోగులను బలవంతంగా అధికధరలను వసూలు చేసే దాని నుండి కాపాడతారుమని ప్రకటించారు. ఏది ఏమైనా అది కేవలం మంచు గడ్డ లాంటి వాగ్ధానం. ఎందుకంటే అధీకృతం కాని తయారీ విధానాలు, మందుల ధరలు సాధారణంగా వసూలు చేస్తున్న అధికధరలుగానే ఉండడం మనం చూడవచ్చు. ఆసుపత్రిలో చేరిన రోగులు లేదా బయటిరోగులు కానీ ఆందోళన, నిరాశకు గురవుతున్నారు.

**జాతీయ ఔషధధరల నిర్ధారణ సంస్థ విశ్లేషణ:**

ఆ నాలుగు ఆసుపత్రుల చేత సమర్పించబడిన బిల్లులను జాతీయ ఔషధ ధరల నిర్ధారణ సంస్థ విశ్లేషించింది. ఏవైతే ఫిబ్రవరి20న వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయో వాటి వివరాల ప్రకారం గుండె సంబంధిత స్టంట్‌లకు సంబంధించిన సమస్య కేవలం స్థానిక లేక దిగుమతి చేసుకున్న అనేదానితోనే కాకుండా మరోచోట కూడా ఉంది అని అర్థమైంది.

జాబితాలో ఉన్న మందులు, మందుల తయారీ పద్ధతులు నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి (జాతీయ అత్యవసర మందుల జాబితా 2015 ప్రకారం, ధరల నియంత్రణ క్రింద ఉన్నవి, ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులు 2013 జాబితాలోకి చేర్చబడినవి), 25.67 శాతం జాబితాలోని మందుల తయారీ పద్ధతులతో పోల్చినప్పుడు కేవలం 4.1 శాతం మాత్రమే మొత్తం చికిత్సా విధానంలో ఉపయోగిస్తున్నట్లు లెక్క తేల్చబడింది. (ధర నియంత్రణకు బయట ఉన్నవి) సర్జరీకి ఉపయోగించే గ్లౌజులు, మాస్కుల లాంటి వినియోగదారీ వస్తువులు, షెడ్యూలు1 క్రింద పరిగణనలోకి రానివి, ఔషధధరల నియంత్రణ ఉత్తర్వులు, ఏవైతే ధరల నియంత్రణ క్రిందకు రాలేదో అవి 9.6 శాతంగానూ, రోగనిర్ధారణా సేవలు 15.56 శాతంగానూ మొత్తం ధరల్లో ఉన్నవి.

వినియోగదారీ వస్తువుల మీద మొత్తంగా పదోవంతు ధరగా ఉన్నది, అలాగే జాబితాలోని లేదా అత్యావసర మందులపై ఖర్చు రెండు రెట్లుగా ఉన్నది. వినియోగదారీ వస్తువులు అనేవి ఏ రకమైన ధర నియంత్రణ క్రిందా లేవు, లేదా అవి గరిష్ట చిల్లరధర నిబంధన నియంత్రణలో ఉన్నాయా, ఎందుకంటే అవి మందులలాగా,

> **" మరో అతిపెద్ద అక్రమంగా చెప్పబడిన విషయ మేమిటంటే ఆసుపత్రులు తమసొంత ఫార్మసీలనుంచే సంస్థాగతంగా పెద్ద మొత్తంలో మందులను కొనుగోలు చేయడం, ఇదివారికి గరిష్ట చిల్లరధరకు ఉల్లంఘిం చాల్సిన అవసరం లేకుండానే మందులు పరికరాలపై పరిమితికి మించి అత్యధిక లాభాలను సులభంగా తెచ్చు కునే విధంగా తయారైంది. "**

మందులు, సౌందర్య లేపనాల చట్టం క్రింద రిజిష్టర్ కాలేదు. కాబట్టి, ఆ విజ్ఞాపనపత్రం ఇలా ప్రకటించింది. "గరిష్ట చిల్లరధర (ఎమ్ఆర్‌పి)ను పర్యవేక్షించడం లేదా ఈ రకమైన ఉపయోగించి పారవేసే వస్తువులను అసాధారణ పరిస్థితుల్లో ప్రజాప్రయోజనాలను రక్షించడం కోసం ధరల నియంత్రణాచట్టం కిందకు తేవలసి ఉంటుంది".

జాబితాలో లేని పరికరాలు, ఉపయోగించి పారవేసే సిరంజిలు, సెలైన్ లేదా ఇంజక్షన్ ఎక్కించడానికి ఉపయోగించే పరికరాలు మొత్తం ధరలో 1.52 శాతంగా ఉన్నది. జాబితాలో లేని తయారీ పద్ధతులు, వినియోగదారీ (లేదా) జాబితాలో లేని పరికరాలు, నిర్ధారణ సేవలను కూడా కలుపుకోని నియంత్రించబడిన మందుల జాబితాలో కూడా లేని మొత్తం కలిసి దాదాపు 36.7 శాతంగా మొత్తం ఖర్చులో నిర్ధారించబడింది.

జాతీయ ఔషధధరల నియంత్రణా సంస్థ తనిఖీ కోసం అక్కడక్కడా తీసిన సమాచారం మొత్తం ఖర్చులలో రోగనిర్ధారణా సేవలు 15 శాతంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ ధరలు ఇతర స్వతంత్రంగా నడపబడుతున్న ప్రైవేటు కేంద్రాలలో కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి.

ఈ నాలుగు ఆసుపత్రులకు సంబంధించిన సంఘటనలను ఎన్‌పిపిఎ లోతుగా అధ్యయనం చేసిన తరువాత ద్రవ్యోల్బణ గరిష్ట చిల్లరధర వల్ల మందులు, పరికరాల తయారీ దారుల కంటే ఆసుపత్రులే లాభాల్లో ప్రధాన లబ్ధిదారులుగా ఉన్నాయని తేలింది.

"చికిత్స కోసం ఉపయోగించిన జాబితాలో ఉన్న మొత్తం మందుల ధర కేవలం 4.10 శాతం కాగా, జాబితాలో లేని తయారీ పద్ధతుల ఖర్చు 25. 67 ఉన్నదని" ఎన్‌పిపిఎ తన అధ్యయన పత్రంలో వెల్లడించింది. ఇది గమనించండి". అత్యధిక లాభాలను కోరుకుంటున్నారనేది స్పష్టంగా వెల్లడవుతుంది. ఎలా అంటే డాక్టర్లు, ఆసుపత్రులు జాతీయ అత్యవసర మందుల జాబితాలో చెప్పబడిన మందులకు బదులు, జాబితాలో లేని బ్రాండెడ్ మందులను ఉపయోగించడానికి ప్రాధాన్యతనిస్తున్నారు." దీనిని బట్టి ఆసుపత్రులు అత్యధిక లాభాలకు ప్రాధాన్యతనిస్తున్నాయని అర్థం అవుతుంది.

జాబితాలో లేని పరికరాలలో లాభాల పరిమితి "అత్యధికంగా ఉండడమే కాక, విఫలమైన విపణి వ్యవస్థలో అనైతికంగా లాభాలను పొందే పరిస్థితికి ఉదాహరణగా చెప్పవచ్చు".ఆ విజ్ఞానపత్రం "విధానాలలో జోక్యానికి" పిలుపునిచ్చింది. దీనిని వ్యవస్థీకరించేపనిని ప్రభుత్వానికి అప్పగించమని చెప్పింది.

మందుల తయారీదారులు భిన్నమైన రూపాలను తయారుచేస్తున్నట్లు ఎన్‌పిపిఎ గమనించింది. ఆ మందుల జాతీయ అత్యవసర మందుల జాబితాలో ఇప్పటికే ఉన్నాయి. వాటిని నియంత్రణ లేని ధరలకు బయటకు తెచ్చి, "నూతన మందులు"గా వర్గీకరించడం చేశారు. లేదా స్థిరమైన మోతాదు కలయిక గా చెబుతున్నారు. "తయారీలో ప్రాధాన్యతా అవకాశం, వైద్య సౌభ్రాతృత్వము అవసరమైన జాబితా, జాతీయ అవసరమైన మందుల జాబితా క్రింద తయారు చేయాలనే దానిని నీరుగార్చే విధంగా అవకాశాన్ని ఉపయోగించుకోవడం కనిపిస్తుంది. ఇది మందుల తయారీదారులు భిన్నమైన మోతాదు లేదా రూపం పేరుతో నియంత్రణ ధరలకు బయట అనుమతించబడిన గరిష్ట చిల్లరధరకు 12 శాతం లాభం కలుపుకొని ప్రతి సంవత్సరం మందుల ధరలను పెంచుతున్నట్లుగా" ఎన్‌పిపిఎ చెప్పింది.

జాతీయ ఔషధ ధరల నియంత్రణా సంస్థ గమనించినదేమంటే ఈ దేశంలో అఖిలభారత ఔషధ ధరల నియంత్రణా కమిటి లాంటి ప్రజారోగ్య సంస్థలు సుదీర్ఘకాలం నుంచి పోరాటం చేస్తున్న అలాగే అనేక సంవత్సరాల నుంచి ప్రస్తుతం సుప్రీంకోర్టులో పోరాడుతున్న మార్కెట్ మందుల ధరలను నిర్ణయించుకోవడంలో ఆధారిత విధానానికి బదులు, ధరల ఆధారిత విధానాన్ని అమలు చేయాలనేది, ప్రధానమైన అంశం. అందువల్ల ఇలాంటి సమయంలో జాతీయ ఔషధ ధరల నిర్ణాయక సంస్థ చైర్మన్‌ను సరైన కారణం చూపకుండా బదిలీ చేయడం ఆందోళన కల్గిస్తున్నది.

జాబితాలో లేని మందులు, తయారీ విధానాల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెంచబడ్డాయి. జాతీయ అత్యవసర మందుల జాబితా 2015లో ఇవి దాదాపు రెట్టింపు చేయబడ్డాయి. "జాబితాలో నుంచి జాబితాలో లేని కేటగిరీలోకి మార్చబడటం అనేది అత్యవసర మందుల జాబితా నుంచి అత్యవసరం కాని మందుల జాబితా పెరగడం 2017లో ప్రతిబింబించింది. అత్యవసర కాని మందుల జాబితాలోని మందులు, అవసరమైన మందుల జాబితాలోని మందులతో పోల్చినప్పుడు రెట్టింపు అయినాయి." అని జాతీయ ఔషధాల నిర్ణాయక సంస్థ తనని నివేదికలో ప్రకటించింది.

**పెద్దమొత్తంలో కొనుగోళ్లు**

మరో అతిపెద్ద అక్రమంగా చెప్పబడిన విషయమేమిటంటే ఆసుపత్రులు తమసొంత ఫార్మసీలనుంచే సంస్థాగతంగా పెద్ద మొత్తంలో మందులను కొనుగోలు చేయడం, ఇదివారికి గరిష్ట చిల్లరధరకు ఉల్లంఘించాల్సిన అవసరం లేకుండానే మందులు పరికరాలపై పరిమితికి మించి అత్యధిక లాభాలను సులభంగా తెచ్చుకునే విధంగా తయారైంది. అక్రమంలోనే పెద్దమొత్తంలో సరఫరా ఉత్తర్వులను పొందడం ద్వారా ఆ పరిశ్రమ అత్యధిక గరిష్ట చిల్లరధరను ముద్రించేవిధంగా, మార్కెట్‌కు కావలసిన దాని కనుగుణంగా 'ఒత్తిడి' చేయబడడం జరిగింది.

మందులు, పరికరాలు వినియోగించి పారేసే వాటిలో అత్యధికభాగం ఆసుపత్రులే తమ సొంత ఇంట్లో ఉన్న ఫార్మసీల నుండే అమ్మకాలు చేయడం జరుగుతుంది. బయట కొంత తక్కువ ధరకు లభించే చోట్ల నుంచి కొనుగోలు చేయడానికి రోగులకు ఎటువంటి అవకాశం ఆసుపత్రులు ఇవ్వట్లేదు అని ఎన్‌పిపిఎ తన నివేదికలో స్పష్టపరిచింది.

చివరికి జాబితాలో ఉన్న మందుల విషయంలో కూడా, ఏవైతే ధరల నియంత్రణలో ఉన్నామో అవి కూడా, సేకరణ ధరల పరిమితి 290 శాతం నుండి 357 శాతం వరకు ఉంటుంది. ఇక జాబితాలో లేని మందుల విషయంలో అయితే అత్యధికంగా, అసాధారణంగా 500 శాతం నుంచి 1293 శాతం వరకు ఎక్కువనకు అమ్మడం జరుగుతుంది.

**అనువాదం : కె. నాగమల్లేశ్వరరావు**

# కాలజ్ఞాని, విశ్వ విజ్ఞాని

(2వ పేజీ తరువాయి)

ప్లాంక్ ప్రతిపాదించాడు. సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని అల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రతిపాదించాడు. ఇది స్థూల ప్రపంచం అంటే నక్షత్రాలు, గెలాక్సీలతో కూడిన విశ్వ నిర్మాణం గురించి వివరిస్తుంది.

అప్పటి వరకు శాస్త్రవేత్తలకు ఎదురైన సమస్య ఏమంటే సూక్ష్మ ప్రపంచాన్ని వివరించే క్వాంటమ్ సిద్ధాంతం విశ్వాన్ని గురించి వివరించడానికి ఉపయోగపడదు. అక్కడ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ఉపయోగించాలి. కానీ విశ్వాన్ని గురించి వివరించే ఈ సిద్ధాంతం పరమాణు నిర్మాణాన్ని వివరించడానికి ఉపయోగపడదు. కానీ పరమాణువు (ఆటమ్) నుండి విశ్వంలోని గెలాక్సీల వరకు అంతా నిర్మితమైంది పదార్థం తోనే. కాబట్టి ఈ రెంటికీ అంటే పదార్థం మొత్తానికి వర్తించే సిద్ధాంతం రూపొందాలంటే క్వాంటమ్, సాపేక్ష సిద్ధాంతాల మధ్య సమన్వయం సాధించాల్సి వచ్చింది. ఆ పనిని హాకింగ్ తన పరిశోధనల ద్వారా నిర్వహించాడు.

హాకింగ్ తాను రాసిన పుస్తకం "ది గ్రాండ్ డిజైన్"లో విశ్వసృష్టికి సంబంధించి తుది సమాధానం చెప్పాడు. తుది సమాధానం అని ఎందుకంటున్నారంటే భౌతిక శాస్త్ర మౌలిక సూత్రాల్లోకి వెళ్లి ఆయన ఈ సమాధానాన్ని రాబట్టాడు. గతంలో హాకింగ్ రాసిన "కాలం సంక్షిప్త చరిత్ర" (ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్) లో ఈ విశ్వం నిర్మాణాన్నీ, నడకనూ వివరించగా ప్రస్తుత గ్రంథంలో విశ్వ ఆవిర్భావం ఎలా జరిగిందో చెప్పాడు. ఈ విశ్వాన్ని దేవుడు సృష్టించలేదు. మన విశ్వం ప్రకృతి సూత్రాలను అనుసరించి ఆవిర్భవించి, నడుస్తోంది అని హాకింగ్ చెప్పాడు. అయితే ఈ సూత్రాలు ఎక్కడి నుండి వచ్చాయి? అన్న ప్రశ్నకు వివరణ ఇచ్చాడు. భౌతిక శాస్త్రవేత్తలు పదార్ధ రూపాన్ని వివరించేందుకు రూపొందించిన ఎం-సిద్ధాంతమే ఈ ప్రాథమిక సూత్రమని ఆయన వివరించాడు. ఎం-సిద్ధాంతం ఈ విశ్వసృష్టికి కారణమైన అన్ని రకాల ప్రాథమిక కణాల, శక్తుల లక్షణాలను తెలియజేసే సూత్రం. విశ్వసృష్టి ఎలా జరిగిందో అది వివరిస్తుంది. అందుకే ఈ సిద్ధాంతాన్ని థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్ అంటున్నారు. ఇంతకీ ఏమిటీ ఎం-సిద్ధాంతం? దీని గురించి తెలుసుకోవాలంటే మనం విశ్వం పుట్టుక గురించితెలిపే 'మహా విస్ఫోటనం' (బిగ్‌బాంగ్) గురించి తెలుసుకోవాలి.



తల్లి బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు ఇసెబెల్‌తో హాకింగ్

### బిగ్ బాంగ్

విశ్వం పుట్టుక, దాని నిర్మాణం గురించి శాస్త్రవేత్తలు అనేక పరిశోధనల అనంతరం ఒక నమూనాను రూపొందించారు. దాని ప్రకారం... నేటికి 13,700 కోట్ల సంవత్సరాల క్రితం ఒక మహా విస్ఫోటనం (బిగ్ బాంగ్)తో పదార్థం, స్థలం, కాలం ఒకే సారి పుట్టాయి. అదే విశ్వం. పదార్థం, స్థలం, కాలం మూడూ ఒకటే. ఒకటి లేకుండా మరొకటి ఉండదు. కనుక మనం పదార్థం అంటే ఈ మూడింటితో కూడినదిగా అర్థం చేసుకోవాలి.

విస్ఫోటనం సంభవించిన 'మరుక్షణం'లో విశ్వం అత్యంత సాంద్రతతో, అత్యంత వేడిగా ఉండేది. కాని 'అతికొద్ది సమయం' లోనే అంటే 'సెకనులో కొన్ని కోట్ల వంతు సమయం'లోనే అది చల్లబడడం ప్రారంభించింది. అప్పుడు పదార్థం క్వార్క్‌లు, ఎలక్ట్రాన్లు అనే ప్రాథమిక కణాలుగా ఏర్పడింది. ఈ కణాలు విశ్వంలో పదార్థ నిర్మాణానికి ఇటుకలు వంటివి. క్వార్క్‌ల జీవిత కాలం సెకనులో కొన్ని కోట్ల వంతు మాత్రమే. అంత తక్కువ సమయంలోనే అవి ప్రోటాన్లు, న్యూట్రాన్లుగా మారిపోయాయి. ఈ ప్రోటాన్లు, న్యూట్రాన్లు కలిసి పరమాణు కేంద్రకాలుగా మారాయి. తరువాత పదార్థం మరింత విస్తరించి చల్లబడడం వల్ల పరమాణు కేంద్రకాలతో ఎలక్ట్రాన్లు కలిసి తొలి పర మాణువులు (ఆటమ్స్) ఏర్పడినాయి. పరమాణు వులు ఏర్పడ్డానికి 3,80,000 సంవత్సరాలు పట్టిందని అంచనా. ముందుగా హైడ్రోజన్, హీలియం వాయువుల పరమాణువులు ఏర్పడినాయి. అందుకే నేటికీ విశ్వంలో ఈ రెండు వాయువులే అధిక శాతంలో ఉన్నాయి.

మరో 16 లక్షల సంవత్సరాలు గడిచే సరికి ఈ వాయువులు ఒక్కోచోట పోగుపడి నక్షత్రాలు, గెలాక్సీలుగా ఏర్పడినాయి. దాంతో విశ్వ పదార్థంపై గురుత్వాకర్షణ శక్తి అదుపు ఏర్పడింది. నక్షత్ర కేంద్రాల్లో క్రమంగా మరింత బరువైన కర్బనం, ఆక్సిజన్, ఇనుము వంటి మూలకాల పరమాణువులు ఏర్పడ్డాయి. ఈ పరమాణువుల కలయిక వల్ల అణువులు ఏర్పడినాయి. కొన్ని నక్షత్రాల చుట్టూ తిరిగే గ్రహాల్లో ఇటువంటి పెద్దపెద్ద అణువుల నుండి జీవులు ఏర్పడినాయి. మనకు తెలిసి అటువంటి జీవులు అభివృద్ధి చెందిన గ్రహం భూమి మాత్రమే. ఈ జీవుల నుండి పరిణామ క్రమంలో ఆలోచనాపరులైన మానవులు ఏర్పడ్డారు. మానవులు విజ్ఞానవంతులై ఈ విశ్వాన్ని గురించి పరిశోధించడం ప్రారంభించారు.

### తెలియని పదార్థమే ఎక్కువ

ఇంతవరకు బాగానే ఉంది. కాని శాస్త్రవేత్తలకు అంతుబట్టని విషయం ఒకటి ఉంది. ఈ విశ్వాన్ని పరిశోధిస్తున్నప్పుడు మనం గ్రహించగలిగే పదార్థం అంతా కలిపితే...అంటే గ్రహాలూ, నక్షత్రాలూ, గెలాక్సీలు, వాటిమధ్య విస్తరించిన వాయుపదార్థం అంతా కలిపితే మొత్తం విశ్వపదార్థంలో 4 శాతం మాత్రమే ఉంది. మరి మిగిలిన 96 శాతం ఎక్కడుంది? మనకు తెలియదు. ఖగోళ భౌతిక శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం మనకు కనిపించని ఈ 96 శాతం పదార్థంలో 70 శాతం శక్తి రూపంలోనూ, 26 శాతం పదార్థ రూపంలోనూ ఉంది. ఈ అగోచర శక్తిని 'డార్క్ ఎనర్జీ' అన్నారు. అగోచర పదార్థాన్ని 'డార్క్ మేటర్' అన్నారు. ఇవి విద్యుదయస్కాంత శక్తిని ప్రసరించవు గనుక అవి మన కంటికి ఏ విధంగానూ కనిపించవు. వాటి గురుత్వాకర్షణ శక్తి ద్వారా మాత్రమే మనం

వాటిని గుర్తించగలం. విశ్వం యొక్క పరిణామంలో ఈ డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీ యొక్క పాత్ర ఏమిటో ఇప్పటికీ శాస్త్రవేత్తలకు తెలియదు. కాని 96 శాతం ఉన్న ఈ అగోచర విశ్వంలోనే మన భౌతిక శాస్త్రానికి అందని అనేక విషయాలు న్నాయని భావిస్తున్నారు.

ఇక మనకు తెలిసిన విశ్వపరిణామ క్రమంలో శాస్త్రవేత్తలకు తెలియని కొన్ని విషయాలు ఉన్నాయి. అవేమిటో తెలుసుకోవాలంటే శాస్త్రవేత్తలు రూపొందించిన విశ్వ నమూనా గురించి తెలుసుకోవాలి. మాక్స్ ప్లాంక్ రూపొందించిన క్వాంటమ్ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ యొక్క సాపేక్ష సిద్ధాంతాల మేలుకలయికతో విశ్వ నిర్మాణ నమూనా రూపొందించబడింది. దీని ప్రకారం.... విశ్వమంతా 24 రకాల ప్రాథమిక పదార్థ కణాలు, 4 రకాల ప్రాథమిక శక్తులతో నిర్మితమైంది. ప్రాథమిక కణాల్లో క్వార్కులు, లెప్టాన్లు అనేవి పరమాణు నిర్మాణంలో పాల్గొంటాయి. బొసన్లు అనేవి ఈ ప్రాథమిక కణాలకు శక్తిని చేరవేస్తాయి:

**6 రకాల క్వార్కులు: అప్, డౌన్, బోటమ్, టాప్, స్ట్రేంజ్, చార్మ్.**


**6 రకాల లెప్టాన్లు : ఎలక్ట్రాన్, ఎలక్ట్రాన్ న్యూట్రినో, మువోన్, మువోన్ న్యూట్రినో, టావు, టావు న్యూట్రినో**

**4 రకాల శక్తులు: బలహీన శక్తి, బలమైన శక్తి, విద్యుదయస్కాంత శక్తి, గురుత్వాకర్షణ శక్తి**

**12 రకాల బొసన్లు (శక్తిని మోసుకుపోయే ప్రాథమిక కణాలు): ఫోటాన్లు, (విద్యుదయస్కాంత శక్తి), డబ్ల్యు+, డబ్ల్యు-, జెడ్ బొసన్లు (బలహీన శక్తి), 8 రకాల గ్లువోన్స్ (బలమైన శక్తి), గ్రావిట్రాన్లు (భూమ్యాకర్షణ శక్తి)**

క్వార్కులు, లెప్టాన్లు పరమాణు నిర్మాణంలో పాల్గొంటాయి. బొసన్లు ప్రాథమిక శక్తులకు అనుబంధంగా ఉంటూ వాటినుండి శక్తిని ఇతర ప్రాథమిక కణాలకు చేరవేస్తూ ఉంటాయి. అంటే పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా మారడానికి ఈ బొసన్లు తోడ్పడతాయన్నమాట. ఉదాహరణకు బలహీన శక్తితో పదార్థాన్ని ఇచ్చిపుచ్చుకునేవి డబ్ల్యు+, డబ్ల్యు-, జెడ్ బొసన్లు. బలమైన శక్తితో ఇచ్చిపుచ్చుకునేవి గ్లువోన్స్. ఇవి ఎనిమిది రకాలు. విద్యుదయస్కాంత శక్తితో ఇచ్చిపుచ్చుకునేవి ఫోటాన్లు. గురుత్వాకర్షణ శక్తిని మోసుకుపోయేవి గ్రావిట్రాన్లు.

పరమాణు భాగాలైన ప్రోటాన్లు, న్యూట్రాన్లు వంటివన్నీ ఈ ప్రాథమిక కణాల కలయికతో ఏర్పడినవే. ఉదాహరణకు రెండు అప్ క్వార్క్‌లు, ఒక డౌన్ క్వార్క్‌ల బంధం వల్ల ప్రోటాన్ ఏర్పడుతుంది. ఇలాంటి రెండు ప్రోటాన్లు, రెండు న్యూట్రాన్ల కలయికవల్ల హీలియం-4 పరమాణు




**1947,72లో 2018లో మృతిచెందడానికి ముందు హాకింగ్**

కేంద్రకం ఏర్పడుతుంది. ఇలా వందలాది పరమాణు భాగాలు ఏర్పడతాయి.

ఈ మొత్తం ప్రాథమిక కణాలను ఒక దానితో ఒకటి కలిపి ఉంచే ఒక విశ్వ శక్తి ఉందని పీటర్ హిగ్స్ అనే ఆయన కొన్ని భౌతిక శాస్త్ర లెక్కల ద్వారా సిద్ధాంతీకరించాడు. ఆయన పేరుతో దాన్ని హిగ్స్ ఫీల్డ్ అని పిలుస్తున్నారు. ఈ హిగ్స్ ఫీల్డ్ నుండి పదార్థాన్ని ప్రాథమిక కణాలకు సమకూర్చే బొసన్లు కూడా ఉన్నాయని ఆయన చెప్పాడు. వాటిని హిగ్స్ బొసన్లు అంటున్నారు. అంటే విశ్వంలోని ప్రాథమిక కణాలకు పదార్థాన్ని ఇచ్చే కణాలే హిగ్స్ బొసన్లన్న మాట.

విషయమేమంటే మిగిలిన అన్ని ప్రాథమిక శక్తులు, ప్రాథమిక కణాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కాని హిగ్స్ బొసన్లను మాత్రం ఇంతవరకు కనుగొన లేదు. స్విట్జర్లాండులోని లార్జ్ హాడ్రన్ కొలైడర్‌లోనూ, చికాగోలోని ఫెర్మిలాబ్‌లోనూ ప్రాథమిక కణాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనలో హిగ్స్ బొసన్లను ప్రాథమికంగా గుర్తించినట్లు శాస్త్రవేత్తలు ఇటీవల తెలియజేశారు.

### ఎం- సిద్ధాంతం

ప్రాథమిక కణాలు, ప్రాథమిక శక్తులు ఏవిధంగా పనిచేస్తాయి... పదార్థం-శక్తి ఒక రూపం నుండి మరో రూపానికి ఎలా మారుతాయి... విశ్వం మనకు అనేక తలాలు (డైమన్షన్స్)గా ఎలా కనిపిస్తుంది అన్న విషయాన్ని గణిత సూత్రాల ద్వారా వివరించేదే ఎం-సిద్ధాంతం. అంటే పదార్థ మూలాన్ని కనుగొనేదే ఎం-సిద్ధాంతమన్న మాట.

ప్రాథమిక కణాలైన క్వార్క్‌లు, లెప్టాన్లు ఎలా ఉంటాయి? గణిత సూత్రం ద్వారా మాత్రమే వాని ఉనికిని వివరించగలం. ఈ ప్రాథమిక కణాల ఉనికిని వివరించే సూత్రాలనే 'స్ట్రింగ్ సిద్ధాంతం' అంటున్నారు. పదార్థం-శక్తి యొక్క అత్యంత ప్రాథమిక నిర్మాణ భాగాన్ని ఒకే తలంలో ఉండే 'స్ట్రింగ్స్' (దారం)గా గుణించారు. వీటికి పొడవు మాత్రమే ఉంటుంది. ఎత్తు, వెడల్పు ఉండవు. మొత్తం విశ్వం ఒకే తలం (డైమెన్షన్)లో కాకుండా అనేక తలాల్లో ఉన్నదని ఈ సిద్ధాంతం చెపుతుంది. మనకు మూడు తలాల గురించి తెలుసు. ఎత్తు, పొడవు, వెడల్పు. వీటికి కాలం కూడా కలిపితే విశ్వాన్ని మనం నాలుగు తలాల్లో (ఫోర్ డైమెన్షన్) పరిశీలించగలం. కాని శాస్త్రవేత్తలు 1980వ దశకంలో మనకు కనపించని మరో ఏడు తలాలను కనుగొన్నారు. మొత్తం 11 తలాల్లో (11 డైమన్షనల్ స్పేస్) విశ్వం విస్తరించి ఉంది. శాస్త్రవేత్తలు సృష్టించిన నమూనా ప్రకారం 'స్ట్రింగ్స్' (దారాలు) అనేక తలాల్లో ప్రకంపిస్తూ (వైబ్రేటింగ్) ఉంటాయి. అవి ఎలా ప్రకంపిస్తున్నాయి అనే దాన్ని బట్టి అవి పదార్థం, కాంతి, లేక గురుత్వాకర్షణ రూపాల్లోని ఏ రూపంలో ఉంటాయో నిర్ణయమవుతుంది. అంటే అది పదార్థ రూపంలో ఉంటుందా, లేక శక్తి రూపంలో ఉంటుందా లేక ఈ రెండు రూపాల్లో కూడా ఏ స్థితిలో ఉంటుంది అన్నది స్ట్రింగ్స్ యొక్క ప్రకంపనల మీద ఆధారపడి ఉంటుందన్న మాట.

అయితే ఇక్కడ కూడా ఒక చిక్కు వచ్చిపడింది. అనేక మంది భౌతిక శాస్త్రవేత్తలు అనేక రకాల స్ట్రింగ్ సిద్ధాంతాలు కనిపెట్టారు. ఒక్కో స్ట్రింగ్ ప్రకంపించే తలాల్లో తేడాలను బట్టీ, వాటి లక్షణాలను బట్టీ (కొన్ని కొనలు విడిగా ఉన్నవి, కొన్ని కొనలు మూసుకున్నవి ఇలా...) అనేక రకాల స్ట్రింగ్ సిద్ధాంతాలు బయలుదేరాయి. ఇలా మొత్తం మీద అయిదు రకాల స్ట్రింగ్ సిద్ధాంతాలు రూపొందాయి. విశేషమేమంటే ఈ సిద్ధాంతాలన్నీ సరైనవేనని తేలింది. ఇది శాస్త్రవేత్తలను చీకాకు పరిచే అం

శం. ఒకేదాన్నివివరించేందుకు ఒకదానితో ఒకటి పొసగని గణిత సూత్రాలు ముందు కొచ్చాయి.

దాంతో 1990 మధ్యలో ఎడ్వర్డ్ విట్టెన్ అనే శాస్త్రవేత్త ఇతరులతో కలిసి ఈ సమస్యకు పరిష్కారం చూపారు. వారి సూత్రం ప్రకారం అయిదు రకాల స్ట్రింగ్ సిద్ధాంతాలు కూడా ఒకే విషయాన్ని అయిదు కోణాల్లో వివరిస్తున్నాయి. ఈ అయిదు కోణాలనూ కలిపి వారు ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అదే ఎం-సిద్ధాంతం. ఎం అంటే ఇక్కడ మెంబ్రేన్ (పొర) అని. దీనికి 'మాట్రిక్స్' అనీ, 'మదర్' అనీ, మాన్‌స్టర్, మిస్టరీ, మాజిక్..ఇలా చాలా పేర్లు పెట్టారు. అంటే అనేక దారాలతో ఒక గుడ్డను తయారు చేసినట్లు అన్ని రకాల స్ట్రింగ్ సిద్ధాంతాలనూ కలిపి వారు మెంబ్రేన్-సిద్ధాంతం తయారు చేశారన్న మాట. దాన్ని వాళ్లు ఇలా నిర్వచించారు: "స్ట్రింగ్స్ అనేవి వాస్తవంగా 11 తలాల విశ్వంలో ప్రకంపించే... రెండు తలాల పొరలోని ఒక తలం గల ముక్కలు".

ఎం-సిద్ధాంతం ఇంకా సంపూర్ణంకాలేదు. కాని ప్రపంచంలోని శాస్త్రవేత్తలంతా దానితో ఏకీభవిస్తున్నారు. కారణమేమంటే, విశ్వ నిర్మాణానికి సంబంధించి క్వాంటమ్ సిద్ధాంతం, గురుత్వాకర్షణ సిద్ధాంతం విడిగా చెప్పలేక పోతున్న అనేక సమస్యలను ఈ సిద్ధాంతం పరిష్కరిస్తోంది. అయితే గణిత సూత్రాల ఆధారంగా నిర్మితమైన ఎం-సిద్ధాంతం ప్రయోగాత్మకంగా నిరూపితం కావాల్సి ఉంది. అప్పుడే సైన్సు దాన్ని పూర్తిగా అంగీకరిస్తుంది. కాని ప్రస్తుతం మానవాళివద్ద నున్న సాంకేతిక పరిజ్ఞానంతో దాన్ని నిరూపించడం కష్టం. ఎందుకంటే దాన్లో పేర్కొన్న సమయాలను కొలవాలంటే మనం అంతరిక్షంలో మహాభారీ పరిశోధనా శాలలు పెట్టాలి. స్టీఫెన్ హాకింగ్‌తో సహా భౌతిక శాస్త్రవేత్తలంతా ఈ ఎం-సిద్ధాంతాన్ని అంతిమ సిద్ధాంతంగా చెబుతున్నారు. 'అన్నిటికి సంబంధించిన సిద్ధాంతం' (థియరీ ఆఫ్ ఎవ్రిథింగ్) అని జపాన్ భౌతిక శాస్త్రవేత్త మిచియో కకు దీని గురించి పేర్కొన్నారు. విశ్వాన్ని దేవుడు సృష్టించాడా, లేక దానికదే సృష్టించబడిందా అంటే విశ్వం ఎవరిచేతా సృష్టించబడలేదు. కొన్ని ప్రాథమిక భౌతిక శాస్త్ర సూత్రాల ఆధారంగా ఆవిర్భవించి, నడుస్తోంది అని హాకింగ్ చెప్పాడు.

**అభ్యుదయవాది**

స్టీఫెన్ హాకింగ్ గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు గొప్ప అభ్యుదయ వాది కూడా. 1963లో ఆయన వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా తారిక్ ఆలీ తదితరులతో ప్రదర్శనలో పాల్గొన్నాడు. 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను వ్యతిరేకించడమే కాదు ఇది యుద్ధ



**భార్య జేన్, పిల్లలు రోబర్ట్, లూసీలతో 1978లో హాకింగ్**

నేరం అని ధైర్యంగా ప్రకటించాడు. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగతాలకు నిరసనగా ఇజ్రాయిల్‌లో కార్యక్రమాలను బాయ్‌కాట్ చేశాడు. అణు నిరాయుధీకరణకు మద్దతుగా, సార్వత్రిక ఉచిత వైద్యం కోసం, వాతావరణ మార్పులను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రచారం చేశాడు.

హాకింగ్ ప్రయివేటీకరణకు బద్ధ వ్యతిరేకి. ప్రజల ఆరోగ్యాన్ని లాభాల కోసం ఉపయోగించుకోవడం దారుణమని చెప్పాడు. "వైద్య వ్యవస్థను మరిన్ని లాభాల కోసం ఉపయోగించుకోవడం మొదలు పెడితే, మరిన్ని ప్రయివేటు గుత్త సంస్థలు పెరుగుతాయి, వైద్యం మరింత ఖరీదైపోతుంది" అని పేర్కొన్నాడు.

భూ తాపంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు, 'ఆయన విధానాలు భూ గోళాన్ని ప్రమాదంలో పడేస్తాయి, భూమి తిరిగి వెనక్కు రాలేని విధంగా వేడెక్కుతుంది' హాకింగ్ పేర్కొన్నాడు.

హాకింగ్ శాస్త్రీయ దృక్పథం కలిగిన శాస్త్రవేత్త."ఈ విశ్వం సైన్సు సూత్రాలచేత నడుస్తోందని" చెబుతాడు. 'మతం ఆదేశాల మీద ఆధార పడుతుంది, సైన్సు పరిశీలన, తర్కం మీద ఆధార పడుతుంది' అని పేర్కొంటాడు. గార్డియన్ పత్రికలో ప్రచురితమైన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ స్వర్గం అనేది ఒక మిథ్య అని చెప్పాడు. "మరణానంతర జీవితం లేదు, స్వర్గం లేదు. అదంతా కూడా చీకటిని చూసి భయపడే మనుషులు సృష్టించుకున్న కథ" అని స్పష్టం చేశాడు. మేధావులనుకున్న వారే చిన్నచిన్న కష్టాలను చూసి బయపడి దైవ భావం ముందు, బాబాల ముందు మోకరిల్లుతున్న ఈ రోజుల్లో అవయవాలు కదలక వీల్ ఛైర్‌కు అతుక్కుని, మృత్యువుతో పోరాడుతూ కూడా దైవ భావాన్ని, పునర్జన్మనూ తిరస్కరించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శాస్త్ర విజ్ఞానం పట్ల నిబద్ధత గలిగిన తత్వజ్ఞాని గనుకనే ఆయన భౌతికవాద సిద్ధాంతంతో అచంచలంగా నిలబడగలిగారు. తన పరిశోధనల్లో ఎక్కడా విశ్వసృష్టికి దేవుని అవసరం రాలేదని ఆయన కరాఖండిగా చెప్పాడు.


మానవుడు సృష్టిస్తున్న కృత్రిమ మేధస్సు వల్ల మానవాళికి భవిష్యత్తులో ప్రమాదం ఉందన్న వాదనపై హాకింగ్ మాట్లాడుతూ ఇలా చెప్పాడు : "రోబోట్‌ల వల్ల మానవాళికి ప్రమాదం ముంచుకొస్తోందని చాలా మంది అంటు న్నారు. కానీ రోబోట్‌ల కన్నా ప్రమాదకరమైంది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ. మనం కోరుకున్న వాటన్నిటినీ యంత్రాలు ఉత్పత్తి చేస్తే అప్పుడు ఆ ఉత్పత్తి ఎలా పంపిణీ జరుగుతోంది అన్న దానిపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. యంత్రాలు ఉత్పత్తి చేసే సంపద పంపకం జరిగితే అప్పుడు ప్రతి వ్యక్తీ విలాసవంతమైన విశ్రాంత జీవితం గడుపుతాడు. అలా కాకుండా యంత్రాల యజమానులు సంపద పంపిణీని అడ్డుకుంటే అత్యధిక ప్రజలు తీవ్రమైన దుర్భర జీవితాన్ని ఎదుర్కొన వలసి వస్తుంది. అంటే యాంత్రీకరణతో విపరీతమైన అసమానతలను పెంచే దిశగా ప్రపంచం పయనిస్తోంది. పెట్టుబడి మరింతగా పోగుచేసుకోడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలు టెక్నాలజీ లక్ష్యాన్నే మార్చేస్తున్నాయి. ప్రజల సంపద పెంచడం కోసం కాకుండా మానవుల ఉపాధి పోగొట్టడమే దాని లక్ష్యంగా మారిపోయింది. ఈ హెచ్చరికను తీవ్రంగా తీసుకోకపోతే మనం అంతులేని కార్పొరేట్ ఆధిపత్యానికి లోనవుతాము. మన రాజకీయ వ్యవస్థనూ, వనరులనూ అమ్ముతూ, కొంటూ ఉండే వాళ్ల చేతుల్లోకి కృత్రిమ మేధస్సు వెళ్లిపోడానికి అనుమతిస్తే మనం చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొనవలసి వస్తుంది."

అందుకనే స్టీఫెన్ హాకింగ్ గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు మనకాలపు మహాజ్ఞాని. అటువంటి మహనీయుని మృతి ప్రపంచ మేధో జీవితానికి తీరని లోటు. ఆయన ప్రజ్ఞాపాటవాలే కాదు వాటిని సాధించడానికి ఆయన జీవితంతో జరిపిన గొప్ప పోరాటం కూడా నేటి తరానికీ, రానున్న తరాలకు స్ఫూర్తినిస్తాయి. ❈

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-04-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# అర్ధ శ్రామికులను విప్లవంలోకి సమీకరించాలి

**– మావో**



**అర్ధశ్రామికవర్గం:** ఇక్కడ అర్ధశ్రామికవర్గం అని చెబుతున్న వాళ్లల్లో అయిదురకాల వాళ్లున్నారు. 1) అత్యధిక సంఖ్యలో వున్న సన్నకారు రైతులు (2) పేదరైతులు 3) చిన్నతరహా చేతిపనులవారు 4) దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు 5) చిల్లర వ్యాపారాలు చేసేవారు. గ్రామీణ జనసామాన్యంలో అత్యధిక భాగం సన్నకారు రైతులు, పేదరైతులు. రైతు సమస్య ప్రధానంగా వీరి సమస్యయే. సన్నకారు రైతులు, పేదరైతులు చిన్నతరహా చేతిపనులవాళ్లు – వీరంతా స్వంతభూమిగల రైతులు, యజమానులైన చేతిపనివారితో పోలిస్తే మరీ తక్కువస్థాయి ఉత్పత్తి విధానంలో నిమగ్నమై ఉంటారు. అధిక సంఖ్యలోగల సన్నకారు రైతుల, పేదరైతులు అర్ధశ్రామికులే అయినా, వీరి ఆర్థికస్థితినిబట్టి వీరిని మళ్లీ ఉన్నత, మధ్య, క్రింది తరహా అని మూడు రకాలుగా విభజించవచ్చును. స్వంత భూమిగల రైతులకంటే సన్నకారు రైతుల స్థితి మరీ అధ్వాన్నం. ఎందుకంటే, వీరికి సంవత్సరానికి కావలసిన తిండిగింజలలో ఎప్పుడూ సగం కొరత ఉంటుంది. ఈ లోటు భర్తీ చేయడానికి వారు ఇతరుల భూమి కౌలుకు చేయాలి: కొంత శ్రమశక్తిని అమ్ముకోవాలి లేదా చిల్లర వ్యాపారం చేయాలి. వసంతకాలం చివరిలోనూ, వేసవి ప్రారంభంలోను చేను ఇంకా ఆకు వేస్తుండగానే పాతపంట అంతా ఖర్చయిపోగా, వీరు దారుణమైన రేటు పెట్టి వడ్డీకి అప్పులు తెస్తారు. విపరీతమైన అధికధరలకు ధాన్యం కొంటారు. ఇతరుల సహాయంతో పనిలేని స్వంతభూమిగల రైతులకంటే సహజంగానే వీరిస్థితి కష్టభరితంగా ఉంటుంది. అయితే, పేద రైతులకంటే వీరి పని కొంతనయం. ఎందుకంటే పేద రైతుకు స్వంతభూమి ఏమీ ఉండదు. సంవత్సరం పొడవునా కష్టపడి పండించిన పంటలో సగమో, సగంకంటే తక్కువో అతనికి దక్కుతుంది. సన్నకారు రైతుకి కౌలుభూమిలో దక్కేది సగంపంట అయినా, స్వంతభూమిలో పంట మొత్తం తనకే ఉంటుంది. అందుకే సన్నకారు రైతులు స్వంత భూమిగల రైతులకంటే ఎక్కువ విప్లవకరంగానూ, అసలే భూమిలేని పేద రైతులకంటే తక్కువ విప్లవకరంగానూ ఉంటారు. పేదరైతులు, కౌలుదారులు భూస్వాముల చేత దోచుకోబడతారు. ఆర్థికస్థితిని బట్టి వీరిని తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక తరహా వారికి, రెండో తరహా వారితో పోల్చినప్పుడు తగినన్ని వ్యవసాయ పనిముట్లు, మదుపు ఉంటాయి. వీళ్లు సంవత్సరం పొడవునా పడ్డ కష్టంలో సగం ఫలితం మిగుల్చుకోవచ్చు. వారి లోటును భర్తీ చేయడానికి ఇతర పంటలు పండిచడం, చేపలు పట్టడం, కోళ్లు, పందులు పెంచడం, కొంత శ్రమ నమ్ముకోవడం (అప్పుడప్పుడు కూలికి పోవడం–అను) వంటి వాటి ద్వారా కొంత జీవనోపాధి సమకూర్చుకుంటూ అంత దరిద్రంలోనూ అంతటి కష్టాల్లోనూ కూడా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఎలాగో ఒకలాగా నెట్టివేయవచ్చుననే ఆశతో గడుపుతారు. ఆ విధంగా వారి జీవితం సన్నకారు రైతుల కంటే కష్టభరితమే అయినా, మరో తరహా పేదరైతుల కంటే మెరుగ్గానే ఉంటుంది. అట్లా వీళ్లు సన్నకారు రైతులకన్నా ఎక్కువ విప్లవకరంగానూ, మరో తరహా పేదరైతుల కన్నా తక్కువ విప్లవకరంగానూ ఉంటారు. ఇక రెండో తరహా పేదరైతులకు చాలినన్నీ వ్యవసాయ పనిముట్లు కాని, మదుపు కాని, ఎరువులు కాని ఉండవు. వీళ్ల పంటలు చాలా నాసిగా (హీనంగా) ఉంటాయి. కౌలు చెల్లించిన తర్వాత వీళ్లకు మిగిలేది మరీ తక్కువ కావడంతో కూలి చేయాల్సిన అవసరం వీళ్లకు మరీ ఎక్కువగా ఉంటుంది. కష్టకాలంలో వీళ్లు బంధువుల దగ్గర స్నేహితుల దగ్గర చాలా దయనీయంగా సహాయం అడుక్కుంటారు. కొద్ది రోజులు గడిస్తే చాలనీ చిల్లర మల్లరగా ధాన్యం అప్పు తెచ్చుకుంటారు. వీరి రుణాలు గాడిద బరువుగా పెరుగుతూనే ఉంటాయి. రైతులందరిలోకి వీరి స్థితి మరీ అధ్వాన్నంగా ఉంటుంది. విప్లవ ప్రచారం వీళ్లను బాగా ఆకట్టుకుంటుంది. సన్నకారు చేతి పనివాళ్లను కూడా అర్ధశ్రామికులని ఎందుకంటామంటే, వీరికి అతి సామాన్యమైన ఉత్పత్తి సాధనాలు కొన్ని స్వంతానికి ఉన్నప్పటికి వీళ్లు స్వయంగానే, వృత్తి చేసుకుంటున్నప్పటికి, తరచుగా వీరు కూడా కూలి చేయకతప్పదు. వీరి ఆర్థిక స్థితి కూడా పేదరైతుల ఆర్థికస్థితిలాగానే ఉంటుంది. తీవ్రమైన కుటుంబ భారం వల్ల ఆదాయానికి జీవన వ్యయానికి మధ్యనుండే వ్యత్యాసం వల్ల వీరు నిత్యం దారిద్ర్యం, నిరుదోగ్యాల బాధకు లోనవుతూ ఉంటారు. ఈ విషయంలో కూడా వీరు ఎక్కువగా పేదరైతులను పోలి ఉంటారు. దుకాణాల్లో, స్టోర్స్‌ల్లో ఉద్యోగాలు చేసుకుంటూ అతి తక్కువ జీతాలతో కుటుంబాలు లాగుతూ, ధరలు ప్రతియేడూ పెరుగుతున్నా, జీతాలు మాత్రం ఎన్నో ఏళ్ల కొకసారి మారేవాళ్లు దుకాణపు గుమస్తాలు. వీరితో గాని సన్నిహితంగా మాట్లాడం తటస్థిస్తే వీరు తమ గోడు తెరపి లేకుండా చెబుతారు. ఇంచుమించుగా పేదరైతుల, సన్నకారు చేతిపనివాళ్లు ఆర్థికస్థితితోనే వుండే వీరు విప్లవ ప్రచారాన్ని చాలా సుముఖంగా స్వీకరిస్తారు. చిల్లర బేరగాళ్లు నెత్తిన బుట్టలు వేసుకునో, భుజానా కావడి వేసుకునో వీధి వీధి తిరిగి సరుకులమ్మేవాళ్లూ కానివ్వండి, లేదా రోడ్డుపక్క చిన్న బడ్డీకొట్టు పెట్టుకునే వాళ్లు కానివ్వండి– వీరంతా స్వల్పమైన పెట్టుబడి, మరీ తక్కువ రాబడి కలవాళ్లే. వీళ్లు తిండికీ బట్టకీ సరిపోయేటంత కూడా అర్జించలేరు. వీరి ఆర్థికస్థితి ఇంచుమించు పేదరైతుల స్థితి వంటిదే. పేదరైతులకు వలెనే వీరికి కూడా ఉన్న పరిస్థితులను మార్చడానికి విప్లవం అవసరం.

*(మావో రచించిన 'చైనా సమాజంలో వర్గ విశ్లేషణ' వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D.No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.12. Published on April 1, 2018